www.andhrajyothy.com

వెల (Price) : Rs. 8.00

విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 25-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 131

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి తె. 3.39 తదుపరి అష్టమి; నక్షత్రం: భరణి సా. 4.45 తదుపరి కృత్తిక; వర్జ్యం: తె. 4.20-5.52; దుర్ముహూర్తం: సా.4.50-5.40; అమృతఘడియలు: మ. 12.13-1.43; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.30

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



‘మాయా’ సైన్యం!



‘పాతాళ భైరవి’లో కంబళి కప్పుకోగానే మనిషి మాయమైపోయినట్లు... ‘మిస్టర్ ఇండియా’లో చేతికి కంకణం కట్టుకోగానే కనిపించకుండా పోయినట్లు... ఆ దుస్తులు వేసుకుంటే నిజంగానే ‘అదృశ్యం’ అయిపోతారా? ఉక్రెయిన్ చేతిలో చావు దెబ్బలు తినడానికి ‘అదృశ్య సైనికులే’ కారణమని రష్యా అనుమానిస్తోందా? ఆ కథనంలో ఏముంది? 2



వన మహోత్సవం

‘ఊరూ వాడా కదలండి! పచ్చటి మొక్కలు నాటండి!’ అని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పరుచుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా ‘వన మహోత్సవం’ విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నగర వనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. 2

హరియాణా.. క్రీడా సమరాంగణం

తొడగొట్టే క్రీడాకారులు, పడగొట్టే మల్లయోధులు, గురితప్పని షూటర్లు హరియాణాలో ఎలా తయారవుతున్నారు? ర్యాంకుల వేట, కెరీర్ గోలకు వాళ్లు అతీతమా? పతకాల వేటగాళ్ల కార్ఖానాగా హరియాణా ఎలా మారింది! మరిన్ని ఆసక్తికరమైన కథనాలు, వింతలు, విశేషాలతో నేటి


‘ఆదివారం ఆంధ్రజ్యోతి’ అనుబంధం..

ఒక కిక్కు కథ

థ్రిల్లర్ స్టోరీ.. హవాలా దారి.. మాఫియా మాదిరి..

జగన్ హయాంలో నడిచిన ‘కమీషన్ చిత్రం’

- తెర వెనుక సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర రెడ్డి
- ఆయన ఆధ్వర్యంలోనే మద్యం కమీషన్ల వసూలు
- కంపెనీల ప్రతినిధులతో ‘ప్రకాశ్ కాలింగ్’
- విదేశీ సిమ్‌లతోనే మొత్తం మంత్రాంగం
- ప్లేస్, టైమ్ ఫిక్స్ చేసి నగదు మార్పిడి
- ఎవరో వస్తారు.. తీసుకుని వెళ్తారు
- అంతిమంగా చేరింది నాటి సర్కారు పెద్దలకే!
- ఐదేళ్లలో 3 వేల కోట్లకుపైగా కలెక్షన్
- మధ్యలో కసిరెడ్డి సొంత బ్రాండ్ల అమ్మకం
- నాలుగేళ్లలో 1.25 కోట్ల కేసుల ఆర్డర్లు



ఒకసారి కనిపించిన వాడు మళ్లీ కనిపించడు! ప్రతిసారీ ‘వినిపించే’ వాడు ఎప్పుడూ కనిపించడు! మొత్తం చక్రం తిప్పే వ్యక్తి ఎప్పటికీ తెరవెనుకే ఉంటాడు! డబ్బు సంచులు మాత్రం మారుతూనే ఉంటాయి. చేరాల్సిన వాళ్లకు చేరుతూనే ఉంటాయి! ఇదీ.. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు సాగిన ‘కమీషన్ల కిక్కు’ కథ! ఇందులో థ్రిల్లర్ సినిమాలకు మించిన సీన్లు! ‘మాఫియా’ను మించిన వ్యూహాలు! అటు మాఫియా, ఇటు హవాలా కలగలిపి సాగిన ఈ దందా మొత్తాన్ని ‘సైలెంట్’గా నడిపించిన వ్యక్తి పేరు... కసిరెడ్డి రాజశేఖర రెడ్డి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎవరో వస్తారు! ‘కోడ్’ చెబుతారు! డబ్బు సంచి తీసుకెళ్లిపోతారు! ఇది మాఫియా స్టైల్! జగన్ హయాంలో మద్యం దందాలో కమీషన్ల వసూలు కూడా అచ్చం ఇలాగే సాగింది. గత ఐదేళ్లలో మద్యంపై వసూలు చేసిన కమీషన్లు రూ.3,113 కోట్లు. ఇంత భారీ స్థాయిలో ముడుపులు వసూలు చేయడం ఆషామాషీ వ్యవహారం కాదు. అసలు ఇన్ని వేల కోట్లు ఎలా వసూలు చేశారు? ఎవరికీ దొరక్కుండా ఇంత డబ్బు ఎలా చేతులు మారింది? మూడో కంట పడకుండా వేల కోట్లు వసూలు చేయించింది ఎవరు? మద్యం కంపెనీల వర్గాలు చెబుతున్న పేరు కసిరెడ్డి రాజశేఖర రెడ్డి. ఏ కంపెనీకి ఆర్డర్లు ఇవ్వాలి? షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలి? అనేది అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి నిర్ణయిస్తే.. ఆర్డర్లు పొందిన కంపెనీల నుంచి కమీషన్లు

మిగతా 12వ పేజీలో...

ఈ బ్రాండ్లకు కళ్లు చెదిరే ఆర్డర్లు

బ్రాండ్	2023-24	2018-19
సిరి క్లాసిక్ బ్లూ ఫైనెస్ట్ విస్కీ	18,97,693	0
గ్రేసన్స్ సిల్వర్ స్ట్రిప్స్ ఒరిజినల్ విస్కీ	16,92,396	0
రాయల్ ప్యాలెస్ బ్రాందీ	15,71,923	0
ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ	14,57,004	0
గ్రేసన్స్ కింగ్స్‌వెల్ సెలెక్ట్ బ్రాందీ	11,28,809	0

రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలకూ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలన్న హామీ అమలు దిశగా ప్రభుత్వం వేగం పెంచింది. హైబ్రిడ్ విధానం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఆమోదం తెలిపారు. అయితే వివిధ రాష్ట్రాల్లోను, అంతర్జాతీయంగా ఎక్కడ మంచి బీమా అమలవుతోంది.. అక్కడి పరిస్థితులపై కూడా అధ్యయనం చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు మరింత లోతుగా కసరత్తు చేస్తున్నారు.



ఆరోగ్య ధీమా.. అందరికీ బీమా

5 కోట్ల మందికీ రూ.25 లక్షల చొప్పున!

‘హైబ్రిడ్’ విధానానికి సీఎం సానుకూలం

- బీమా సంస్థల ప్రతినిధులతో ఆరోగ్యశాఖ చర్చలు
- వివిధ రాష్ట్రాల్లో అమలు తీరుపై మరింత కసరత్తు
- రూ.2.5 లక్షల వరకూ బీమా సంస్థల ద్వారా వైద్యం
- ఆ మొత్తం దాటితే ఎన్టీఆర్ ట్రస్టు పరిధిలోకి
- ఏపీఎల్ జనాభాకూ బీమా సదుపాయం
- వీరివరకు ఎక్కువ ప్రీమియం చెల్లించనున్న సర్కారు!
- మరికొంత వారే కంపెనీలకు చెల్లించేలా ఏర్పాటు?
- ఉద్యోగులు, పెన్షనర్లకూ బీమా కార్డులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అమలవుతున్న ఆరోగ్య బీమా విధానాలను పరిశీలించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు హైబ్రిడ్ విధానంలో ప్రజలకు బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. బీమా కంపెనీలతోనూ అనేక సమావేశాల తర్వాత మొత్తం 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకూ హైబ్రిడ్ విధానంలో ఆరోగ్య బీమా అమలు చేస్తే బాగుంటుందని సీఎం చంద్రబాబుకు తెలియజేశారు. ఆయన కూడా సూత్రప్రాయంగా సరేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.43 కోట్ల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరంతా


మిగతా 12వ పేజీలో...

డిసెంబరు 1 నుంచి అమరావతి పనులు

- నిర్మాణానికి 60 వేల కోట్ల అంచనా.. నాలుగేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యం
- సమాంతరంగా 26 జిల్లాల అభివృద్ధి.. మంత్రి నారాయణ వెల్లడి
- జగన్ హయాంలో వెళ్లిపోయిన నిర్మాణ సంస్థలు తిరిగి రావాలి: కేంద్ర మంత్రి వర్మ



12



వెంకన్నా.. ఇదేం విచారణ?



సూత్రధారులను వదిలేసి ఉద్యోగులపై విజిలెన్స్!


- నాటి చైర్మన్లు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి అదనపు ఈవో ధర్మారెడ్డిపై ఆరోపణలు
- ఇంజనీరింగ్ విభాగంలో వేలకోట్లు కేటాయింపు వెనుక కమీషన్ల దందా
- అవసరం లేకున్నా గోవిందరాజస్వామి సత్రాలు.. దర్శనాల్లోనూ ఇష్టారాజ్యం
- శ్రీవాణి ట్రస్టు నిధుల దుర్వినియోగం.. రెవెన్యూ, మార్కెటింగ్ విభాగాల్లో అక్రమాలు
- కూటమి సర్కారులో విజిలెన్స్ విచారణ.. పెద్దలను వదిలేసి ఉద్యోగులకు నోటీసులు
- ఇలాగైతే అక్రమార్కులను గుర్తించేదెలా?.. విచారణ తీరుపై సర్వత్రా విమర్శలు

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

అసలు సూత్రధారులను వదిలేసి... ఉద్యోగులపై విజిలెన్స్ ఉరిమి పడుతోంది! నోటీసులతో బెంబేలెత్తిస్తోంది. టీటీడీలో ఇప్పుడు ఇదో సంచలనంగా మారింది. అప్పటి పాలక మండలి చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డితో పాటు అదనపు ఈవో ధర్మారెడ్డిపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ముగ్గురిపై పలు ఫిర్యాదులు అందాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ

మిగతా 11వ పేజీలో...

పాతికేళ్లు బాదుడే!



జగన్ నిర్వాకంతో జనంపై లక్ష కోట్లకు పైగా భారం!

- సెకీతో పాతికేళ్లకు అగ్రిమెంట్.. 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు ఓకే
- యూనిట్ రూ. 2.49 మాత్రమేనన్న జగన్
- ట్రాన్స్‌మిషన్ చార్జీలూ చెల్లించక్కర్లేదన్నారు
- కానీ ఆయన చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే

3



పింఛనుకు కొత్త పథకం

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఏకీకృత పెన్షన్

వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి

- 25 ఏళ్ల సర్వీసు ఉంటే చివరి 12 నెలల మూలవేతనం సగటులో 50%
- 10 ఏళ్ల సర్వీసుకు కనీస పింఛను 10 వేలు.. ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం
- రాష్ట్రాలు అమలు చేయాలని సూచన.. బయో ఈ-3 విధానానికి పచ్చజెండా

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఏకీకృత(యూనిఫైడ్) పింఛన్ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని వల్ల పదవీ విరమణ పొందే ఉద్యోగులకు ఇప్పుడు లభిస్తున్న ప్రయోజనాల కంటే.. ఏకీకృత పింఛన్ పథకం (యూపీఎస్)లో మరింత లబ్ధి చేకూరనుంది. రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం కోరింది. శనివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు.. బయోఈ-3 విధానానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. శాస్త్రసాంకేతిక రంగాల్లో మూడు వేర్వేరు పథకాలను కలిపి.. విజ్ఞాన్ ధార పథకంగా అమలు చేయాలని నిర్ణయించింది. కేబినెట్ భేటీ తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ వివరాలను వెల్లడించారు. యూపీఎస్ ద్వారా సుమారు 23 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే.. లబ్ధిదారుల సంఖ్య 90 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కొత్త పింఛన్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ‘ప్రస్తుతం పింఛన్ విధానాల బకాయిలు రూ.800 కోట్లుగా ఉన్నాయి. కొత్త పింఛన్ అమలుతో తొలి ఏడాది రూ.6,250 కోట్ల వరకు అదనంగా

త్వరలో బయో విప్లవం — కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

మిగతా 2వ పేజీలో...

ఎన్ కన్వెన్షన్ నేలమట్టం!

- సినీనటుడు నాగార్జునకు చెందిన నిర్మాణం కూల్చివేత
- తెల్లవారుజామునే రంగంలోకి.. 5 గంటల్లో పని పూర్తి
- ఈలోపు హైకోర్టుకు వెళ్లిన కన్వెన్షన్ యాజమాన్యం
- యథాతథ స్థితికి న్యాయమూర్తి ఆదేశం
- చెరువును అంగుళం కూడా ఆక్రమించలేదు
- తప్పుడు సమాచారంతో కూల్చేశారు: నాగార్జున

2



హైదరాబాద్‌లో శనివారం కూల్చివేసిన ఎన్ కన్వెన్షన్

ఇండో-బంగ్లా సరిహద్దుల్లో ఉద్రిక్తత

న్యూఢిల్లీ/ఢాకా, ఆగస్టు 24: హసీనా రాజీనామా తర్వాత భారత్-బంగ్లాదేశ్ మధ్య సత్సంబంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. తాజాగా.. భారత సరిహద్దు భద్రత దళం(బీఎస్ఎఫ్) చేపట్టిన పశువుల కంచెల నిర్మాణాన్ని బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్స్(బీజీబీ) అడ్డుకుంది. ఈ ఘటన గురువారం సాయంత్రం ఉత్తర బెంగాల్‌లోని కుచ్‌బెహార్ సమీపంలో చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి పశువుల కంచె నిర్మాణాన్ని నిలిపివేశామని.. అక్టోబరులో ఢిల్లీలో జరిగే ఉభయ దళాల డైరెక్టర్ జనరల్స్ సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తామని పేర్కొన్నారు. సరిహద్దుల్లో పశువుల కంచె నిర్మాణానికి 2012లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. మరోవైపు శనివారం ఉదయం పొరపాటున బంగ్లాదేశ్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించిన ఐదుగురు పౌరులను తిరిగి అప్పగించడానికి బీజీబీ నిరాకరించింది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని సిల్హేట్ వద్ద భారత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి షంషుద్దీన్ చౌదరి మాణిక్‌ను బీజీబీ అరెస్టు చేసింది.

2026 నాటికి నక్సలిజం అంతం: అమిత్ షా

రాయ్‌పూర్/హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థకు నక్సలిజం అతి పెద్ద సవాలని, నక్సలిజంపై అంతిమ దాడికి సమయం ఆసన్నమైందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. 2026 నాటికి నక్సలిజం అంతమవుతుందని తేల్చిచెప్పారు. శనివారం ఆయన తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సహా.. ఏడు నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, ఇతర ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన 'అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ' సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గడిచిన 4 దశాబ్దాల్లో నక్సలిజం కారణంగా 17వేల మంది ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. తాము వామపక్ష తీవ్రవాదాన్ని సవాలుగా తీసుకుని, దానిపై దృష్టి సారించామని గుర్తుచేశారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 147 మంది నక్సలైట్లు హతమయ్యారని, 723 మంది నక్సల్స్‌ను అరెస్టు చేశామని.. రానున్న మూడేళ్లలో ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ రహిత రాష్ట్రంగా మారుతుందని స్పష్టం చేశారు.

'బుల్డోజర్ న్యాయం' సరి కాదు: ప్రియాంక

న్యూఢిల్లీ, ఆగస్టు 24: 'బుల్డోజర్ న్యాయం' ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దానిని వెంటనే నిలుపుదల చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ డిమాండు చేశారు. హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నారన్న కారణంతో మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్ జిల్లాలో ఓ వ్యక్తి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేయడంపై స్పందిస్తూ ఈ డిమాండు చేశారు. "నేరం చేసినట్టు ఎవరిపైనైనా ఆరోపణలు ఉంటే కోర్టు మాత్రమే వారికి శిక్ష విధిస్తుంది. ఆరోపణలు వచ్చీ రాగానే నిందితుడి ఇల్లు కూల్చివేసి, మొత్తం కుటుంబానికి నిలువ లేకుండా చేయడం కోర్టులను ధిక్కరించడం కిందికే వస్తుంది. ఇది అన్యాయం. కిరాతకానికి పరాకాష్ఠ. ప్రభుత్వమే క్రిమినల్స్ మాదిరిగా వ్యవహరించకూడదు" అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలే లక్ష్యంగా బుల్డోజర్లను ప్రయోగిస్తుండడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటన భేష్..!

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటన, ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీపై ప్రపంచ మీడియా సానుకూలంగా స్పందించింది. 'యుద్ధంలో తలపడుతున్న ఇరు దేశాల మధ్య సమతూకంతో మోదీ వ్యవహరించారు' అని న్యూయార్క్స్ టైమ్స్ పేర్కొంది. 'యుద్ధం విషయంలో భారత్ ఎప్పుడూ తటస్థంగా లేదు. మొదట్నుంచీ మాది శాంతి పక్షమే' అంటూ మోదీ చేసిన వ్యాఖ్యలను బీబీసీ హైలైట్ చేసింది. 'మోదీ పర్యటన చరిత్రాత్మక ఘట్టం..' అంటూ జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలను లె మొండే ప్రముఖంగా ప్రచురించింది. 1991లో ఉక్రెయిన్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధాని మోదీయేనని అన్ని వార్తా సంస్థలు వెల్లడించాయి. పరస్పరం పోరాడుకుంటున్న రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు మోదీ చొరవ చూపినట్లు పేర్కొన్నాయి. తన పర్యటనల్లో ఇరు దేశాధినేతలు మోదీ ఆలింగనం చేసుకున్న విషయాన్ని ప్రముఖంగా ప్రచురించాయి.

రూమీ-1 ప్రయోగం

విజయవంతం

నింగిలోకి భారత్ తొలి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్



న్యూఢిల్లీ, ఆగస్టు 24: అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ మరో మైలురాయిని చేరుకుంది. చెన్నైలోని తిరవిందాండై తీరం నుంచి తన మొట్టమొదటి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ రూమీ-1 (ఆర్‌హెచ్‌యూఎంఐ-1)ను శనివారం ఉదయం విజయవంతంగా ప్రయోగించింది. తమిళనాడుకు చెందిన స్టార్టప్ స్పేస్ జోన్ ఇండియా, మార్టిన్ గ్రూప్ కలసి దీనిని అభివృద్ధి చేశాయి. మొబైల్ లాంచర్ ద్వారా ప్రయోగించిన ఈ రాకెట్ 3 క్యూబ్ ఉపగ్రహాలు, 50 పికో ఉపగ్రహాలను మోసుకెళ్లి భూ ఉపకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రయోగం తర్వాత రాకెట్ శకలాలు తిరిగి భూమికి చేరేలా పారాచూట్లను అమర్చారు. వీటిని సేకరించి మరో రాకెట్ ప్రయోగంలో వాడతారు. స్పేస్ జోన్ ఇండియా వ్యవస్థాపకుడు ఆనంద్ నేతృత్వంలో ఈ మిషన్ జరిగింది.

కామికేజ్ డ్రోన్లు తయారు చేద్దాం రండి!

న్యూఢిల్లీ, ఆగస్టు 24: సైనిక అవసరాల కోసం వినియోగించే అత్యాధునిక కామికేజ్ డ్రోన్ల తయారీ, అభివృద్ధి చేసేందుకు నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్(ఎన్ఏఎల్).. రిక్వస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ)ను ఆహ్వానించింది. కామికేజ్ డ్రోన్లను వాణిజ్య పరంగా కూడా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపింది. అత్యాధునిక మందుగుండు సామగ్రిని మోసుకువెళ్లే మానవ రహిత వైమానిక వాహనాల(కామికేజ్ డ్రోన్లు)ను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. ప్రస్తుతం పలు దేశాలు కామికేజ్ డ్రోన్లను వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 15 కిలోల వార్‌హెడ్‌లు సహా 10-15 కిలోల పేలోడ్స్‌ను మోసుకు వెళ్లే డ్రోన్లను అభివృద్ధి చేయాలని ఎన్ఏఎల్ నిర్ణయించింది. ఈ డ్రోన్లు 6-9 గంటలపాటు నిర్విరామంగా పని చేయడంతోపాటు, 900 కిలోమీటర్ల రేంజ్‌లో సంచరిస్తాయి.

పింఛనుకు కొత్త పథకం

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉంటుంది. ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న జాతీయ పింఛన్ పథకం(ఎన్‌పీఎస్) నుంచి కొత్త పెన్షన్ స్కీమ్(యూపీఎస్)కు మారేలా అవకాశం కల్పిస్తాం" అని ఆయన వివరించారు. ఇంతకు ముందే ఈ విధానం అమలుకు కసరత్తును ప్రారంభించామని, ఉద్యోగులు పలు అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తే.. ఆ మేరకు మార్పులు చేసి, అమల్లోకి తీసుకువస్తున్నామని చెప్పారు. ఈ అంశంపై అన్ని రాష్ట్రాల్లో 100కి పైగా సమావేశాలు నిర్వహించి, అన్ని వర్గాలతో చర్చలు జరిపామన్నారు. ప్రభుత్వోద్యోగుల శ్రేయస్సు, సురక్షితమైన భవిష్యత్ కోసమే ఈ విధానాన్నితీసుకువచ్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కొత్త పింఛన్ విధానం ఉద్యోగులకు గౌరవం, ఆర్థిక భద్రతను కల్పిస్తాయన్నారు.



కేంద్రప్రభుత్వ ఉద్యోగుల ప్రతినిధులతో ప్రధాని మోదీ

యూపీఎస్‌లో ముఖ్యాంశాలు..

కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఏకీకృత పింఛన్ పథకం ఉద్యోగులకు పింఛన్ హామీని పెంచుతూ.. గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలకు భరోసా ఇస్తోంది. ఆ వివరాలు..

- పింఛన్‌కు భరోసా: కనీసం 25 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యేవారికి పదవీ విరమణకు ముందు 12 నెలలు తీసుకున్న బేసిక్ పే సగటులో 50% పింఛన్‌గా వస్తుంది.
- కనీసం 10 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యేవారికి అనులోమానుపాతంలో పింఛన్ వస్తుంది. ఇది 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారితో పోలిస్తే.. తక్కువగా ఉంటుంది. అంటే.. పింఛన్ హామీ కనీసం రూ.10 వేలుగా ఉంటుంది.
- ఉద్యోగి మరణిస్తే.. పింఛన్‌లో 60% ఆయన/ఆమె కుటుంబ సభ్యులకు అందుతుంది.
- అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ(ఏఐసీపీఐ-డబ్ల్యూ) ప్రకారం పింఛన్/కుటుంబ పింఛన్‌దారులకు కరువు ఉపశమనం లభిస్తుంది.
- రిటైర్ అయ్యాక.. గ్రాట్యుటీతోపాటు సత్వరం అదనపు లబ్ధి ఉంటుంది. దీన్ని సర్వీసులో ప్రతి ఆర్నెల్ల ప్రాతిపదికన లెక్కగడతారు. అంటే.. సర్వీసులో ఉండగా.. ప్రతి ఆర్నెల్లకు ఒక నెల జీతం+కరువు భత్యంలో పదో వంతు చొప్పున లెక్క కట్టి.. రిటైర్ అయిన వెంటనే ఆ మొత్తం ఇస్తారు. ఇది గ్రాట్యుటీకి అదనం.

బయోఈ-3 విధానంతో ప్రగతి

బయో ఉత్పాదక రంగాన్ని ప్రోత్సహించేలా బయోఈ-3 (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమి, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్) విధానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బయో రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, వ్యవస్థాపకతకు ఈ విధానం దోహదపడుతుందని అశ్వినీవైష్ణవ్ వివరించారు. పారిశ్రామిక, ఐటీ విప్లవాల మాదిరిగా త్వరలో బయో విప్లవం రాబోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల బయోటెక్నాలజీ, బయోసైన్స్ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలున్నాయన్నారు. బయో కృత్రిమ మేధ(ఏఐ) హబ్‌లు, బయో ఉత్పాదక కేంద్రాలు, బయోఫౌండ్రీల ఏర్పాటుకు ఈ విధానం దోహదపడుతూ.. బయో రంగం వాణిజ్యీకరణకు వేగంగా అడుగులు పడతాయన్నారు. గ్రీన్ గ్రోత్ ద్వారా బయో ఎకానమి నమూనాలకు ప్రాధాన్యత లభిస్తుందని, ఈ విధానంతో భారతదేశ నైపుణ్య శ్రామికశక్తి విస్తరణను సులభతరం చేయడమే కాకుండా.. ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుందని వివరించారు. "నెట్ జీరో కార్బన్ ఎకానమి, లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలను ఈ విధానం మరింత బలోపేతం చేస్తుంది. బయోఈ-3 విధానం ప్రపంచ సవాళ్లను ఎదుర్కొంటూ.. మరింత స్థిరమైన, వినూత్నమైన భవిష్యత్తుకు మార్గాన్ని సుగమం చేస్తుంది. వికసిత్ భారత్ కోసం బయో-విజన్‌ను నిర్దేశిస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఆహార భద్రత, మానవ ఆరోగ్యానికి సంబంధించిన క్లిష్టమైన సామాజిక సమస్యలకు పరిష్కారంగా ఈ విధానం ఉంటుంది. పారిశ్రామికీకరణలో పెట్టుబడులకు ఉపకరిస్తుంది" అని అశ్వినీవైష్ణవ్ వ్యాఖ్యానించారు.

విజ్ఞాన్ ధార పథకం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణలు, సాంకేతికాభివృద్ధి వంటి పథకాలను(మూడు గొడుగుల పథకాలు) 'విజ్ఞాన్ ధార' పేరుతో ఏకీకృత పథకంగా అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సంబంధిత విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకురావడం వల్ల.. సమర్థంగా నిధుల వినియోగం, ఉప పథకాలు/కార్యక్రమాల మధ్య సమన్వయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మూడు పథకాలకు 15 ఆర్థిక సంఘం(2021-22 నుంచి 2025-26 వరకు) రూ.10,579 కోట్లను ఖర్చు చేయాలని నిర్దేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.


30న వన మహోత్సవం

- ప్రజలు, యువత భాగస్వామ్యంతో నిర్వహించాలి
- 11 నగర వనాల అభివృద్ధికి కేంద్ర నిధులు: పవన్

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30న వన మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో ప్రజలు, ముఖ్యంగా యువత భాగస్వామ్యం ఉండాలని ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ నిర్దేశించారు. ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేడుకలా చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలతోపాటు, అన్ని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, ఆధ్యాత్మిక సంస్థలు పాల్పంచుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే నగరవనాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. శనివారం ఆయన అటవీశాఖ అధికారులతో నగర వనాల పనులపై చర్చించారు. రాష్ట్రంలో 11 నగర వనాల అభివృద్ధికి కేంద్రం నిధుల మంజూరుకు ఆమోదం తెలిపిందని వెల్లడించారు. వీటిలో శ్రీకాకుళం జిల్లా వెలగాడ, విజయనగరం జిల్లా నెల్లిమర్ల, కర్నూలులో గార్గేయపురం, కడప, చిత్తూరు డెయిరీ నగరవనం, చిత్తూరు జిల్లా కలిగిరి కొండ, శ్రీకాళహస్తిలో కైలాసగిరి, తాడేపల్లిగూడెంలోని ప్రకాశరావుపాలెం నగరవనాలతోపాటు, పెనుగొండలో శ్రీకృష్ణదేవరాయకోట ఎకోపార్క్, కదిరిలో బత్రేపల్లి వాటర్ ఫాల్స్ ఎకో పార్క్, పలాసలో కాశీబుగ్గ నగర వనం, విశాఖపట్నంలో ఈస్టర్న్ ఘాట్ బయోడైవర్సిటీ నగరవనాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎంపాక్స్ టెస్టింగ్ కిట్ సిద్ధం

- అత్యవసర అనుమతి జారీ చేసిన సీడీఎస్‌సీవో



విశాఖపట్నం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్ మరో ఆవిష్కరణ చేసింది. దేశంలో విస్తృతంగా వ్యాపిస్తున్న మంకీ పాక్స్ టెస్టింగ్ కిట్‌ను రూపొందించింది. ట్రాన్సాసియా డయాగ్నొస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్‌తో కలిసి 'యర్బ ఎండీఎక్స్' పేరుతో ఆర్‌టీపీసీఆర్ కిట్‌ను తయారు చేసింది. దీనిని ఐసీఎంఆర్ గుర్తించగా సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) అత్యవసర అనుమతిని జారీ చేసింది. ఎంపాక్స్‌ను గుర్తించడానికి దేశీయంగా తయారైన తొలి కిట్ ఇదే కావడం గమనార్హం.

విధానాల రూపకల్పనకు కులగణనే పునాది



- మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనేవాళ్ల జాబితాలో దళితులకు చోటేది: రాహుల్

ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 24: దేశ వ్యాప్తంగా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ జరగాలని విపక్షనేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మరోసారి డిమాండు చేశారు. కులగణన అంటే కేవలం ఆయా వర్గాల జనాభా వివరాలను సేకరించడం మాత్రమే కాదని, అంతకుమించి విధానపర నిర్ణయాలు తీసుకోవడానికి వేసే పునాదిలాంటిదని చెప్పారు. 90% జనాభా ఇంకా దేశంలోని ప్రధాన వ్యవస్థలతో అనుసంధానం కాలేకపోయారని, అలాంటి వారి స్థితిగతులు తెలుసుకోవాలంటే కులగణన జరపాల్సిందేనని చెప్పారు. చాలా మందికి పాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, మీడియా రంగాల్లో చోటు దక్కడం లేదని అన్నారు. వారికి నైపుణ్యం, విజ్ఞానం ఉన్నా వ్యవస్థల్లో భాగస్వామ్యం కాలేకుండా దూరంగా ఉంటున్నారని, అలాంటి వారి అభివృద్ధి కోసమే కులాల లెక్కలు కావాలని డిమాండు చేస్తున్నామని చెప్పారు. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనేవారి జాబితాలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీల్లో ఎవ్వరికీ చోటు కల్పించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో ప్రసంగిస్తూ కులగణన ఆవశ్యకతను రాహుల్ వివరించారు. "కులాల లెక్కలు లేకుండా వాస్తవ రూప ప్రణాళికలను రూపొందించలేం. విధానాల రూపకల్పనకు రాజ్యాంగం ఓ గైడ్‌గా ఉపయోగపడుతోంది. సామాజిక-ఆర్థిక వివరాలను వెల్లడించే కులగణన రెండో గైడ్‌గా పనికొస్తుంది. కుల గణన ద్వారా రాజ్యాంగాన్ని కాపాడాలన్నదే మా ప్రయత్నం. రాజ్యాంగాన్ని పేదలు, కూలీలు, గిరిజనులే కాపాడుతున్నారు...(అదానీలు కాదు)...అయితే ఆ 90 శాతం మందికి భాగస్వామ్య హక్కులు లేకపోతే రాజ్యాంగానికి రక్షణ ఉండదు" అని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు కులగణనకు అనుకూలంగా ఉన్నారని, ప్రధాని దీన్ని అమలు చేయకతప్పదని అన్నారు. ఒకవేళ అమలు చేయకపోతే మరొకరు ప్రధాని అవుతారని వ్యాఖ్యానించారు. తర్వాత ఆయన ట్వీట్ చేస్తూ సమాజాన్ని ఎక్స్‌రే తీయడానికి కులగణన ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థల్లో ఏ వర్గాలకు ఎంత భాగస్వామ్యం ఉందన్న డాటాను తెలుసుకోవచ్చని చెప్పారు.

ఎన్ కన్వెన్షన్ నేలమట్టం!

- సినీనటుడు నాగార్జునకు చెందిన నిర్మాణం
- చట్ట విరుద్ధంగా కూల్చేశారు: నాగార్జున

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కుల్లో అక్రమ నిరాణాల తొలగింపు, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ ప్రొటెక్షన్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడ్రా) మరో కీలక చర్య చేపట్టింది. ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను శనివారం కూల్చివేసింది. రంగారెడ్డి జిల్లా ఖానామెట్‌లోని తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉందంటూ ఆ నిర్మాణాన్ని నేలమట్టం చేసింది. హైడ్రా అధికారులు.. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ తదితర విభాగాల సిబ్బందితో కలిసి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు భారీగా పోలీసులు, యంత్రాలతో కన్వెన్షన్ సెంటర్ వద్దకు వెళ్లారు. ఉదయం 6 గంటల సమయంలో కూల్చివేతలు మొదలుపెట్టి 11 గంటల వరకు సింహభాగం పూర్తి చేశారు. ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో మాదాపూర్ నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్లే రహదారులను మూసివేసి వాహనాల రాకపోకలను మళ్లించారు. ఎన్ కన్వెన్షన్‌పై గతంలోనే ఫిర్యాదులు వచ్చాయి. కోర్టు కేసులు నమోదయ్యాయి. కోర్టు ఆదేశాలతో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలు సంయుక్త సర్వే నిర్వహించి ఎన్ కన్వెన్షన్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు నిర్ధారించారు. అయితే... ఎఫ్‌టీఎల్ నిర్ధారణ సక్రమంగా లేదని కన్వెన్షన్ యజమానులు 2017లో మియాపూర్‌లోని అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లో ఉంది. దీంతో ప్రభుత్వ విభాగాలూ కూల్చివేతల దిశగా చర్యలు తీసుకోలేదు. తాజాగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎన్ కన్వెన్షన్ నిర్మాణం జరిగినట్లు 'జనం కోసం' అనే స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఈ నెల 20న హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోవాలంటూ లేఖ రాశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలోనే హైడ్రా రంగంలోకి దిగింది. ప్రముఖ వ్యక్తికి చెందిన ఆస్తి కావడంతో ఆచితూచి వ్యవహరించడంతోపాటు న్యాయపరమైన చిక్కులు రాకుండా సమగ్ర వివరాలు పరిశీలించినట్లు తెలిసింది. కన్వెన్షన్ నిర్మాణానికి అనుమతి ఉందా లేదా అనే విషయంపై పట్టణ ప్రణాళికా విభాగం నుంచి వివరాలు సేకరించింది. అనుమతి లేదని, గతంలోనే అక్రమ నిర్మాణంగా నిర్ధారణ జరిగిందని టౌన్ ప్లానింగ్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్టు కేసులు, ఆదేశాలపైనా న్యాయ నిపుణుల సలహాలను హైడ్రా తీసుకున్నట్లు తెలిసింది.



సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

కూల్చివేతపై యథాతథ స్థితి

తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేపడుతున్నారంటూ ఎన్ కన్వెన్షన్ మాతృసంస్థ ఎన్.3 ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నల్ల ప్రీతమ్‌రెడ్డి హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు యథాతథ స్థితి(స్టేటస్ కో) విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటికే కూల్చివేత పని దాదాపుగా పూర్తయింది. ఇదే అంశంపై నాగార్జున 'ఎక్స్'లో స్పందించారు. ఎన్ కన్వెన్షన్ విషయంలో హైడ్రా చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని సినీ నటుడు నాగార్జున ఆరోపించారు. స్టే ఆదేశాలు, కోర్టు కేసులు ఉన్నా కూల్చివేయడం బాధాకరమని శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నన్ను ఇరికించారు

- జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసులో నాలుక మడతేసిన ప్రధాన నిందితుడు సంజయ్
- కలకత్తా హైకోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట కన్నీరు



న్యూఢిల్లీ/పుణె ఆగస్టు 24: జూనియర్ వైద్యురాలిపై ఘోర అత్యాచారం ఘటనకు సంబంధించి నేరం చేసింది తానేనని ఒప్పుకొని.. ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా 'కావాలంటే నన్ను ఉరి తీసుకోండి' (అమీ ఫాసీ దీయే దీ) అని పోలీసుల విచారణలో చెప్పిన ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ ఇప్పుడు మాటమార్చేశాడు. తనకు ఏ పాపం తెలియదని.. తాను అమాయకుడినని, తనను కేసులో ఇరికించారని కోర్టులో న్యాయమూర్తి ఎదుట కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది. హత్యాచార ఘటన జరిగిన మరుసటి రోజు అంటే ఆగస్టు 10వ తేదీ నుంచి కస్టడీలో ఉన్న సంజయ్ రాయ్‌ను కేసు విచారణలో భాగంగా శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు అతడు సంచలన ఆరోపణలు చేసినట్లు తెలిసింది. విచారణ సందర్భంగా.. లైడిటెక్టర్ (పాలిగ్రఫీ) పరీక్షకు సమ్మతించడంపై న్యాయమూర్తి ప్రశ్నించడంతో సంజయ్ రాయ్ భావోద్వేగానికి గురయ్యాడు. "నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ కేసులో నన్ను ఇరికించారు. బహుశా ఈ పరీక్ష (లైడిటెక్టర్ టెస్ట్)తో నేను తప్పు చేయలేదనే విషయం రుజువవ్వొచ్చు" అంటూ సంజయ్ రాయ్ కన్నీరు పెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు.. ఆర్జీకర్ వైద్యకళాశాల, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ మరింత చిక్కుల్లో పడ్డారు. కాలేజీలో దారుణ అత్యాచారం, హత్యకు గురైన స్థితిలో జూనియర్ వైద్యురాలి మృతదేహం లభించడంతో ఇప్పటికే విచారణను ఎదుర్కొంటున్న ఆయనపై సీబీఐ, ఆర్జీకర్‌లో ఆర్థిక అవకతవకలకు సంబంధించి కేసు నమోదు చేసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 13న కేసు సిట్ నుంచి సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. ఈ క్రమంలో ఆర్జీకర్‌లో ఘోష్ హయాంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని, ఈడీతో విచారణ జరిపించాలంటూ కాలేజీ మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ కలకత్తా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు సూచనల మేరకు ఘోష్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. శనివారం సాయంత్రం ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి సీబీఐ లైడిటెక్టర్ (పాలిగ్రఫీ) పరీక్ష నిర్వహించింది. ఇదేరోజు మాజీ ప్రిన్సిపల్ ఘోష్, మరో నలుగురికి కూడా లైడిటెక్టర్ పరీక్షను నిర్వహించారు. హత్యాచార ఘటనకు సంబంధించి సుప్రీంకోర్టుకు సెప్టెంబరు 17న సీబీఐ నివేదిక సమర్పించాల్సి ఉంది.

ఇంటికి 'ఐరన్ డోమ్'!

దోమల్ని చంపే వినూత్న చైనా యంత్రం.. ఎక్స్‌లో షేర్ చేసిన ఆనంద్ మహీంద్ర

ముంబై, ఆగస్టు 24: దోమల బాధ భరించలేక రకరకాల పరిష్కారాలు వెతుకుతుంటాం. మార్కెట్లో మస్కిటో కాయిల్స్ నుంచి దోమల బ్యాట్‌లు, ఆల్‌ఔట్‌లు, జెట్‌లు వరకు బోలెడన్ని ఉపకరణాలు వచ్చేశాయి. దోమల మీద కొన్ని వేల కోట్ల రూపాయల పరిశ్రమ నడుస్తోంది. అయినా ఈ సమస్య నిర్మూలన కావటం లేదు సరికదా.. ఎప్పటికప్పుడు డెంగీ, మలేరియా లాంటివి విజృంభిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్ర ఎక్స్ వేదికగా షేర్ చేసిన ఓ వీడియో అందరినీ ఆకర్షిస్తోంది. చైనాకు చెందిన ఓ వ్యక్తి, దోమల్ని చంపే బుజ్జి యంత్రాన్ని తయారు చేశాడని పేర్కొంటూ ఆ మెషిన్ వీడియోను ఆనంద్ మహీంద్ర షేర్ చేశారు. 'ముంబైలో డెంగీ పెరుగుతున్న ప్రస్తుత సమయంలో.. ఈ సూక్ష్మ ఆయుధాన్ని ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తున్నా. ఇది దోమల్ని వెదికి మరీ చంపుతుంది. మీ ఇంటికి ఐరన్ డోమ్ (ఉక్కు తెర)లాగా రక్షణ కల్పిస్తుంది' అని కామెంట్ పెట్టారు. సదరు మెషిన్ చంపిన దోమల్ని ప్రదర్శిస్తున్న దృశ్యాలు కూడా ఈ వీడియోలో ఉన్నాయి. యుద్ధట్యాంకును పోలి ఉండే ఈ బుజ్జి యంత్రంలో ఓ రాడార్ ఉంటుంది. దోమలు ఎక్కడున్నాయో గుర్తించి రాడార్ ఆ సమాచారాన్ని యంత్రానికి అందిస్తుంది. దానిలోంచి లేజర్ కిరణాలు వెలువడి దోమల్ని చంపుతాయి. శత్రుదేశాల రాకెట్, క్షిపణి దాడులను తిప్పికొట్టే ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ అంతర్జాతీయంగా పేరొందిన విషయం తెలిసిందే.



కుర్స్క్‌లో ఉక్రెయిన్ విజయానికి కారణం

'అదృశ్య' దుస్తులే!

పశ్చిమదేశాలు ఇచ్చాయని రష్యా ఆరోపణ



మాస్కో, ఆగస్టు 24: కుర్స్క్ ప్రాంతంలోకి చొచ్చుకురావడంలో ఉక్రెయిన్ బలగాలు విజయం సాధించడం వెనుక 'అదృశ్య దుస్తుల' పాత్ర ఉందని రష్యా ఆరోపించింది. పశ్చిమదేశాలు ఉక్రెయిన్ దళాలకు ఈ ప్రత్యేక యూనిఫామ్‌ను అందించాయని, వాటిని ధరించడం వల్ల ఉక్రెయిన్ సైనికులు పగలూ, రాత్రీ కూడా శత్రువులకు కనిపించలేదంటూ రూపొందించిన నివేదిక రష్యా మిలిటరీ పోర్టల్‌లో దర్శనమిస్తోంది. ఆ ఘటన వెనుక అంతర్జాతీయ కుట్ర ఉందని రష్యా ఆరోపిస్తోంది. అయితే, ఈ వాదనలను అంతర్జాతీయ మీడియా తోసిపుచ్చింది. కుర్స్క్ ప్రాంతంలోకి గణనీయంగా వచ్చిన మిలిటరీ సామగ్రి కదలికలు కనిపించకుండా చేయడం అసాధ్యమని రష్యా విమర్శకులు పేర్కొంటున్నారు. కాగా, అమెరికా ప్రైవేటు మిలిటరీ కంపెనీల భాగస్వామ్యం వల్లే ఉక్రెయిన్ ఆ ఆకస్మిక విజయం సాధించిందని అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ఆరోపించింది. దాంతోపాటు అమెరికా జర్నలిస్టులు అక్రమంగా రష్యా భూభాగంలోకి వస్తున్నారని ఆరోపించింది.

అదృశ్య వస్త్రం అంటే..?

'అదృశ్య సైనికులు' అనేది రియల్‌ఎం సైన్స్ ఫిక్షన్ అయినప్పటికీ.. కనిపించకుండా చేసే అధునాతన పరిజ్ఞానం కోసం మిలిటరీ పరిశ్రమ కొంతకాలం నుంచి ప్రయత్నిస్తోంది. సైనిక పరికరాలు శత్రువులకు కనిపించకుండా చేయడమే దీని లక్ష్యం. వస్తువులపై పడకుండా కాంతిని వక్రీభవనం చెందించడం ద్వారా విజిబిలిటీని తగ్గించే పదార్థాల తయారీకి ప్రయత్నిస్తున్నారు. అల్ట్రావైలెట్, ఇన్‌ఫ్రారెడ్, షార్ట్‌వేవ్ కాంతిని పరావర్తనం చెందించకపోవడం వల్ల వస్తువులను కనిపించకుండా చేస్తారు. ఉక్రెయిన్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మంత్రి మైఖేలో ఫెడొరోవ్ గతేడాది చివర్లోనే వస్తువులను కనిపించకుండా చేసే రియల్ వరల్డ్ అప్లికేషన్ అనే అధునాతన సాంకేతికతను 'టెలిగ్రామ్'లో ప్రస్తావించారు. రష్యా థర్మల్ ఇమేజింగ్ కంటపడకుండా ప్రత్యేకించి డ్రోన్ల కంటపడకుండా ఉక్రెయిన్ సైనికుల కోసం రూపొందించిన అదృశ్య వస్త్రాన్ని ఆయన అందులో ప్రదర్శించారు. రష్యా జనవరిలో 'అదృశ్య సూట్'ను ఆవిష్కరించినట్టు వార్తా సంస్థ 'టాస్' పేర్కొంది.

ధనిక గ్రామం

ఆ ఊరి ప్రజల పేరు మీద రూ.7వేల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

- ఆసియాలోనే అత్యంత ధనిక గ్రామంగా గుజరాత్‌లోని మాదాపూర్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: పల్లెటూరంటే అందరికీ మట్టి రోడ్లు, పంట పొలాలు, పూరి గుడిసెలు, పేద ప్రజలు గుర్తుకు వస్తారు. కానీ, గుజరాత్‌లోని భుజ్ జిల్లాలో ఉన్న మాదాపూర్ గ్రామం అలా కాదు. ఆ ఊరి ప్రజల పేరు మీద బ్యాంకుల్లో రూ.7వేల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. అందుకే అది ఆసియా ఖండంలోనే అత్యంత ధనిక గ్రామంగా రికార్డులకెక్కింది. ఈ ఒక్క ఊర్లోనే 17 బ్యాంకులు ఉన్నాయి. మాదాపూర్ గ్రామ జనాభా 32వేలకు పైనే. కానీ, వీరిలో సగం కంటే ఎక్కువ(65%) మంది ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం విదేశాల్లోనే ఉన్నారు. అక్కడ పని చేస్తూ.. ఆ డబ్బును గ్రామంలో ఉన్న తమ కుటుంబసభ్యుల కోసం స్థానిక బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఆఫ్రికన్ చీతాలకు స్వేచ్ఛ.. ఏడాది తర్వాత అడవుల్లోకి

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఆఫ్రికా నుంచి భారత్‌కు తీసుకువచ్చిన చీతాలకు ఏడాది తర్వాత ఎన్‌క్లోజర్ల నుంచి విముక్తి లభించనుంది. మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కు నుంచి ఏడాది క్రితం వీటిని ఎన్‌క్లోజర్లలోకి పంపించారు. కేంద్రం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు చీతా స్టీరింగ్ కమిటీ శుక్రవారం వాటిని తిరిగి అడవుల్లోకి వదిలి పెట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. చీతాలను, భారత్‌లో వాటికి పుట్టిన పిల్లలను రుతుపవనాల విరమణ తర్వాత దశలవారీగా అడవిలోకి వదిలి పెట్టనున్నట్లు చెప్పారు. అక్టోబరు మొదటి వారంలో మధ్యప్రదేశ్ నుంచి రుతుపవనాలు తిరుగుముఖం పడతాయని భారత వాతావరణ శాఖ అంచనా. అయితే పిల్ల చీతాలను, వాటి తల్లులను మాత్రం డిసెంబరు నెల తర్వాత వదిలి పెట్టనున్నట్లు ఒక అధికారి చెప్పారు. ప్రస్తుతం ఎన్‌క్లోజర్లలో ఉన్న 13 పెద్ద చీతాలు, 12 పిల్ల చీతాలు ఆరోగ్యంగానే ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టు చీతాలో భాగంగానమీబియా నుంచి 2022 సెప్టెంబరులో 8 చీతాలను, దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకువచ్చారు.




స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ శ్రీనరసింహ, జస్టిస్ శ్రీనరసింహకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

నైపుణ్యమున్న యువతకు ప్రపంచంలో అగ్రస్థానం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ
- ఘనంగా విజ్ఞాన్స్ వర్సిటీ 12వ స్నాతకోత్సవం
- ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు

గుంటూరు(విద్య), ఆగస్టు 24: "సాంకేతిక విద్యతోపాటు భిన్న నైపుణ్యాలు ఉన్న యువతకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. వారికి అవకాశాలు కల్పించి అగ్రస్థానంలో నిలపడానికి మల్టీనేషనల్, కార్పొరేట్ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఈ దిశగా యువత సన్నద్ధం కావాలి" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ తెలిపారు. గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 12వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డిగ్రీ పట్టాలతో విద్యాసంస్థల నుంచి అడుగు బయట పెట్టినప్పుడు వాస్తవ ప్రపంచం కొత్త సవాళ్లను అందిస్తుందన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేశ్ మెషీన్స్ ఫౌండర్ ముళ్లపూడి లోకేశ్వరరావు, సంగీత దర్శకుడు సాలూరి కోటేశ్వరరావు(కోటి)కు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. 1,539 మందికి డిగ్రీ పట్టాలను, చదువులో ప్రతిభ చూపిన 60 మందికి బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కదిరి ఆలయంలో స్వామివారి చిత్రపటాన్ని అందుకుంటున్న జస్టిస్ సుజాత

ఖాద్రీశుని సేవలో జస్టిస్ సుజాత

కదిరి లీగల్/తాడిపత్రి, ఆగస్టు 24: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట జిల్లా అదనపు న్యాయాధికారి సత్యవతి, న్యాయాధికారులు ప్రతిమ, మీనాక్షి సుందరి, కోర్టు పర్యవేక్షకులు అపర్ణ భాస్కర్ ఉన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి, గాయత్రీదేవి అమరలింగేశ్వరస్వామి ఆలయాలు, సత్యసాయి, శివసాయి మందిరాలను కూడా జస్టిస్ సుజాత శనివారం సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆమె వెంట అనంతపురం జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి సత్యవతి, తాడిపత్రి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కృష్ణవేణి, డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఉన్నారు.

పాతికేళ్లు బాదుడే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించినా.. ఆయన నిర్వాకాలకు జనం భారీ మూల్యమే చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అవసరం లేకున్నా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో పాతికేళ్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నారు. కారుచౌకకు కరెంటు కొంటున్నామన్నారు.. కానీ తీరా చూస్తే అధిక ధరకు అదానీకి లబ్ధి చేకూర్చేందుకు చేసుకున్న ఈ ఒప్పందం వల్ల వచ్చే పాతికేళ్లలో రూ.1,08,750 కోట్ల భారం జనం మోయబోతున్నారు.

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యుత్ రంగంపై తీసుకున్న నిర్ణయాల పర్యవసానాలను రాష్ట్ర ప్రజలు ఈ ఏడాది నుంచే చవిచూడబోతున్నారు. ఆయన వారిపై ఒకటీ రెండేళ్లు కాదు.. పదేళ్లూ కాదు.. ఏకంగా పాతికేళ్ల భారం మోపి మరీ వెళ్లిపోయారు. ఏటా 7వేల మెగావాట్ల విద్యుత్ కొనడానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ), రాష్ట్ర డిస్కంలు, రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబరు 1న త్రైపాక్షిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పవర్ పర్చేజ్ అగ్రిమెంట్-పీపీఏ) కుదుర్చుకున్నాయి. యూనిట్‌కు రూ.2.49 చొప్పున అతి చౌకగా ఒప్పందం చేసుకున్నామని నాడు జగన్ చెప్పారు. ఒప్పందం చరిత్రాత్మకమైనదని.. ఈ ఏడు వేల మెగావాట్లను వ్యవసాయానికి పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఉపయోగిస్తామని ఆర్భాటంగా చెప్పారు. కానీ సెకీతో పీపీఏ వెనుక వ్యాపార మిత్రుడు అదానీకి ప్రయోజనం చేకూర్చడమే ఈ ఒప్పందం అసలు పరమార్థమని అందరికీ అర్థమైంది. సెకీతో యూనిట్‌కు రూ.2.49 చొప్పున ఒప్పందం చేసుకున్న కొద్ది నెలలకే యూనిట్ రూ.1.99 చొప్పునే కొనేందుకు గుజరాత్ వంటి రాష్ట్రాలు ఒప్పందాలు చేసుకున్నాయి. ట్రాన్స్‌మిషన్ చార్జీలు ఉండవని జగన్ చెప్పిన మాట పచ్చి అబద్ధమని తేలిపోయింది. సెకీతో చేసుకున్న కొనుగోలు ఒప్పందానికి యూనిట్‌కు 80 పైసల చొప్పున వీలింగ్ చార్జీలు వర్తిస్తాయని స్పష్టమైంది. అంటే.. సెకీతో ఒప్పందం వల్ల యూనిట్‌కు రూ.2.49తో పాటు అదనంగా 80 పైసలు వీలింగ్ చార్జీలు కలుపుకొంటే .. యూనిట్ ధర రూ.3.49కు చేరుతుంది. ఈ భారం ఏటా రూ.4,350 కోట్లు అని సీఎం చంద్రబాబు గత నెలలో విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్నారు. అదనంగా మెగావాట్‌కు రూ.50 లక్షల చొప్పున నెట్‌వర్క్ చార్జీ కూడా పడుతుందని తెలిపారు. మొత్తంగా ఒప్పందం కుదుర్చుకున్న 25 ఏళ్లకు రాష్ట్ర ప్రజలపై పడే మొత్తం భారం రూ.1,08,750 కోట్లకు చేరుతుంది.

నాడు ఏకపక్షంగా రద్దుచేసి..

2019లో అధికారంలోకి వచ్చిన కొత్తలో దీర్ఘకాలిక పీపీఏలతో నష్టమని జగన్ సూత్రీకరించారు. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం కుదుర్చుకున్న కొనుగోలు ఒప్పందాలన్నింటినీ ఏకపక్షంగా రద్దు చేశారు. దీర్ఘకాలిక ఒప్పందాలతో నష్టమన్న నోటితోనే.. తానే ఆ తర్వాత ఏటా 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు సెకీతో 25 ఏళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో 3 వేల మెగావాట్లు వచ్చే నెలలో, మరో 3 వేల మెగావాట్లు వచ్చే ఏడాది, మిగతా వెయ్యి మెగావాట్లు 2026లో అందుబాటులోకి వస్తాయని 2021 డిసెంబరు 1న ఒప్పందం కుదుర్చుకున్నారు. 2027 నుంచి ఏటా 7 వేల మెగావాట్లు సరఫరా చేస్తుంది. నమ్మి గద్దెనెక్కించినందుకు ప్రజలపై పాతికేళ్ల పాటు భారం మోపారని.. ఇందుకు జగన్ క్షమాపణలు చెబుతారా అని రాజకీయపక్షాలు, ప్రజా సంఘాలు నిలదీస్తున్నాయి.

స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్..

ఇదేగాకుండా 5,287 మెగావాట్ల పవన విద్యుత్, 12,075 మెగావాట్ల సౌరవిద్యుత్, 17,859 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుతుత్పత్తి ప్రాజెక్టులను జగన్ తన అస్మదీయులకు అప్పగించారు. వారికి రూ.లక్షల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారు. అయితే ఈ ప్రాజెక్టులేవీ కార్యరూపం దాల్చలేదు. వీటి నుంచి ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి కాలేదు. సరికదా.. అదానీ, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌తో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు అమల్లోకి వచ్చేస్తున్నాయి. ఏపీసీపీడీసీఎల్ రూ.783 కోట్లు, ఏపీఎస్పీడీసీఎల్ రూ.790 కోట్లు, ఏపీఈపీడీసీఎల్ రూ.628.24 కోట్లతో తొలి దశలో 27.68 లక్షల కనెక్షన్లకు ఈ మీటర్లు బిగించాలి. ఇవన్నీ శుక్రవారమే డిస్కంలకు చేరుకున్నాయి. ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తే 82 నెలల పాటు వినియోగదారులపై ప్రత్యేక బాదుడు మొదలవుతుంది.

జైలు నుంచి 'పిన్నెల్లి' విడుదల



జైలు నుంచి విడుదలైన పిన్నెల్లిని కారు వద్దకు తీసుకెళుతున్న మాజీ మంత్రి కాకాణి

వెంకటాచలం, ఆగస్టు24: వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. రెంటచింతల, కారంపూడి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పిన్నెల్లిపై కేసులు నమోదవగా, కోర్టు తీర్పు మేరకు 58 రోజులపాటు ఇక్కడున్న సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే!. ఆయనకు శుక్రవారమే బెయిల్ మంజూరయినా సంబంధిత పత్రాలు జైలు అధికారులకు అందజేయడంలో ఆలస్యమైంది. దీంతో శనివారం జైలు నుంచి పిన్నెల్లి విడుదలయ్యారు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, వైసీపీ నేతలు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు జైలు నుంచి పిన్నెల్లి విడుదలవడంతో ఆయన్ను కలిశారు.

గ్రామసభల నిర్వహణ అభినందనీయం: లక్ష్మీనారాయణ



తిరుమల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు చాలా మంచి కార్యక్రమమన్నారు. గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఏడాది తర్వాత స్వామి దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.

రాబోయేది మంచి కాలం: కొల్లు రవీంద్ర



తిరుమల ఆలయం ముందు మంత్రి కొల్లు రవీంద్ర

తిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయేదంతా మంచి కాలమని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆయన చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రభుత్వ యంత్రాంగం.. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈక్రమంలో రాష్ట్రాభివృద్ధి విషయంలో అన్నీ సక్రమంగా జరగాలని స్వామిని ప్రార్థించానని కొల్లు తెలిపారు.

చంద్రబాబును కలిసిన మంద కృష్ణ

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమ నేత మంద కృష్ణ మాదిగ శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, ఆ తర్వాత పరిణామాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరి తదితర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.

కార్పొరేటీకరణ, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా రేపు విజయవాడలో ధర్నా

గుంటూరు సిటీ, ఆగస్టు 24: ఆదివాసీల జీవించే హక్కును కాలరాస్తున్న కార్పొరేటీకరణ, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 26న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడవుల్లోని అపారమైన సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

'సినర్జిన్ ఫార్మా' ప్రమాదంలో ఒకరి మృతి

పరవాడ, ఆగస్టు 24: అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 'సినర్జిన్' ఫార్మా కంపెనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన హెల్పర్ రోయా అంగరియా (23) విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కాగా.. ఈ ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత ప్రకారం సెక్షన్ 106(1), 123 (బి), 289 కింద కేసు నమోదు చేశామన్నారు.

ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్

- అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో హెల్త్ సిటీ
- మంత్రి సత్యకుమార్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

పొన్నూరు టౌన్(చేబ్రోలు), ఆగస్టు 24: అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో హెల్త్ సిటీని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్థల సేకరణపై దృష్టి సారించారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి డీవీసీ హాస్పిటల్‌లో శనివారం హార్ట్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో ఆరోగ్యశాఖను అనారోగ్యశాఖగా మార్చిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. ధూళిపాళ్ల వీరయ్యచౌదరి పాల రైతుల సంక్షేమానికి పాటుపడితే ఆయన కుమారుడు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ట్రస్ట్ ఆసుపత్రిని ఏర్పాటుచేసి పేదలకు వైద్యాన్ని అందిస్తూ తండ్రి ఆశయాలను నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. డీవీసీ హాస్పిటల్‌ను మోడల్‌గా తీసుకుని రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఇవే సౌకర్యాలతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని 5.30 కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ప్రాథమిక దశలోనే చికిత్స అందించే వ్యవస్థను రూపొందించినట్లు చెప్పారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు 30 నిమిషాల్లోనే ప్రాథమిక వైద్యం ఒకే రోజులోనే వైద్య పరీక్షలు, సేవలు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అడ్మిషన్లకు చర్యలు

గుంటూరు సిటీ, ఆగస్టు 24: కొత్త మెడికల్ కాలేజీలలో ఫ్యాకల్టీ సమస్య ఎక్కువగా ఉందని, అందువల్లే అడ్మిషన్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వడంలేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఫ్యాకల్టీని నియమించి అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శనివారం గుంటూరు బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

స్విమ్స్‌లో జూనియర్ వైద్యురాలిపై రోగి దాడి


- తల మంచానికేసి కొట్టడంతో స్వల్ప గాయం
- భద్రత లేదంటూ జూనియర్ డాక్టర్ల ఆందోళన



స్విమ్స్ క్యాజువాలిటీ ఎదుట బైఠాయించిన జూడాలు

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ ఆస్పత్రి అత్యవసర విభాగంలో జూనియర్ మహిళా డాక్టర్‌పై ఓ రోగి దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డారు. దీంతో తమకు భద్రత లేదంటూ స్విమ్స్‌లో పనిచేస్తున్న 150 మందికి పైగా జూనియర్ డాక్టర్లు (జూడాలు) ఆందోళనకు దిగారు. స్విమ్స్ ఆస్పత్రి అత్యవసర విభాగంలో మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో జూనియర్ డాక్టర్ స్పందనపై ఓ రోగి హఠాత్తుగా దాడికి పాల్పడ్డాడు. ఆమెను వెనుక నుంచి జుట్టు పట్టుకుని తలను బెడ్‌కేసి బాదాడు. అక్కడ డ్యూటీలో ఉన్న ఇతర సిబ్బంది వెంటనే అప్రమత్తమై రోగి బారి నుంచి ఆమెను విడిపించారు. ఈ ఘటనలో వైద్యురాలి తలకు స్వల్ప గాయమైంది. దాడి చేసిన రోగి పేరు బంగార్రాజు అని, అతనిది విజయనగరం జిల్లా అని ప్రాథమిక సమాచారం. బంగార్రాజు మద్యం మత్తులో ఉన్నాడని, మానసిక పరిస్థితి కూడా సరిగా లేదని వైద్యులు, పోలీసులు చెబుతున్నారు. దాడి తర్వాత అతని పరిస్థితి దిగజారడంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో భయాందోళనలకు లోనైన జూడాలు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి స్విమ్స్ క్యాజువాలిటీ ఎదుట బైఠాయించారు. తమకు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని, వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించే చోట కూడా భద్రత ఏర్పాటు చేయాలని, స్విమ్స్ ఆవరణలో ముఖ్యమైన చోట్ల సెక్యూరిటీ పోస్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ వచ్చి డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చినా వినిపించుకోలేదు. సమాచారం అందుకున్న టీటీడీ అదనపు సీవీఎస్వో శివకుమార్, తిరుపతి డీఎస్పీ వెంకట నారాయణ కూడా అక్కడకు చేరుకున్నారు. ప్రస్తుతమున్న 140 మంది సెక్యూరిటీ సిబ్బందికి అదనంగా మరో 70 మందిని నియమిస్తామని, ప్రతి గంటకూ తనిఖీలు చేపడతామని హామీ ఇచ్చినా జూడాలు వినలేదు. టీటీడీ ఈవో వచ్చి రాతపూర్వకంగా హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. మరోవైపు దాడి ఘటనపై స్విమ్స్ రెసిడెన్షియల్ డాక్టర్స్ అండ్ స్టూడెంట్స్ అసోసియేషన్ తరఫున ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోమనకే 'తెలుగు' కీర్తి



ఆగస్టు రెండున తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నోట తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరును జోడిస్తామనే ప్రస్తావన వెలువడింది. అసెంబ్లీలో ఈ విశ్వవిద్యాలయ చట్టంలో ఆ మేరకు మార్పు చేసిన తర్వాతనే కొత్త పేరు అమలులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయానికి ఏ పేరు పెట్టాలి అని తిరిగి జనసామాన్యంలో చర్చమొదలయింది.

తమిళ విశ్వవిద్యాలయం, కన్నడ విశ్వవిద్యాలయం పేర్లకు మరో పేరు జోడింపు లేదు. హిందీ విశ్వవిద్యాలయానికి కూడా జోడింపు లేదు. అదే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడినప్పుడు దాని పేరు తెలుగు విశ్వవిద్యాలయమే. 1985లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆకాంక్ష ఫలితంగా ఆయన అధినేతృత్వంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడింది. 1998 దాకా అదే పేరు కొనసాగింది. కారణం ఏమిటో తెలియదు గానీ ఉన్నట్టుండి తెలుగు విశ్వవిద్యాయానికి 1998లో పొట్టి శ్రీరాములు పేరు జోడించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన ప్రాణత్యాగమే కారణం కాబట్టి ఆ పేరు పెట్టారని అనుకోవచ్చు. జీవితాన్ని ఆంధ్రాభ్యుదయానికి అంకితం చేసిన నాటి నిస్వార్థ కాంగ్రెస్ నాయకుడు పొట్టి శ్రీరాములు. ఆయన ఆత్మ బలిదానం వెలకట్టలేనిది. అయినా ఆయన సాహిత్యకారుడు కానీ సంస్కృతి అద్వేత కానీ చరిత్రకారుడు కానీ కాదు. తెలుగు విశ్వవిద్యాలయం భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, చరిత్రను అధ్యయనం చేయడానికి ఉద్దిష్టమైన ఉన్నతస్థాయి విద్యాసంస్థ. అందువల్ల, ఒక విశ్వవిద్యాలయానికి శ్రీరాములు పేరుపెట్టడం సబబు కాదని అనిపిస్తుంది.

ఇక, దాదాపు అరవై సంవత్సరాలుగా సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 2014లో సఫలమై తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. విభజన చట్టం ప్రకారం ఉమ్మడి విశ్వవిద్యాలయాలు, ఉమ్మడి సంస్థలు పదేళ్ళలో విడిపోవలసి ఉంది. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి తెలుగు విశ్వవిద్యాలయానికి పేరు మార్చాలనే అభిప్రాయం వ్యక్తమవుతూ వస్తోంది. పొట్టి శ్రీరాములు పేరు ఆంధ్రప్రాంతంలోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఉండవచ్చు. కనుక తెలంగాణలోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఏ పేరు అనే విషయంపైన మొదటి నుండి రెండుపేర్లు ప్రముఖంగా వినవచ్చాయి. తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడు పేరు ఉండాలని, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలనే రెండు అభిప్రాయాలు ప్రముఖంగా వ్యక్తమయ్యాయి. ఆంధ్రప్రాంతంలో రాజమండ్రిలో 2006లో విశ్వవిద్యాలయం పెట్టినప్పుడు దానికి నన్నయ పేరు పెట్టారు. అది మంచి ఆలోచనే. నన్నయకన్నా ముందు తెలుగులో కవులు చాలామంది ఉన్న ఉనికి మనకు తెలిసినా లభించిన సంపూర్ణ కావ్యం నన్నయ భారతమే కనుక ఆదికవి గౌరవం ఆయనకు దక్కింది. ఆయన పేరు ఒక విశ్వవిద్యాలయానికి పెట్టడం ఎంతైనా సముచితం. అసలు దాన్ని అక్కడి తెలుగు విశ్వవిద్యాలయానికే పెట్టినట్లైతే మరింత బాగుండేది.

> తెలంగాణలో తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుని పేరు, పాలమూరు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, తెలంగాణ విశ్వవిద్యాలయానికి సినారె పేరు పెట్టడం సముచితంగా ఉంటుంది.

ఇదే నేపథ్యంలో, తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి పేరుతోనే ఉండడం ఎంతైనా సమంజసం. భాషాసాహిత్యాల అధ్యయనం ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన విశ్వవిద్యాలయానికి ఆది కవి అయిన పాల్కురికి సోమనాథుని పేరు ఉంచడమే సంపూర్ణంగా సమంజసమైనది. అలాగని సురవరం ప్రతాపరెడ్డిని, ఆయన కృషిని ఏ మాత్రం తక్కువ చేసినట్లుకాదు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ తొలితరం మేధావి. తెలంగాణ భాషకు, ఇక్కడి సాహిత్యకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించిన మహనీయుడు. ఆంధ్రుల సాంఘిక చరిత్రను రచించిన చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి. పాత్రికేయుడుగా పనిచేశారు. తెలంగాణలో కవులు లేరని ఇతరులు ఈసడిస్తున్న కాలంలో గోల్కొండ పత్రిక ద్వారా ఎందరో తెలంగాణ కవుల ఉనికిని వారి సాహిత్యాన్ని బయటి ప్రపంచానికి తెలియజేశారు. ఆయన కథకుడు కూడా. అయితే శతాబ్దాల చరిత్ర ఉన్న తెలుగు భాష సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే తెలుగు విశ్వవిద్యాలయానికి, విస్తృత సాహిత్యాన్ని సృష్టించి సామాజిక సంస్కరణలకు దారివేసిన పాల్కురికి సోమనపేరే సరిగ్గా సరిపోతుంది. అదే పెట్టవలసిన పేరు. సురవరం ప్రతాపరెడ్డి పేరును మహబూబ్ నగర్‌లో ఏర్పడ్డ పాలమూరు విశ్వవిద్యాలయానికి కానీ మరొక విశ్వవిద్యాలయానికి కానీ పెట్టవచ్చు. కన్నడిగులు తమకీర్తి పతాక, జ్ఞానపీఠకవి అయిన కువెంపు పేరుతో ఒక విశ్వవిద్యాలయాన్నే స్థాపించారు. తెలంగాణకి తొలిసారి జ్ఞానపీఠ పురస్కారాన్ని తెచ్చిన సినారె పేరును కూడా ఒక విశ్వవిద్యాలయానికి పెట్టవచ్చు. అది శాతవాహన విశ్వవిద్యాలయానికి కానీ లేదా తెలంగాణ విశ్వవిద్యాలయానికి కానీ పెట్టవచ్చు.

ఈ దృష్ట్యా తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుని పేరు, పాలమూరు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, తెలంగాణ విశ్వవిద్యాలయానికి సినారె పేరు పెట్టడం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. మన గొప్ప సాహిత్యకారులు ముగ్గురిని ఇలా తెలంగాణ ప్రజలు గౌరవించుకున్నట్లు అవుతుంది. ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దీన్ని గురించి ఆలోచించాలి. మేధావులు వారి భావాలు స్వేచ్ఛగా ప్రకటించాలి.

• ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి

కృత్రిమమేధ కాలంలో కమ్యూనిస్టులు

'రెండు కాళ్ళ జీవులు ప్రమాదకరమైనవి; నాలుగుకాళ్ళ జీవులు గొప్పవి' అని జార్జ్ ఆర్వెల్ నవల 'Animal Farm'లో జంతువులన్నీ కలిసి ఒక తీర్మానం చేస్తాయి. కాళ్ళు రెక్కలు తోకలు మాత్రమే కాదు సృష్టిలో మనుషులకు ఇతర జీవులకు తేడాలను చూడాలనుకుంటే అనేకానేక వైవిధ్యాలు కనిపిస్తాయి. జంతువులు గుంపులుగా సంచరిస్తాయి; మనుషులు సమాజంగా కొనసాగుతారు. ఇతర జీవులు సంతతిని కని వాటి జీవిక కోసం ఆహారాన్ని సేకరిస్తాయి. మనిషి ఆహార సేకరణతో ఆగిపోడు; అవసరమైనప్పుడు తానే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తాడు. ఉత్పత్తి అవసరాల కోసం పనిముట్లను, యంత్రాలను సృష్టిస్తాడు. 'పనిముట్లను తయారు చేసే జీవి మనిషే' అని బెంజమిన్ ఫ్రాంక్లిన్ (1706–90 అమెరికా రాజనీతిజ్ఞుడు, రచయిత, శాస్త్రవేత్త) అన్నాడు. ఆయన అంతటితో ఆగలేదు. 'మనిషి సృష్టికర్త' (Man the Maker), 'మనిషి ఆలోచనా పరుడు' (Man the Thinker) అని కూడా అన్నాడు.

తొలి పనిముట్ల నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాఫ్ట్‌వేర్ దాకా యంత్రాల చరిత్రలో అనేక తరాలు సాగిపోయాయి. ప్రతి తరంలోనూ యంత్రాలు సమాజంలో కొత్త ఆలోచనల సంచయానికి కూడ దోహదం చేస్తాయి. పారిశ్రామిక విప్లవం సంభవించి వుండకపోతే డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్నీ, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణను, కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయగలిగేవారు కాదు. యంత్రాల అభివృద్ధి–మనిషి ఆలోచనల విస్తృతి మధ్య ఒక అవినాభావ సంబంధం ఉంటుంది.

యంత్రాలు, సాంకేతికతలు మానవ సంబంధాలనూ తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ముందు అవి సంపద సృష్టికి దోహదపడతాయి. మరోవైపు, సంపద పంపిణీ మనుషుల్ని విభజిస్తుంది. కొన్ని సమూహాలు యజమానులుగా అవతరిస్తే మిగిలిన సమూహాలు సేవకులుగా మారిపోతాయి. యంత్రాలు తమ అధీనంలో ఉంటాయి కనుక యజమాని సమూహం సహజంగానే తెలివైనదిగా మారుతుంది. ఏ రంగంలో అయినాసరే తమ ప్రయోజనాల గురించి యజమానులకు ఉన్నంత స్పృహ సేవకులకు వుండదు. సకల రంగాల యజమానుల మధ్య ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఒక ఐక్యత వుంటుంది. సకల వ్యవస్థల యజమానులు క్రమంగా ఏకమవుతుంటారు.

అన్ని రంగాలలోని సేవకులు తాము కూడ యజమానులయ్యేందుకు కొంత తాపత్రయపడడం సహజం. సమాజంలో యజమానులయ్యే అవకాశం కొందరికి మాత్రమే ఉంటుందనీ అత్యధికులు సేవకులుగానే ఉండాల్సి వస్తుందనీ అర్థం కావడానికి చాలా కాలం పడుతుంది. అప్పుడు సమాజంలో సమానత్వం, సోదర భావం అనే ఆలోచనలు అపారంగా వికసిస్తాయి. ఇలాంటి నేపథ్యంలోనే కమ్యూనిజం అనే సిద్ధాంతం పుట్టింది. 'ప్రతి ఒక్కరి నుండి అతని సామర్థ్యం మేరకు, ప్రతి ఒక్కరికి అతని అవసరాలకు అనుగుణంగా' ('From each according to his ability, to each according to his needs') అనేది కమ్యూనిస్టు సమాజానికి ప్రాథమిక కొలమానం. 1875లో రాసిన 'గోథా కార్యక్రమం మీద విమర్శ' పుస్తకంలో కార్ల్‌మార్క్స్ ఈ వివరణ ఇచ్చాడు. ప్రపంచ వ్యాప్తంగా సేవక సమూహాలన్నింటిలోనూ స్పష్టంగానో అస్పష్టంగానో అంతర్లీనంగా ఇలాంటి భావనలే నిరంతరం బలపడుతుంటాయి. మరో మాటలో చెప్పాలంటే సేవక సమూహాలన్నింటి సమిష్టి స్వప్నం సమానత్వం.

ప్రపంచంలో ఎక్కడైనా సరే సేవక సమూహాలకు జీవితం దుర్భరంగా మారి సమిష్టి స్వప్నం ముందుకు వచ్చిన ప్రతీసారీ ఆందోళనలు మొదలవుతాయి. ఉద్యమాలు పోరాటాలు ఊపందుకుంటాయి. ఆందోళనలను అణిచివేయడానికి యజమాని సమూహాలకు అంతర్గతంగానే పటిష్ఠమైన వ్యవస్థ ఉంటుంది. సాయుధ పోలీసులు, తుపాకులు, జైళ్లు, ఉరికొయ్యలు, నిఘా విభాగాలు వగైరాలు వాళ్ళ అధీనంలోనే ఉంటాయి. ఆందోళనల్ని నివారించడానికి ఇంతకన్నా మెరుగైన తెలివైన ప్రత్యామ్నాయాలు కూడ వాళ్ళ దగ్గర ఉంటాయి. అవే సంక్షేమ పథకాలు.

సంక్షేమ పథకాల ద్వార సేవకుల తిరుగుబాట్లను నివారించవచ్చు అని తొలిసారిగా గుర్తించిన ఘనుడు అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం హెన్రీ ఫోర్డ్. రష్యాలో అక్టోబరు విప్లవం జరగడానికి మూడున్నరేళ్ళు ముందే 1914 జనవరి 5న ఆయన తన కార్మికుల మీద వరాల జల్లు కురిపించాడు. 'రోజుకు ఐదు డాలర్లు' వేతనం ప్రకటించాడు. ఆ రోజుల్లో ఇది చాలా ఆకర్షణీయమైన జీతం. 8 గంటల పనిదినాన్ని అమలుపరిచాడు. రోజుకు రెండు షిఫ్టుల పద్ధతి స్థానంలో



> ప్రతి తరంలోనూ యంత్రాలు సమాజంలో కొత్త ఆలోచనల సంచయానికి కూడ దోహదం చేస్తాయి. పారిశ్రామిక విప్లవం సంభవించి వుండకపోతే డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్నీ, ఫ్రాయిడ్ మనో విశ్లేషణను, కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయగలిగేవారు కాదు. యంత్రాల అభివృద్ధి–మనిషి ఆలోచనల విస్తృతి మధ్య ఒక అవినాభావ సంబంధం ఉంటుంది.

మూడు షిఫ్టుల పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఒక్కో దేశంలో ఒక్కో యూనిట్ పెట్టాడు. అంటే శ్రమ విభజనతోపాటు శ్రామికులను కూడ విభజించాడు. కార్మికులకు సౌకర్యవంతమైన నివాసం, మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించాడు. దానితో ప్రపంచ వ్యాప్తంగా నిపుణులైన కార్మికులు ఫోర్డ్ సంస్థలో చేరడానికి పోటీపడ్డారు. అంతకు మించి వాళ్ళు ఫోర్డుకు పరమ విధేయులుగా మారిపోయారు. ఫోర్డు సంస్థలో ఉత్పత్తి పెరిగింది. సరుకు నాణ్యత పెరిగింది. మార్కెట్లో పోటీ లేకుండా పోయింది. అంతిమంగా కంపెనీకి లాభాలు పెరిగాయి.

ఫోర్డ్ ఫార్ములా పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాల్లోనూ ప్రవేశించింది. అమెరికాలో పెద్ద ఎత్తున ఉద్దీపన చర్యలు మొదలయ్యాయి. మనదేశంలో ఉచిత బియ్యం, ఉచిత వైద్య ఆరోగ్య సేవలు, ఫీజుల రీయింబర్స్‌మెంట్, పేదలకు పక్కా ఇళ్ళు, వ్యవసాయానికి సబ్సిడీలు, భూపరిమితి చట్టాలు, వ్యవసాయ కూలీలకు భూముల పంపకాలు మొదలైన సంక్షేమ పథకాలన్నీ గతంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్‌బరీ ఉద్యమం, శ్రీకాకుళం గిరిజన పోరాటం, నక్సలైట్ల పోరాటాల సందర్భంగా వివిధ కమ్యూనిస్టు పార్టీలు ముందుకు తెచ్చిన డిమాండ్లే. కమ్యూనిస్టుల డిమాండ్లను ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు హైజాక్ చేసి ఎన్నికల హామీగా మార్చేసుకున్నాయి. ఏదో ఒక మేరకు అమలు కూడ చేస్తున్నాయి. దానితో పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలు అంతరించిపోతున్న జాతిగా మారిపోయాయి. దీని అర్థం దేశంలో కార్మికులు లేకుండాపోయారనీ, వాళ్ళ మీద పీడన లేదనీ కాదు. కొత్త పద్ధతుల్లో కొత్త పీడన కొనసాగుతూనే ఉంటుంది.

శ్రామిక సమూహాలను పునర్ నిర్వచించే చారిత్రక బాధ్యతను కమ్యూనిస్టు పార్టీలు ఎప్పటికప్పుడు నిర్వర్తిస్తుండాలి. అవి ఆ బాధ్యతను మరచిపోయాయి. శ్రామిక సమూహాల బహుళ అస్తిత్వాలు కూడ కమ్యూనిస్టు నాయకులకు అర్థం కాలేదు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు వ్యవసాయకూలీలుగా ఉన్న కాలంలో కమ్యూనిస్టు పార్టీలే ఆ సామాజిక సమూహాలను సంఘటిత పరిచాయి, కాంగ్రెస్ తదితర పార్టీలకన్నా మెరుగైన రాజకీయ చైతన్యాన్ని అందించాయి. అయితే, ఆ సమూహాలు తమ సామాజిక ఉనికిని ప్రదర్శించినపుడు కమ్యూనిస్టు పార్టీల నాయకులు దాన్ని ఒక అనివార్యమైన చారిత్రక పరిణామంగా గుర్తించలేకపోయాయి. అసలు ఈ పరిణామాన్ని వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. ఇప్పుడు బహుజనులు వేరు, కమ్యూనిస్టు పార్టీలు వేరు అనే అవాంఛనీయ పరిస్థితి ఏర్పడింది.


భారత కమ్యూనిస్టు నాయకుల్లో 1940లు, 1950లలో ఒక వెలుగు వెలిగిన అగ్రనేతలందరూ వ్యవసాయిక కుటుంబాల నుండి వచ్చినవారే. వాళ్ళకు వ్యవసాయం, నీటిపారుదల గురించి లోతుగా తెలుసు. కానీ అప్పటి ఆధునిక యంత్రాల గురించి అంతగా తెలీదు. నిజానికి అప్పటికి మన దేశంలో యంత్రాల ఉపయోగం కూడ శైశవ దశలో వుంది. కమ్యూనిస్టు పార్టీ నాయకుల మేధోశక్తి కూడ ఆ పరిమితుల్లోనే వుండింది. తమ కాలం నాటి సమాజాన్ని వాళ్ళలో ఏ ఒక్కరూ సమగ్రంగా విశ్లేషించలేపోయారు. విప్లవం వ్యవసాయరంగంలో మొదలై, తొలుత గ్రామీణ ప్రాంతాలను విముక్తం చేసి, ఆ తరువాత పట్టణాలను విముక్తం చేస్తుందని వారంతా గట్టిగా నమ్మేరు. ఇప్పటికీ చాలామంది సీనియర్ కమ్యూనిస్టు అభిమానులు 1950ల నాటి 'ఆంధ్రా థీసిస్'ను మహత్తర ప్రతిపాదనగా భావిస్తుంటారు. 1940లలో చైనాలో మావో ప్రతిపాదించిన నూతన ప్రజాస్వామిక విప్లవంకు అది ఇండియన్ వెర్షన్ తప్ప అందులో మన కమ్యూనిస్టు నేతలు జోడించిన సృజనాత్మకత పెద్దగా ఏమీ లేదు. దానినే తరువాతి కాలంలో మరికొంత స్థానిక అన్వయంతో కొండపల్లి సీతారామయ్య 'వ్యవసాయిక విప్లవం'గా అభివృద్ధి చేశారు. అప్పటికే అత్యంత ఆధునిక, సంక్లిష్ట, యంత్రాల ప్రవేశంతో సమాజం సామాన్యులు విశ్లేషించలేనంత వైవిధ్యపూరితంగా మారిపోయింది. తత్కారణంగా కొండపల్లి ఫార్ములా కూడ పనిచేయలేదు. 1990లలో తూర్పు యూరోప్, రష్యా పతనాల తరువాత ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుతో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశించాక కమ్యూనిస్టు నాయకుల నిస్సహాయత మరింత పెరిగింది.

అణగారిన సమూహాలు పాత పద్ధతుల్లో జీవించలేని స్థితికి చేరడమేగాక, ఆధిపత్య సమూహాలు సహితం పాత పద్ధతుల్ని కొనసాగించలేని స్థితికి చేరుకున్నప్పుడే విప్లవం సంభవిస్తుందని లెనిన్ అన్నాడు. విప్లవకర పరిస్థితి, విప్లవకర పార్టీ, విప్లవించడానికి సిద్ధపడిన ప్రజా సమూహాలు లేకుండా విప్లవం సాధ్యంకాదని కూడ ఆయనే అన్నాడు. ఇప్పటికి కూడ ఇదీ భారత సమాజ స్వభావం, ఇందులో వీళ్లు విప్లవకర శక్తులు, ఇదీ వీరు చేపట్టాల్సిన విముక్తి కార్యక్రమం అని తేల్చి చెప్పగలిగిన కమ్యూనిస్టు పార్టీ ఒక్కటీ ఈ రోజు భారత దేశంలో లేదు. అధునాతన సాంకేతికతలపై సమగ్ర అవగాహన లేనివాళ్ళు విప్లవ కార్యక్రమాన్ని రూపొందించలేరు.

▪ డానీ
సీనియర్ జర్నలిస్టు

ఇనుగుర్తిలో జ్ఞాన వెలుగులు

ఒద్దిరాజు సోదరుల 'తెనుగుపత్రిక' గూర్చి చెప్పేముందు వారి గురించి కొంత చెప్పాలి. ఒద్దిరాజు సోదరుల స్వగ్రామం ఇనుగుర్తి (వరంగల్ జిల్లా, కేసముద్రం మండలం). సోదరుల్లో పెద్దవాడు సీతారామ చంద్రరావు, చిన్నవాడు రాఘవ రంగారావు. సోదరుల మధ్య ఏడున్నర సంవత్సరాల వ్యత్యాసం. తండ్రి వెంకట రామారావు, తల్లి రంగనాయకమ్మ. ఆమె సంస్కృతాంధ్ర భాషలలో పండితురాలు. తన తాతగారి వద్ద భారత భాగవతాలు, ద్రావిడ ప్రబంధాలు, సంస్కృత శ్లోకాలే కాకుండా వివాహ ఉపనయనాలను నిర్వహించే మంత్రాలను సైతం నేర్చుకున్నారామె. ఈ చదువును ఆమె తన కుమారులకు సమున్నతంగా సంక్రమింపజేశారు. సోదరులిద్దరు ఒక్క తనువుగా మెసలుతూ తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించారు, కాలం తెలియకుండా సమస్త కావ్యాలను, శాస్త్ర గ్రంథాలను ఔపోసన పట్టినారు. తెలుగుతో పాటు, సంస్కృతం, ఉర్దూ, తమిళం, మలయాళం, కన్నడం, ఇంగ్లీషు, హిందీ మొదలగు భాషలను నేర్చుకున్నారు. 1911లో సోదరులు మద్రాసు విజ్ఞాన చంద్రికా మండలి పరీక్షలు రాయడానికి ఫీజు కట్టారు. అప్పుడు తెలంగాణలో నిజాం రాజుల సిక్కా. హాలీ కరెన్సీ, మద్రాసులో కల్దారు అనే కరెన్సీలోకి మార్చి ఫీజు మనియార్డర్ ద్వారా పంపారు. పరీక్ష నిమిత్తం మద్రాసుకు 18 రోజుల ముందే బయలుదేరి వెళ్ళారు. అయితే పొరపాటున తమ పుస్తకాలను గ్రామంలో మరిచిపోయారు. మద్రాసులో ఆ పుస్తకాల కొరత ఉన్నందున అక్కడే ముద్రణ జరుగుతున్న జయశంకర్ ప్రింటింగ్ ప్రెస్ అధినేత వీరన్నశెట్టిని వేడుకుని ప్రూఫ్ అవుతున్న పుస్తకాలను అక్కడనే చదువుతూ విజ్ఞాన చంద్రిక పరీక్షలను ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణత సాధించి కందుకూరి వీరేశలింగం పంతులుగారి నుంచి బంగారు పతకం, సర్టిఫికెట్ పొందినారు.



> ఒద్దిరాజు సోదరులు ఎంతో శ్రమతో తమ 'తెనుగు పత్రిక' మొదటి సంచికను 500 ప్రతులతో వెలువరించారు. వార్తా సేకరణ, కూర్పు, ముద్రణ, పంపిణీ అన్నీ వారే చేసేవారు. తపాలా అధికారులతో మాట్లాడి ఒక పోస్టు ఆఫీసును ఏర్పాటు చేసారు. ప్రతి సంవత్సరం వెయ్యి ప్రతులను పెంచుతూ ఆరు సంవత్సరాలు పన్నెండు పుటల వార పత్రికగా ప్రతీ ఆదివారం వెలువరించారు. అందు వార్తలతో పాటు వ్యాసాలూ, కవితలు, కథలు ఐదుపుటలలో, ఆరోపుటలో నిజాం వార్తలు, ఇంకా పాఠకుల లేఖలు ఇలా అన్ని అంశాలను పొందుపరిచేవారు.

తరవాత వారు రచనా వ్యాసంగం పైన తమ దృష్టి పెట్టారు. పెద్దలు, విద్యావేత్తల సలహాలతో 1918 మార్చి 3న గ్రామంలో విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల అనే పేరుతో ఒక ప్రచురణ సంస్థను నెలకొల్పారు. తమవి, ఇతరులవి పలు పుస్తకాలను ప్రచురించారు. కాకతీయ రుద్రమదేవి కథాంశంతో ఒక చక్కని కథని రాసి దానిని విజయవాడ (అప్పుడు బెజవాడ) లోని మారుతీ ప్రింటింగ్ ప్రెస్సులో ముద్రించారు. తమ రచనలు ఎక్కడో ముద్రించడంలో గల కష్టాలను అధిగమించడానికి తమ గ్రామం ఇనుగుర్తిలోనే అనంతరం ఒక ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇనుగుర్తి ఒక దట్టమైన అటవీ గ్రామం. ఎలాంటి కనీస సౌకర్యాలు లేవు. అయినా స్వగ్రామం నుంచే తమ వ్యాసంగాన్ని కొనసాగించారు. విజయవాడ నుండి తెచ్చిన ప్రెస్సులో తామే కూర్పు చేస్తూ తమ రచనలు ముద్రించారు. వారి తృష్ణ అంతతో ఆగలేదు. పత్రికా రంగంపైకి మరలింది. ఎంతో శ్రమతో తమ 'తెనుగు పత్రిక' మొదటి సంచికను దుందుభి భాద్రపద శుద్ధ పంచమి ఆదివారం అనగా 27–8–1922 నాడు 500 ప్రతులతో వెలువరించారు. వార్తా సేకరణ, కూర్పు, ముద్రణ, పంపిణీ అన్ని వారే చేసేవారు. తపాలా అధికారులతో మాట్లాడి ఒక పోస్టు ఆఫీసును ఏర్పాటు చేసారు. ప్రతి సంవత్సరం వెయ్యి ప్రతులను పెంచుతూ ఆరు సంవత్సరాలు పన్నెండు పుటల వార పత్రికగా ప్రతీ ఆదివారం వెలువరించారు. అందు వార్తలతో పాటు వ్యాసాలూ, కవితలు, కథలు ఐదుపుటలలో, ఆరోపుటలో నిజాం వార్తలు, ఇంకా పాఠకుల లేఖలు ఇలా అన్ని అంశాలను పొందుపరిచేవారు. మిత్రుల సహకారాలతో వారి ప్రోత్సాహంతో పత్రికను, ప్రెస్సును వరంగల్లుకు మార్చినారు. కాని అక్కడ పత్రిక ఒక్క సంచిక కూడా విడుదలకు నోచుకోలేదు. ఆ విధంగా తెలంగాణలోని మూడవ పత్రికా ప్రస్థానం నిలిచిపోయింది.

1955లో సీతారామచంద్రరావుకు గొంతు క్యాన్సర్ సోకింది. అంత బాధలోనూ తన రచనా వ్యాసంగానికి ఆయన విరామం ఇవ్వలేదు. చివరి ఘడియల్లో ఆసుపత్రిలో కూడా తన చివరి రచన సౌదామిని పరిణయం కావ్యాన్ని రాసి పూర్తి చేశారు. రుద్రమదేవి, శౌర్యశక్తి, వరహముద్ర, బ్రాహ్మణ సాహసము, స్త్రీ సాహసం, ముక్తలవ, నౌకా భంగం (రవీంద్రుని 'రెక్' నవలకు అనువాదం) సీతారామచంద్రరావు నవలల్లో కొన్ని. మోహినీ విలాసం, ప్రేమ వివాహం, శశవిశాణము ఆయన రచనల్లో నాటకాలు. ఇతర అంశాలపై రాసిన పుస్తకాలు అనేకంగా ఉన్నాయి. సంస్కృత రచనల్లో కృష్ణ స్థవ, శ్రీ స్థవ, శుకపక్షీయం, ఉత్సవానంద భాణమ్, వైభవ స్తవః విభక్త్యర్థం, ధాతు నిఘంటువులున్నాయి. పాణిని అష్టాధ్యాయి (వ్యాకరణ సూత్రములు), సిద్ధాంత కౌముదీ అనువాదము. ఆంగ్ల వ్యాకరణము (ది మాన్యువల్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్‌కు అనువాదం) ఇత్యాదివి శాస్త్ర గ్రంథాలు. పలు ఆంగ్ల రచనలు కూడా చేశారాయన. సీతారామచంద్రరావు 28 జనవరి 1956లో తన 68 ఏట కీర్తిశేషులయ్యారు.

రాఘవరంగారావు తమ వృద్ధాప్యంలో కళ్ళు కనపడకున్నా తనవద్దకు వచ్చిన విద్యార్థులకు చదువు చెప్పేవారు, అతని శిష్యరికంలో ఎందరో తెలుగు పండితులుగా పరీక్షలను రాసి ఉత్తీర్ణత చెంది ఉపాధ్యాయులుగా ఉపాధి సముపార్జించుకున్నారు. ఆయన తన 80వ ఏట ఇహలోకయాత్రను ముగించారు. ఈయన రచనలు: వీరావేశము (చారిత్రిక నవల), పంచకూళ కషాయం, విషములు–చికిత్సలు, సప్తపది, ఉత్తర గురుపరంపర, ముదలాయిరం, వణ్ణ మాదంగళ్ (అనువాదాలు), సుశీలా మైనావతి. అర్తి ప్రబంధం (సంస్కృతం) సప్తగాథా వాఖ్య, అష్టాధ్యాయి, తపతీ సంహరణ ఉపాఖ్యానం, మత్కునోపాఖ్యానం. ఒద్దిరాజు సోదరులు ఇరువురు కలసి –ఉపదేశ రత్నమాల, తిరుప్పల్లాండు, భక్తిసార చరిత్ర, సంస్కృత వ్యాకరణం–వంటి రచనలు చేశారు. ఒద్దిరాజు సోదరుల ఎన్నో రచనలు అముద్రితాలుగా మిగిలిపోతే, కాలక్రమేణ లభించిన రచనలను వారి వంశజులు ముద్రించారు. వారి రచనలు కొన్ని తెలంగాణ ఇంటర్, డిగ్రీ కోర్సు తెలుగు పాఠ్యాంశాలలో చోటుచేసుకున్నాయి. ఒద్దిరాజు సోదరుల రచనా వ్యాసంగంపైన శ్రీమతి కొండపల్లి నీహారిణి పరిశోధన చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు.

○ సుభాష్ ఒద్దిరాజు

(ఆగస్టు 27న 'తెనుగు పత్రిక' శతవత్సర వేడుక)

ఆధిపత్యానికి 'తెలుగుదనం' ముసుగు

మొన్న ఆగస్టు 9–11 తేదీల మధ్యన బెంగళూరులో 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ 2024' పేరిట దక్షిణ భారత సాహిత్యోత్సవాలు జరిగాయి. దీనికి తెలుగు నుంచి 'ప్రింట్ మీడియా పార్ట్‌నర్'గా ఆంధ్రజ్యోతి పత్రిక ఉన్నది. ఈ పత్రిక సంపాదకులు కె. శ్రీనివాస్ పంద్రాగస్టు రోజు తన కాలమ్ 'సందర్భం'లో 'మరీ ఇంత కళ తప్పిందేమిటి తెలుగుదనం?' పేరుతో రాసిన వ్యాసం ప్రమోషనల్ ఆర్టికల్‌గా ఉన్నది. తెలుగు సాహిత్యంలో బ్రాహ్మణాధిపత్యాన్ని స్థిరీకరించేందుకు, భిన్నత్వాన్ని సహించరానిదిగా, 'థాట్ పోలిసింగ్'గా ఉన్నది. బహుజన భావజాలాల వారిని, అస్తిత్వవాదుల్ని తెలుగు సాహిత్య సమాజ విరోధులుగా నిర్ధారించే ప్రయత్నం చేసింది. సారాంశంలో బ్రాహ్మణభావజాలమే పరిఢవిల్లాలనే భావనను ప్రచారంలో పెట్టింది. ఇన్నేండ్లుగా తన రచనలు, ఆచరణల ద్వారా 'సబాల్టర్న్' పక్షాన బలంగా నిలబడ్డ గొంతు ఇట్లా మారినందుకు బాధతో రాస్తున్న స్పందనిది.

ఈ వ్యాసంలో శ్రీనివాస్ సందర్భవశాత్తు కొంతమంది పేర్లను ఉటంకించారు. అందులో ప్రకాశ్‌రాజ్, వెంకటేశ్ కుమార్, గీతా రామస్వామి, మృణాళిని, వివిన మూర్తి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, నిర్వాహకులు సతీష్ చప్పరికెలు ఉన్నారు. వీరిలో ఒక్క ప్రకాశ్‌రాజ్ తప్ప మిగతావారందరూ బ్రాహ్మణులే! 'నేమ్ డ్రాపింగ్' అనేది కూడా ఒక కళ. పది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చేంతగా వెంకటేశ్ కుమార్ హిందుస్థానీ గాత్ర సంగీత ప్రదర్శన జరిగింది అని రాశారు. సంతోషం. అయితే దాని వల్ల బహుజనులకు, తెలుగువారికి ఒనగూరే అదనపు ప్రయోజనం ఏమున్నది. మళ్ళీ కె.విశ్వనాథ్ 'శంకరాభరణం' లాంటి సినిమాల ద్వారా జరిగిన బ్రాహ్మణ భావజాల ప్రచారమే ఉంటుంది తప్ప జరిగే మేలు ఏమున్నది? వాళ్లది వాళ్లకు గొప్ప! మన మెందుకు నెత్తిన మొయ్యాలి? అట్లా ఆ ఘనతను కీర్తించడమంటే మనకు అట్లాంటి వారసత్వం లేదు అనే భావన కనిపిస్తున్నది. బహుశా అందుకే 'సంగీతంలోనూ నృత్య రూపాలతోను కలిసి పనిచేసే కవులెవరూ ఉండరు' అని శ్రీనివాస్ నిర్ధారించారు. నిజానికి గతంలో కన్నా ఇప్పుడు తెలంగాణ సంస్కృతి, కళలకు ఢిల్లీ స్థాయిలోనూ గౌరవం దక్కుతోంది. పేరిణి, డప్పు, ఒగ్గు కళారూపాలకు కొత్తగా జవజీవాలందిస్తూ జాతీయస్థాయిలో తెలంగాణ యువ కళాకారులు అవార్డులందుకున్నారు. బోనాలు, బతుకమ్మలతో కవులు మమేకమయింద్రు. 'ముషాయిరా'లు రక్తి కట్టిస్తున్నాయి. "నాటకం ఇంకా పురాణ కాలంలోనో, గత కాలంలోనో మాత్రమే వైభవంతో ఉన్నది" అని కూడా రాసింద్రు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ రవీంద్రభారతి వేదిక మీద ప్రదర్శనకు నోచుకోని వందలమంది కళాకారులు కొత్తగా తెలంగాణ రాష్ట్రంలో వందకుపైగా నాటకాలు, అవన్నీ తెలంగాణ వాళ్లు రాసినవి, తెలంగాణ జీవితాలకు సంబంధించినవి ప్రదర్శించారు. కొత్త కొత్త టెక్నిక్‌లు ఉపయోగిస్తూ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నారు. ఇక్కడి నుంచి సినిమారంగంలో కొత్తగా ఛాన్స్‌లు దక్కించుకున్నవాళ్లు పదుల సంఖ్యలో ఉన్నారు. తెలుగునాట సౌదా ప్రదర్శిస్తున్న నాటక ప్రతిభ తక్కువదేమీ కాదు. సరైన అవకాశం దొరికితే రంగస్థలాన్ని దద్దరిల్లేలాచేసే ఉద్దండులు ఎందరో ఉన్నారు. ఇవేవి పట్టింపు లేకుండా 'మన వాళ్లు వట్టి వెధవాయలోయ్' అన్నట్టుగా స్వీపింగ్‌గా శ్రీనివాస్ రాశారు. ఇది ఆక్షేపణీయం.

ఇక రెండవది శ్రీనివాస్ పేర్కొన్న వ్యక్తుల స్పందన. వీళ్లందరూ తమ కుల కోణంలో నుంచే స్పందించారు. ముందుగా గీతా రామస్వామి స్పందన చూద్దాం. ప్రకాశ్ రాజ్, పెరుమాళ్ మురుగన్, వసుధేంద్ర, జయమోహన్, సచ్చిదానందన్‌లను పోల్చుతూ "తెలుగు నుంచి అటువంటి సాహిత్య వ్యక్తిత్వాలు వస్తున్నాయా? సాహిత్యాన్ని, కళలని ఇంతగా అభిమానించే సమాజం మనకెందుకు లేదు?" అని గీతారామస్వామి బాధను రికార్డు చేశారు. మన తెలుగులో ఇటువంటి వాళ్లెందుకు లేరు, ఉన్నారు. అయితే వాళ్లని కొంచెం బ్రాహ్మణీయ అద్దాలు తొలగించి చూడాల్సి ఉంటుంది. ఉదాహరణకు 'శప్తభూమి' నవల రాసిన బండి నారాయణస్వామి, రాయలసీమ జీవితాలను–ఉద్యమాలను బహుజన సోయితో సాహిత్యంలో రికార్డు చేస్తున్న జి.వెంకటకృష్ణ, శాంతి నారాయణ, వి.ఆర్.రాసాని, మూడు దశాబ్దాలుగా బహుజన సోయితో రాస్తూ, ఆధిపత్యాలను ధిక్కరిస్తున్న గుంటూరు లక్ష్మీనర్సయ్య, అంబటి సురేంద్ర రాజు, దేవరాజు మహారాజు అందుకు సమర్థులు కారా? కవిత్వంలో నూతన అభివ్యక్తిని, బహుజన సోయిని ప్రదర్శిస్తున్న ప్రసాదమూర్తి, అన్నవరం దేవేందర్, జూకంటి జగన్నాథం, బహుభాషా కోవిదులు నలిమెల భాస్కర్, ముస్లిం అస్తిత్వ వాదాన్ని భుజాన మోస్తున్న స్కైబాబ, బహుజన జీవితాలను కవిత్వంలో 'కుర్చీ' మీద కూర్చోబెడుతున్న వనపట్ల సుబ్బయ్య యువ ధిక్కార గొంతుక అవనిశ్రీ, దళిత ఈస్థటిక్స్‌ని విమర్శలోకి తీసుకొచ్చిన కోయి కోటేశ్వరరావు, కథా సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్, కాలువ మల్లయ్య, యువ పురస్కార గ్రహీతలు పసునూరి రవీందర్, మానస ఎండ్లూరి, మెర్సీ మార్గరెట్, తగుళ్ల గోపాల్ లాంటి వ్యక్తులు లెక్కకు మించి ఉన్నారు. వాళ్లందరి పేర్లు ఇక్కడ పేర్కొనడం వీలు కాదు కాబట్టి వదిలేస్తున్న. పైన పేర్కొన్న బ్రాహ్మణ సాహిత్యవేత్త లెవ్వరికీ వీళ్లు రచయితలుగా కనబడడం లేదు. అంతేగాదు "తెలుగు నేల నుంచి అక్కడి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన వారందరిలోనూ అవే ప్రశ్నలు. ఒకవైపు ఉదాత్తమైన,



> ఆ వ్యాసంలో కె. శ్రీనివాస్ సందర్భవశాత్తు కొంతమంది పేర్లను ఉటంకించారు. వీరిలో ఒక్క ప్రకాశ్‌రాజ్ తప్ప మిగతావారందరూ బ్రాహ్మణులే. సాహిత్యంలోనే కాదు సభల్లోనూ, అవార్డుల్లోనూ బహుజనులను ప్రభుత్వ అకాడెమీలు, సంస్థలు అంటరానివారుగానే చూస్తున్నాయి. బహుజనులు ఎట్లుండాలో, ఏమి ఆలోచించాలో, ఎలాంటి సంస్కృతిని ప్రేమించాలో 'థాట్ పోలిసింగ్' చేయడం సమంజసం కాదు.

గంభీరమైన కళాసాహిత్య విషయాలను ఆనందిస్తూనే, గుండెలకు గుచ్చుకుంటున్న కించపాటుతో వారు నొప్పి పడ్డారు". ముందుగా తెలుగునేల నుంచి అక్కడి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిందెవరు? ఆహ్వానితులెవ్వరు? ప్రధాన వేదికల మీద అందరూ ఆధిపత్య కులాల వాండ్లే కదా! రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీలను 'సెల్'లకు పరిమితం చేసినట్లుగా తెలుగు దళిత మహిళలను 'సెల్'లకు పరిమితం చేసినదాని గురించి ప్రశ్నించాల్సిన అవసరం లేదా? ప్రధాన వేదికమీద తెలుగు సాహిత్య అంబాసిడర్లుగా ఎవరున్నారు? ఒక్క తెలుగు కవినయినా సభకు ఆహ్వానించారా? ఒక్క బీసీ కూడా లేకుండా సభ నిర్వహించుకునేందుకు తెగించినవారిని 53 శాతం జనాభా పక్షానా మీరు మందలించారా? పైపెచ్చు అట్లా వివక్షా పూరితంగా వ్యవహరించిన వారిని ఆరాధిస్తూ "సాంస్కృతిక జీవనంలోనూ, విలువల పాటింపులోను, కొత్త పతన స్థాయిని, లేకితనంలో కొంగ్రొత్త పతాక స్థాయిని అందుకుంటున్న ప్రయాణం తెలుగువారిది" అని మీ పత్రికను చదువుతున్న మెజారిటీ పాఠకులను అవమానపరిచారు.

శ్రీనివాస్ తన వ్యాసాన్ని కొనసాగిస్తూ "ఎవరి శిబిరం వారు నిర్వహించుకుంటూ కూడా ఉమ్మడి ఉత్సవాలు నిర్వహించుకోవచ్చు. కానీ, ఒకరి పొడ మరొకరికి గిట్టని తనం తెలుగులలో ఎక్కువ" అని సాహిత్య అకాడెమీ తెలుగు కన్వీనర్ సి.మృణాళిని అభిప్రాయంగా రాశారు. సాహిత్యంలోనే కాదు సభల్లోనూ, అవార్డుల్లోనూ బహుజనులను ప్రభుత్వ అకాడెమీలు, సంస్థలు అంటరాని వారుగానే చూస్తున్నాయి. ఆధిపత్య కుల సాహిత్యకారులు వేదిక మీద ముఖ్య అతిథులుగా ఉంటే వారి రాజసాన్ని తిలకించేందుకు, ప్రవచనాలను వినేందుకు బహుజనులు ప్రేక్షకులుగా హాజరు కావాలి. అంతేనా?

బ్రాహ్మణాధిపత్యం ప్రభుత్వ సొమ్ముతో అగ్రకులాల వారిని కుడి, ఎడమల భావజాలాలకు అతీతంగా పీటలపై, పీఠాలపై కూర్చుండబెట్టే పనిచేస్తూ ఉన్నది. సారాంశంలో బ్రాహ్మణాధిపత్యాన్ని స్థిరీకరిస్తున్నారు. అందుకే గతంలో ప్రశ్నించడం దగ్గరే ఆగిపోయిన బహుజనులు ఇప్పుడు ధిక్కరిస్తున్నారు. ఇది నొప్పిగానే ఉంటుంది. ఈ నొప్పి మెజారిటీ బహుజనులకు హాయినిస్తుంది.

నిజానికి ప్రతి సంవత్సరం సబాల్టర్న్ మిత్రులము 'బహుజన–కూడలి' సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నాము. కోవిడ్ సమయంలో దాదాపు వందమంది బహుజన విమర్శకుల చేత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రాసిన కథ, కవిత్వ గ్రంథాలపై ఫేస్‌బుక్‌లో లైవ్ ప్రోగ్రామ్‌లను నిర్వహించాము. దున్న ఈద్దాసు తత్వాలను 'ఈష ఫౌండేషన్' ప్రోగ్రామ్‌లో పాడి మంగ్లీ ఆ తత్వాలకు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చింది. బహుజనులు సృజిస్తున్న సాహిత్యాన్ని, విమర్శను ఎన్నడూ మెయిన్‌స్ట్రీమ్ మీడియా తగినంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే అన్ని మీడియా హౌజ్‌ల సంపాదకులు / సాహిత్య పేజీల ఇంచార్జ్‌లు బ్రాహ్మణాధిపత్య భావజాలంతోనే ఉన్నారు. అదే బహుజనులకు ప్రధాన సమస్య.

నిజానికి 'బెంగళూరు' సమావేశంలో పాల్గొనకపోవడం గర్వంగా భావిస్తున్న మా లాంటి వారి మనోభావాలను కూడా మీరు గణనలోకి తీసుకోవాల్సింది. బ్రాహ్మణాధిపత్య సభలో పాల్గొనకపోవడం అంటే బహుజనుల స్వీయ అస్తిత్వ ప్రకటనగా చూడలేమా? దాన్ని మీరు 'స్వీయ అహంకారంగా' వ్యక్తీకరించారు. బహుజనులు ఎట్లుండాలో? ఏమి ఆలోచించాలో? ఎలాంటి సంస్కృతిని ప్రేమించాలో 'థాట్ పోలిసింగ్' చేయడం సమంజసం కాదు. ఆధిపత్య భావనకు 'తెలుగుదనం' ముసుగు తగిలించడం తగదు.


◆ డా. సంగిశెట్టి శ్రీనివాస్

సైబర్ రన్

పోలీసు కమిషనరేట్‌లో మూడేళ్లలో పెరిగిన సైబర్ క్రైమ్

ఆన్‌లైన్ వేదికగా రూ.100 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లు

- ఒక మోసం నుంచి తేరుకునేలోపే మరో కొత్త మోసం
- టెక్నాలజీతో ఈజీగా దోచేస్తున్న బూచోళ్లు



అక్షరాలా రూ.100 కోట్లు. ఇవి ప్రభుత్వం సంక్షేమానికి విడుదల చేసిన నిధులు కాదు. అలాగని ఏదో అభివృద్ధి పథకానికి రూపొందించిన అంచనా అంతకన్నా కాదు. ముక్కుముఖం తెలియకుండా, ఊరూపేరు లేకుండా ఉత్తరాది రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు లాగేసిన మొత్తం. సైబర్ నేరగాళ్లు విసిరిన లింకుల్లో ఇరుక్కుని పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రజలు మూడేళ్లలో రూ.100.35 కోట్లు కోల్పోయారు. ఒక తరహా మోసాలపై ప్రజలకు అవగాహన వచ్చిందని తెలియగానే సైబర్ నేరగాళ్లు ట్రెండ్ మార్చేస్తున్నారు. సరికొత్త మోసంతో ప్రజల కష్టార్జితాన్ని మాయం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏటా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోంది. వాటిలో ప్రజలు పోగొట్టుకుంటున్న డబ్బే ఎక్కువగా ఉంటోంది. ఈ-నేరాలకు సంబంధించి ఈ ఏడాది ఇప్పటి వరకు 1,926 కేసులు నమోదయ్యాయి. వాటిలో మొత్తం రూ.39.64 కోట్లను బాధితులు కోల్పోయారు. ఈ కేసుల్లో దర్యాప్తు సాగించిన సైబర్ పోలీసులు రూ.5.34 కోట్లను నేరగాళ్లు బ్యాంకుల నుంచి తీసుకోకుండా స్తంభింపజేశారు. గడిచిన ఏడాది 1,702 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో బాధితులు రూ.56.11 కోట్లను సైబర్ నేరగాళ్ల పరం చేయగా, పోలీసులు రూ.3.68 కోట్లను సీజ్ చేశారు. 2022లో 463 కేసులు నమోదు కాగా, రూ.4.80 కోట్లను బాధితులు కోల్పోయారు. అందులో రూ.33 లక్షలను పోలీసులు స్తంభింపజేశారు. 2022లో నమోదైన కేసుల కంటే 2023లో 1,239 కేసులు పెరిగాయి. 2023లో నమోదైన కేసుల కంటే ఈ ఏడాది ఇప్పటి వరకు 224 కేసులు పెరిగాయి. మొదట్లో ఓటీపీ మోసాలు ఎక్కువగా జరిగేవి. పోలీసులు, బ్యాంకర్లు విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రజలు కళ్లు తెరిచారు. ఆ తర్వాత నుంచి సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలు తొక్కుతూ ప్రజల కరెన్సీని కొల్లగొడుతున్నారు.

యూపీఐ నేరాలే ఎక్కువ

ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా మోసపోతున్న సైబర్ నేరాలు 16 నుంచి 18 వరకు ఉన్నాయి. వాటిలో యూపీఐ మోసాలు ఎక్కువ. ఓటీపీ మోసాలు తగ్గాక లోన్‌యాప్‌లు ప్రజల ప్రాణాలు తీశాయి. లోన్‌యాప్‌లు, మ్యాట్రిమోని వెబ్‌సైట్ల ద్వారా జరిగిన మోసాలు, పార్ట్‌టైం ఉద్యోగాలు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు ఇవన్నీ యూపీఐ కేటగిరీ కిందకు వస్తాయి. ఇందులో లావాదేవీలన్నీ ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా జరుగుతాయి. ప్రస్తుతం ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. 2022లో యూపీఐ మోసాలు 684 జరిగాయి. 2023లో ఈ సంఖ్య 1,950 కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 1,466 జరిగాయి.

తాజా ట్రెండ్ ఇదీ..

రెండేళ్లుగా సైబర్ నేరగాళ్లు కొత్త 'ఈ' మోసాలు మొదలుపెట్టారు. ఇందులో ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సర్వీస్), డిజిటల్ అరెస్టు, డిమ్యాట్ అకౌంట్ నేరాలు ఉన్నాయి. డిజిటల్ అరెస్టు పేరుతో జరిగిన మోసాల్లో ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు బాధితులు ఈ-కాప్స్‌ను ఆశ్రయించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 82 కేసులు నమోదయ్యాయి.

ఏడాది	నమోదైన కేసులు	కోల్పోయిన నగదు	స్తంభింప చేసిన నగదు
2022	463	రూ.4.80 కోట్లు	రూ.33 లక్షలు
2023	1702	రూ.56.11 కోట్లు	రూ.3.68 కోట్లు
2024	1926	రూ.39.64 కోట్లు	రూ.5.34 కోట్లు



• శాంతి ర్యాలీ

మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని, వారికి భద్రత కల్పించాలని, కోల్‌కతాలో జరిగిన దుర్ఘటనలో బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ స్టెల్లా కళాశాల ఆధ్వర్యంలో శనివారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి, అనంతరం బెంజిసర్కిల్ వద్ద మానవహారంగా నిలబడ్డారు.

ఎవరెవరు ఎక్కడెక్కడికి..? వెళ్లేది అటువైపా.. ఇటువైపా..? అటు వెళ్లాలనుకుంటే రేటెంత? ఇటువైపైతే ఇంకెంత..? సిఫార్సు లేఖలు ఉంటే సరిపోతుందా? లేకపోతే ఏమవుతుంది? ఇన్ని సవాలక్ష గందరగోళాల నడుమ రెండు జిల్లాల్లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రహసనంలా సాగుతోంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఓవైపు అధికారులు తలలు పట్టుకుంటుంటే, నచ్చినచోటకు వెళ్లడానికి ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు ఆచితూచి అడుగులేస్తుంటే, పనిలోపనిగా దండుకునేందుకు ప్రైవేట్ వ్యక్తులు సిద్ధమైపోయారు.



బదిలీలల్లో బందీలు..!

జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల జాతర

- కోరుకున్న చోటకు వెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నాలు
- కీలకంగా ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు
- ప్రసన్నం చేసుకున్న వారి పేర్లతో ప్రత్యేక జాబితాలు
- రెవెన్యూ ఉద్యోగులు పక్క జిల్లాలకు వెళ్లాలంటే ఓ రేటు
- కూటమి నాయకుల చుట్టూ 'ఆర్‌డబ్ల్యూఎస్' ఉద్యోగులు
- వెబ్‌కౌన్సెలింగ్ ద్వారానే సచివాలయ ఉద్యోగుల బదిలీలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గతంలో రెవెన్యూ విభాగంలో డెప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు సంబంధించిన బదిలీలకు కలెక్టరేట్‌లో దరఖాస్తులు అందజేసేవారు. ఏ ప్రాంతానికి బదిలీ కోరుకుంటున్నారో తెలియజేసేవారు. ప్రస్తుతం ఈ పద్ధతి అమల్లో లేదు. కొంతమంది ఉద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి సిఫార్సు లేఖలను తెచ్చుకుని, వారు పనిచేసే కార్యాలయాల్లోనే దరఖాస్తులు ఇచ్చుకుంటున్నారు. అయితే, బదిలీలకు సంబంధించిన జాబితాలు కలెక్టరేట్‌లో తయారు చేస్తారా లేక శాసనసభ్యుల పీఏలు తయారుచేసి కలెక్టరేట్‌కు పంపుతారా అనే సందిగ్ధత వీడట్లేదు. ఇటీవల వరకు కలెక్టర్ సెలవులో ఉండటంతో సోమ, మంగళవారం నాటికి ఈ అంశంపై స్పష్టత వస్తుందని రెవెన్యూ ఉద్యోగులు అంటున్నారు.

రేటు చెల్లిస్తే రూటు క్లియర్

రెవెన్యూ విభాగంలో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులు ఎన్టీఆర్ జిల్లాకు వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఇదే అదనుగా చేసుకుని ఒక ప్రజాప్రతినిధి పీఏ మీకు నేనున్నానంటూ అభయమిచ్చేస్తున్నాడని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. తానే బదిలీ జాబితాలను తయారు చేస్తున్నానని చెబుతూ, తెరవెనుక చక్రం తిప్పడం వివాదాస్పదమవుతోంది. గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్న ఈ ఉద్యోగి ప్రస్తుతం రెవెన్యూ విభాగం ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా వ్యవహరిస్తూ పెద్దమొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పుకొంటున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఈ పీఏ వ్యవహారశైలి ఉండటంతో అసలు విషయాన్ని ప్రజాప్రతినిధికి తెలియజేస్తామని ఉద్యోగులు అంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లే వీఆర్వోలకు సంబంధించిన జాబితాలను ప్రజాప్రతినిధి పీఏ ఇప్పటికే తయారుచేసినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకోలేనివారు తమను ఏ ప్రాంతాలకు బదిలీ చేస్తారనే అంశంపై గందరగోళం ఏర్పడింది. జిల్లాల విభజన తరువాత పదోన్నతులు పొంది ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు బదిలీపై వెళ్లిన రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులు ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కృష్ణాజిల్లాకు వచ్చేందుకు దరఖాస్తులు చేసుకున్నట్లు రెవెన్యూ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. ఈ విభాగంలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలంటే పరస్పర అంగీకారం ఉండాలని, ఈ అంశంపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే చర్చ నడుస్తోంది.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో హడావిడి

ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి. ఈ విభాగంలో ఐదేళ్ల పైబడి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఏఈలు, కిందిస్థాయి ఉద్యోగులు తాము ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతంలోనే కొనసాగేందుకు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గుడివాడ, మచిలీపట్నం డివిజన్లలోని ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పనిచేసే ఉద్యోగుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. దీంతో అధికారులు కూటమికి చెందిన ద్వితీయశ్రేణి నాయకుల ద్వారా మంతనాలు జరుపుతున్నారు. ఎలాగైనా వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు లేదా బదిలీ నిలిపి వేయించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

29, 30 తేదీల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలు

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం విడుదల చేయడంతో బదిలీ కోరుకునే సచివాలయ ఉద్యోగులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈనెల 29, 30 తేదీల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు.

డిప్యుటేషన్ మాకొద్దు..!

సీఆర్‌డీఏకు వచ్చేందుకు రెవెన్యూ అధికారులు ససేమిరా..

- కమిషనర్ భాస్కర్ ప్రతిపాదనలు బేఖాతరు
- డిప్యుటేషన్ ఆదేశాలిచ్చినా ఇంకా వెనుకంజ


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) రెవెన్యూ విభాగంలోకి డిప్యుటేషన్‌పై రావటానికి అధికారులు, ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు. రెవెన్యూ శాఖ నుంచి రావటానికి అనాసక్తి చూపిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో భూసంబంధిత అంశాలను నిర్వహించటానికి రెవెన్యూ విభాగాన్ని బలోపేతం చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్ నిర్ణయించారు. ఈ మేరకు అడిషనల్ కమిషనర్లతో చర్చించి సమర్థవంతులైన వారిని ఆయన ఎంపిక చేశారు. ఎంపికైన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏలను ఏడాది కాలానికి సీఆర్‌డీఏకు డిప్యుటేషన్‌పై పంపించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాతిపదనను రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ)కు ప్రభుత్వం బదలాయించింది. ఎంపికైన వారంతా డిప్యుటేషన్‌పై సీఆర్‌డీఏకు రావాలంటూ సీసీఎల్ఏ ఆదేశించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆరుగురు తహసీల్దార్లు, నలుగురు డీటీలతో పాటు పెద్దసంఖ్యలో వీఆర్వోలు, వీఆర్ఏలను కోరింది. బదిలీల నేపథ్యంలో ఆయా మండలాల బాధ్యతలు స్వీకరించి రెండు వారాలు కూడా కాకముందే సీఆర్‌డీఏకు రమ్మనడం ఏమిటని వారంతా ఆశ్చర్యపోయారు. కొంతమంది ఓకే.. చెప్పినా, చాలామంది మాత్రం ఆసక్తి చూపించట్లేదు. కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలంటూ మెలిక పెడుతున్నారు. కాగా, సీసీఎల్ఏ అధికారులు ముందుగా కలెక్టర్లకు సమాచారం తెలపకపోవటంతో రెండు జిల్లాల కలెక్టర్లు ఖిన్నులైనట్లు సమాచారం. దీంతో సీసీఎల్ఏ ఈ విషయాన్ని కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లింది. అయితే, పలువురు అధికారులను ఇక్కడి నుంచి పంపటానికి కలెక్టర్లు కూడా ఇష్ట పడలేదు. ఈ పరిణామాలు సీఆర్‌డీఏలో తీవ్ర చర్చనీ యాంశంగా మారాయి. ఈ మొత్తం తతంగంపై కమిషనర్ భాస్కర్ ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం కమిషనర్ ప్రపంచ బ్యాంకు బృంద పరిశీలనలో ఉన్నారు. సోమ వారం నుంచి దృష్టిసారించే అవకాశముంది.

ప్లీజ్.. ఇక వెళ్లండి..!

పంచాయతీ కార్యదర్శుల బలవంతపు బదిలీలు

- రిక్వెస్టులు పెట్టాలంటూ ఆదివారం నాటికి డెడ్‌లైన్
- నియోజకవర్గాలవారీగా గంపగుత్తగా సాగనంపేందుకే..
- వైసీపీతో అంటకాగిన వారిని పంపేయాలంటున్న ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పంచాయతీ కార్యదర్శుల బదిలీల పేరుతో ఉమ్మడి జిల్లాలో పైరవీలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ పేరుతో ఎడాపెడా బదిలీలు చేసేస్తున్నారు. గంపగుత్తగా బదిలీలకు రంగం సిద్ధంచేసేందుకు రిక్వెస్టులు పెట్టుకోవాలని ఆదేశిస్తున్నారు. ఇందుకు ఆదివారాన్ని డెడ్‌లైన్‌గా విధించారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది. పంచాయతీ కార్యదర్శుల పోస్టింగ్‌లకు సంబంధించి రెండు జిల్లాల్లోని డీపీవో కార్యాలయాలు బేరాలకు దిగటం విమర్శలకు దారి తీస్తోంది. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేసినప్పటికీ మెడికల్ గ్రౌండ్స్, స్పౌస్ ఆధారిత విజ్ఞాపనలు, ఇతర రిక్వెస్టు బదిలీలను పరిగణనలోకి తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ పేరుతో అందరితో బలవంతంగా రిక్వెస్టులు పెట్టిస్తూ, ఈ వ్యవహారం వెనుక మామూళ్లపర్వానికి తెరలేపారు. రిక్వెస్టులు పెట్టాలంటూ కృష్ణాజిల్లా డీపీవో కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శులకు పెద్ద ఎత్తున ఫోన్లు వస్తుండటం గమనార్హం.



డీపీవో కార్యాలయ సిబ్బంది ఓవరాక్షన్

ఎమ్మెల్యేలు గంపగుత్తగా బదిలీలు చేయమన్నారన్న పేరుతో డీపీవో కార్యాలయ సిబ్బంది ఓవరాక్షన్ చేస్తున్నారు. ఈ బదిలీల విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా మొండిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి అంటకాగి పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగిన వారెవరూ తమ నియోజకవర్గాల్లో కనిపించకూడదని, మూకుమ్మడి బదిలీలు చేయాలని జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నారు.

మహిళా కార్యదర్శులకు వెసులుబాట్లు లేవా..?

ఉమ్మడి జిల్లా పంచాయతీ కార్యదర్శుల్లో కొంతమంది మహిళలు ఉన్నారు. వీరిలో కొంతమందికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. మరికొందరి భర్తలు దూర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరి పిల్లలు స్థానికంగా స్కూళ్లలో చదువుకుంటున్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమైంది. రెండు నెలలు కూడా గడిచిపోయింది. ఇప్పటికిప్పుడు బదిలీలు అంటే పిల్లల్ని మరోచోట పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. పోనీ.. స్థానిక మండలం పరిధిలోని గ్రామాలకు బదిలీ చేస్తే, స్కూళ్లకు మార్చే అవకాశం ఉండదు. నియోజకవర్గంలోనే పనిచేయకూడదంటే.. మహిళా పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే, ప్రభుత్వం బదిలీల విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తి చేసుకుని ఉంటే, అలాంటి వారిని బదిలీ చేయాల్సి ఉంది. కానీ, ఐదేళ్లు పూర్తి చేసుకోకపోయినా కదిలించాలనుకోవటం గమనార్హం. మహిళా ఉద్యోగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వారెక్కడికి కోరుకుంటున్నారో అక్కడ పోస్టింగ్ ఇప్పించాల్సి ఉండగా, బలవంతపు రిక్వెస్టుల పేరుతో ఎడాపెడా బదిలీలకు నిర్దేశించటం గమనార్హం. అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి అందిన జాబితాల ప్రకారం బదిలీలు చేసేందుకు డీపీవో కార్యాలయాలు సిద్ధమవుతున్నాయి. సందట్లో సడేమియాగా డీపీవో కార్యాలయ సిబ్బంది కూడా నచ్చినచోట పోస్టింగ్‌లు ఇప్పిస్తామంటూ రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం కృష్ణాజిల్లా డీపీవో కార్యాలయ పరిధిలో ఎక్కువగా జరుగుతోంది. ఇప్పటికే పలువురితో ప్యాకేజీలు కుదుర్చుకున్నట్టుగా తెలుస్తోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా జరుగుతున్న బదిలీలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యానికి చేటు

- న్యాయవాదుల ధర్నాలో వక్తలు

6లో..

ప్రాణాలుపోతున్నా పట్టించుకోరా!

కిడ్నీ వ్యాధి శాశ్వత పరిష్కారానికి పోరాటాలే మార్గం

- నానాటికీ పెరుగుతున్న మృతులు
- సీపీఎం నేత బాబూరావు ఆవేదన
- ఏ.కొండూరులో ధర్నా

6లో..

దుర్గమ్మ సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ శ్రీనరసింహకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మ సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, ఆగస్టు 24 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శనివారం ఖడ్గమాలార్చనలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించిన అనంతరం మల్లేశ్వరాలయంలో స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాలయాలను సందర్శించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ప్రోటోకాల్ మర్యాదలను అందజేశారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్ ప్రసాదం, శేషవస్త్రం, దుర్గమ్మ చిత్రపటం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ కమిషనర్



కనకదుర్గమ్మవారిని శనివారం దేవదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు విరాళం..



దేవస్థానంలో అన్నవితరణ కార్యక్రమానికి విశాఖపట్నం, సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎంవీ సింధూజ, ఎం.స్నిగ్ధలు శనివారం ఆలయానికి విచ్చేసి సంయుక్తంగా రూ.3,00,000లు విరాళాన్ని చెక్కు రూపంలో ఏఈవో రమేష్ ద్వారా దేవస్థానానికి అందజేశారు.

రేపు దుర్గగుడిలో కృష్ణాష్టమి వేడుకలు

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 26న కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఈవో రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానునికి పూజా కార్యక్రమం జరుగుతుందని, అదే సమయంలో శాస్త్రోక్త విధానంలో గోపూజ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు దేవస్థాన పురాణ పండితులు కృష్ణాష్టమి విశిష్టత, శ్రీకృష్ణుడి అవతార విశేషాలను గురించి ఉపన్యాస కార్యక్రమం, సాయంత్రం 6.30 గంటలకు రాజగోపురం వద్ద ఖాళీ ప్రదేశంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



నియామక పత్రాలను అందజేస్తున్న నక్కా కృష్ణగౌడ్

గౌడ హక్కుల పరిరక్షణ సమితి ప్రచార కార్యదర్శిగా బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్

వన్‌టౌన్, ఆగస్టు 24 : గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ప్రచార ప్రధాన కార్యదర్శిగా కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సమితి కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు నక్కా కృష్ణగౌడ్ పలు పదవులకు నియామక పత్రాలు అందజేశారు. బొల్లా వెంకటేశ్వరరావు జాతీయ ప్రచార ప్రధాన కార్యదర్శి, జాతీయ ప్రధాన కార్యదర్శిగా నక్కా మహేంద్ర గౌడ్, ఏపీ వర్కింగ్ ప్రెసిండెంట్‌గా చిట్టిబొమ్మ వంశీకృష్ణ గౌడ్ (విజయవాడ అశోక్‌నగర్), కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా బెజవాడ నాగేశ్వరరావు గౌడ్ (మానికొండ), కృష్ణాజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లి రామారావు గౌడ్ (గొల్లనపల్లి)లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున గౌడ కులస్తులకు సహాయం అందేవిధంగా కృషి చేస్తానన్నారు. టీడీపీ బీసీల పార్టీ అన్నారు. సీఎం చంద్రబాబు బీసీలను ఆదుకోవటంలో ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కృష్ణగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

» సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని కమిషనర్ రాజశేఖరబాబు అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి ఎంపిక చేసిన సైబర్ కమాండోలు సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిస్థాయిలో పట్టును సాధించాలని అభిప్రాయపడ్డారు. ఎంజీ రోడ్డులో ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైబర్ కమాండోలతో శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, ప్రజలు మోసపోతున్న విధానాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. వాటిని విశ్లేషిస్తూ సైబర్ సోల్జర్స్‌ను అవగాహన పెంచాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్స్, క్యూఆర్ కోడ్, పార్ట్‌టైం ఉద్యోగాలు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లింక్‌లు, ట్విట్టర్, టెలిగ్రాం లింక్, ఓఎల్‌ఎక్స్ మోసాలపై సమగ్రంగా వివరాలు తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాలు ఎప్పటికప్పుడు కొత్త తరహాలో జరుగుతున్న దానికి అనుగుణంగా నైపుణ్య సామర్థ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, కంట్రోల్ రూంను పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా నగరంలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తూ రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు టి.హరికృష్ణ, గౌతమీ షాలి, ఉదయరాణి, సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ గుణరాము, పి.శ్రీను, వాసిరెడ్డి శ్రీనివాస్, హనీష్ తదితరులు పాల్గొన్నారు.



సీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

కారుణ్య నియామకాలు చేపట్టాలి

» సీఈవోకు యూటీఎఫ్ నేతల వినతి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 : మృతిచెందిన ఉద్యోగుల కుటుంబసభ్యులను కారుణ్య నియామకాలు చేపట్టాలని జడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆర్వీ ఆనందకుమార్‌కు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నాయకులు ఎ.సుందరయ్య, జె.లెనిన్‌బాబు, కేఏ ఉమామహేశ్వరరావు, ఎన్.కృష్ణయ్య, సంజీవరెడ్డి, ముత్తయ్య నరసింహారావు, ముక్తేశ్వరరావులు వినతిపత్రం సమర్పించారు. విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ పాఠశాలల్లోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. చాలాకాలంగా పదోన్నతులు లేకపోయినా సెకండరీ గ్రేడ్ టీచర్లు హైస్కూళ్లలో పనిచేస్తున్నారన్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో అర్హత గల ఎస్జీటీలు, భాషా పండితులకు కామన్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పిస్తున్నట్టు, అదే విధంగా మచిలీపట్నం, గుడివాడ పరిధిలోని అర్హత గల సెకండరీ గ్రేడ్, భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యానికి చేటు

» న్యాయవాదుల ధర్నాలో వక్తలు



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

విజయవాడ లీగల్, ఆగస్టు 24 : ప్రజాస్వామ్య హక్కులను హరించే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి వచ్చిన న్యాయవాదులు, ప్రజాసంఘాల, పౌరహక్కుల, మహిళా సంఘాల నేతలు విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కాలం చెల్లిన వలస పాలకుల చట్టాలను రద్దుచేస్తూ.. నూతన చట్టాలను తీసుకొచ్చామని కేంద్రప్రభుత్వం ప్రగల్బాలు పలుకుతోందని, కానీ నూతన చట్టాలలో పాతచట్టాలనే 90 నుంచి 95 శాతం వరకు మక్కీకి మక్కీగా కొత్తచట్టాలలో చేర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాల పేర్లు, సెక్షన్లు, చాప్టర్లు మార్చారని, చేసిన కొద్దిపాటి మార్పులు రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిగా వున్నాయన్నారు. 'ఉపా యాక్టు, కోకా యాక్టు, టెర్రరిస్టు యాక్ట్, దేశద్రోహం' పేరుతో నూతన సెక్షన్లను బీఎన్‌ఎస్‌లో చేర్చారని, దీనివలన పోలీసు అధికారులకు విశృంఖలమైన అధికారాలు సంక్రమించాయని, తద్వారా పోలీసులు యథేచ్ఛగా ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తారని చెప్పారు. ఏఐఎల్‌యూ జాతీయ ప్రధాన కార్యదర్శి పీవీ సురేంద్రనాథ్ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో ఏమాత్రం చర్చలేకుండా ఈ చట్టాలను తీసుకొచ్చారని, బ్రిటీష్ వలసపాలకులు కూడా చేయని దుర్మార్గమైన చట్టాలను చేశారన్నారు. ఏఐఎల్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఈ నూతన చట్టాలను రద్దు చేసేవరకు పోరాటం చేయాల్సిన అవసరం వుందని, న్యాయవాదులు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం వుందని అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ, నూతన చట్టాల వలన ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదని, ప్రజల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ ఉద్యమాన్ని తాము బలపరుస్తున్నామన్నారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు (వై.కే) మాట్లాడుతూ, హక్కులను రద్దుచేయడం వలన ప్రజలు, పోలీసులపైన ప్రభుత్వ అధికారులపైన ఏ విధమైన చర్యలు తీసుకోలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈ చట్టాలు పౌరహక్కులకు భంగం కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.గురునాథం మాట్లాడుతూ, పోలీసులు అరెస్టు చేసి సంకెళ్లు వేయడం ఆటవిక సంప్రదాయమని, గతంలో సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో దానిని వ్యతిరేకించిందని, అది రాజ్యాంగ విరుద్ధమని కూడా చెప్పిందన్నారు. నూతన చట్టాలలో ఆ హక్కు పోలీసులకు కల్పించారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ మాట్లాడుతూ, ఢిల్లీలో రైతులు చేసిన పోరాట పటిమతో ఉద్యమం చేసి విజయం సాధించాలని, దానికి సీపీఎం మద్దతు వుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎల్‌యూ, ఐఏఎల్, కాంగ్రెస్ లీగల్‌సెల్, ఏపీసీఎల్‌ఏ, సీఎల్‌సీ, ఐఏపీఎల్, ఓపీడీఆర్, మహిళా సంఘాలు, పౌరహక్కులు, ప్రజా సంఘాలు, హైకోర్టు న్యాయవాదులు, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్‌కు చెందిన వడ్డే శోభనాద్రీశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్, మట్టా జయకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

చంద్రబాబుపై నమ్మకంతోనే.. కూటమికి పట్టం కట్టారు

» అమరావతిని సత్వరం అభివృద్ధి చేయాలి

» మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 24 : గాడి తప్పిన రాష్ట్రాభివృద్ధిని తిరిగి గాడిలో పెడతారనే నమ్మకంతో జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడిన రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. అమరావతిని త్వరితగతిన అభివృద్ధి చేయాలన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ప్రజల సత్వర సమగ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొన్ని నిర్మాణాత్మక సూచనలతో బహిరంగ లేఖ రాసినట్టు చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు సీఆర్డీఏతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం మూడేళ్లలో రైతులకు కేటాయించిన నివాస, వాణిజ్య ప్లాట్ల లేఅవుట్లను రహదారులు, డ్రైన్లు తదితర మౌలిక వసతులతో సహా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా ఎంతో కీలకమని ప్రత్యేక హోదా సాధనకు చంద్రబాబు కృషి చేయాలన్నారు. తుగ్లక్ జగన్ విద్యుత్ మీటర్లకు అమర్చిన స్మార్ట్ మీటర్లను తక్షణమే తీసివేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును పరిరక్షించాలన్నారు. పోరాడి కార్మికులు సాధించుకున్న 42 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రంలో చర్చించి ఉపసంహరించుకునేలా చేయాలన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా!

» కిడ్నీ వ్యాధి శాశ్వత పరిష్కారానికి పోరాటలే మార్గం

» సీపీఎం నేత బాబూరావు





బండిపై వచ్చిన బాధితుడు   ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కిడ్నీ బాధితులు

ఎ.కొండూరు, ఆగస్టు 24 : ఎ.కొండూరు మరో ఉద్దానంగా మారకముందే ప్రభుత్వం కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కిడ్నీ బాధితులతో కలిసి ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో గత పదేళ్లలో కిడ్నీ వ్యాధితో వెయ్యిమంది మృతి చెందారని, ఇప్పటికి రెండు వేలమంది వ్యాధితో, 110 మంది డయాసిస్ చేయించుకుంటున్నారన్నారు. ఎ.కొండూరు మండలంలో ఈ సంవత్సరం 63 మృతి చెందినట్టు తెలిపారు. ఈ మరణాలకు ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. పార్టీలు మట్టి మాఫియాలపై సవాళ్లు, చర్చలు కాదు, నియోజకవర్గంలో కిడ్నీవ్యాధి, మరణాలపై చర్చకు రావాలని కోరారు. వ్యాధి శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశం, అధ్యయన బృందాన్ని ఏర్పటుచేయాలని డిమాండ్ చేశారు. మండలంలో మంచినీరు లేకపోయినా 100కి పైగా బెల్టుషాప్‌లు, నాటు సారా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 50 కోట్లతో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, ప్రతి గ్రామానికి కృష్ణా జలాలు, తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సమస్య అధ్యయనం కోసం ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని, డయాలసిస్ రోగులకు రూ. 20 వేలు, వ్యాధిగ్రస్తులకు ఐదు వేలు పింఛన్, మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా, ఎకరా భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బి.ఆశయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పీవీ ఆంజనేయులు, శ్రీనివాసరావు, కళ్యాణ్, నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వరావు, ఆనందరావు, సీతా రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల వ్యథ పాలకులకు పట్టదా? : సీపీఐ



ధర్నాచౌక్ : ప్రాణాలు కోల్పోతున్న కిడ్నీ బాధితుల వ్యథలు పాలకులకు పట్టడం లేదని, కూతవేటు దూరంలో కృష్ణా జలాలు ఉన్నా సరఫరా చేసే నాథుడే లేడని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ధ్వజమెత్తారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర' పోస్టర్‌ను స్థానిక దాసరిభవన్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు, గంపలగూడెం మండలాలు కిడ్నీ బాధితుల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 కోట్లతో కృష్ణాజలాలను సరఫరా చేస్తామన్నా ప్రభుత్వ చర్యలు ముందుకు సాగడం లేదని విమర్శించారు. ఎ.కొండూరు నుంచి విజయవాడ లెనిన్ సెంటర్ వరకు కొనసాగే పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 29న లెనిన్ సెంటర్‌లో సాయంత్రం ముగింపు సభ జరుగుతుందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు సభలో ప్రసంగిస్తారన్నారు.

వికసిత్ ఏపీ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047కు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో శనివారం జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వ సూచనల మేరకు వికసిత్ ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనల్లో భాగంగా జిల్లాకు సంబంధించిన అంశాలను జోడిస్తూ నివేదికను తయారు చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో రూ.78వేలకోట్ల ఉత్పత్తులు జరుగుతున్నాయని, ఈ మొత్తాన్ని 15శాతానికి పెంచి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలో వివిధ ఉత్పత్తులు, వాటి ధరలు పెంచేలా వినూత్నంగా ఆలోచన చేసి నివేదికను తయారు చేయాలన్నారు. అధికారులతో పాటు, రైతులు, ప్రజా ప్రతినిధులు, చేనేత సహకారసంఘాలు, మత్స్యసహకార సంఘాల ప్రతినిధులను నివేదిక తయారీలో భాగస్వాములను చేసి వారినుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, ఆక్వారంగం ఉత్పత్తులలో నాణ్యతను, ధరలను పెంచడానికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయో గుర్తించాలన్నారు. పంట భూములను ఖాళీగా ఉంచకుండా, ఏడాదంతా సాగు చేసేలా, అంతర పంటలు సాగుచేసేలా రైతులను ప్రోత్సాహించి వారి ఆదాయం పెరిగే మార్గాలను నివేదికలో పొందుపరచాలన్నారు. మండలస్థాయిలో ఆర్థికపరమైన కార్యకలాపాలు ఏయే అంశాల్లో అధికంగా జరుగుతున్నాయో గుర్తించి, ఆ విభాగాల్లో ఆదాయమార్గాలను మరింతగా పెంచేందుకు నివేదికను తయారు చేయియాలన్నారు. కొందరు రైతులు వినూత్నంగా పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధిస్తుంటారని, అలాంటి విషయాలను వెలుగులోకి తెచ్చి, ఇతర రైతులు కూడా ఈ పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా ప్రోత్సాహం అందించాలని అన్నారు. తానుకూడా ప్రతి నియోజకవర్గంలో పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి నివేదికను పక్కాగా తయారుచేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, బీసీ తదితర కార్పొరేషన్‌లద్వారా పేదప్రజలకు ఆర్థికభరోసా కల్పించి జీవనోపాధిని మెరుగుపరిచే దిశగాను నివేదిక ఉండాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, సీపీవో గణేష్, డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరనాయక్, జిల్లాపరిశ్రమల అధికారి వెంకట్రావ్, ఏపీఐఐసీ జెడ్‌ఎం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమవారం 'మీకోసం' రద్దు

26న కృష్ణాష్టమి ప్రభుత్వసెలవురోజుగా ప్రకటించడంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



బాస్కెట్ బాల్ విజేతలతో వి.నారాయణరావు

బాస్కెట్ బాల్ ద్వితీయ విజేత కేబీఎన్

వన్‌టౌన్, ఆగస్టు 24 : విజయవాడ మేరీ స్టెల్లా కాలేజీలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ పోటీలలో కేబీఎన్ కళాశాల క్రీడాకారులు ద్వితీయ విజేతగా నిలిచారు. శనివారం క్రీడాకారులకు కళాశాల చాంబర్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్ కమిటీ విద్యా సంస్థల పరిపాలనాధికారి వి.నారాయణరావు మాట్లాడుతూ, బాస్కెట్ బాల్ పోటీలలో ఫైనల్స్ వర్షం కారణంగా మధ్యలో ఆగిపోయాయన్నారు. టాస్ ద్వారా తమ కాలేజీ టీమ్‌కు ద్వితీయ స్థానం లభించిందన్నారు. క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావు, క్రీడాకారులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కృష్ణలంక : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ, ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేయడం జరిగిందని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జెన్పాక్ట్‌లో ఉద్యోగావకాశాలు

మచిలీపట్నం టౌన్ : జెన్పాక్ట్ కంపెనీలో ఉద్యోగావకాశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబులు తెలిపారు. జెన్పాక్ట్ కంపెనీలో 1500 ఖాళీలు భర్తీచేస్తున్నారని, డిగ్రీ, బిటెక్ పాసైన అభ్యర్థులు ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9988853335లో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులు

ఉయ్యూరు : మారిన సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని గుడివాడ డీవైఈవో ఎం.పద్మారాణి అన్నారు. పదవ తరగతి పాఠ్యపుస్తకాలు మారిన నేపథ్యంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు సంబంధించిన జిల్లాపరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలకు చెందిన జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఒకరోజు పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. మారిన పాఠ్యపుస్తకానికి ఏవిధానంలో బోధించాలి, ఎలాంటి కృత్యాలు నిర్వహించాలన్న వాటితో పాటు పదవ తరగతి పరీక్ష మోడల్‌పేపర్‌కు అనుగుణంగా ఏవిధంగా శిక్షణ ఇవ్వాలన్న అంశాలను రిసోర్స్‌పర్సన్‌లు సవివరంగా తెలియజేశారు.

యథేచ్ఛగా మట్టి దోపిడీ!

నందిగామ : మైనింగ్, రెవెన్యూ శాఖల అవినీతి, అలసత్వంతో యథేచ్ఛగా మట్టి దోపిడీ జరుగుతోంది. అధికారుల తీరుతో కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పడుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నందిగామ సమీపంలోని రాఘవాపురం కొండను తవ్వి గుత్తేదారులు కోట్లాది రూపాయల విలువైన మట్టిని కొల్లగొడుతూ లబ్ధి పొందుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మట్టి దోపిడీకి అలవాటు పడిన అక్రమార్కులు దానిని కొనసాగించడం విస్మయానికి గురిచేస్తున్నది. నందిగామ వై జంక్షన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులకు రాఘవాపురం కొండ నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్నట్టు సీపీఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయానికి అతి సమీపంలో పెద్దఎత్తున మట్టి దోపిడీ జరుగుతున్నా పట్టనట్టు రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. నందిగామలో మైనింగ్ కార్యాలయాన్ని విజయవాడకు మార్చటంతో ఫిర్యాదు చేయాలన్నా అధికారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. మైనింగ్, రెవెన్యూలో కొందరు అవినీతి అధికారుల సహకారంతో ఎటువంటి అనుమతులూ లేకుండా మట్టి రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ మట్టి రవాణాపై సీపీఐ నాయకులు ఆందోళనలు చేస్తున్నా మట్టి దోపిడీ మాత్రం ఆగడం లేదు. హైవే అథారిటీ అధికారులైనా సదరు మట్టి ఎక్కడ నుంచి వస్తుందన్న విషయాన్ని స్పష్టం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి సహజ వనరుల దోపిడీని అరికట్టాల్సి ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బైపాస్ నిర్మాణంలో వినియోగిస్తున్న కొండ మట్టి

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75	

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

భవానీపురం, ఆగస్టు 24: వంటగ్యాస్ వినియోగంలో మహిళలు ఏమాత్రం ఏమరపాటుగా ఉండకుండా అప్రమత్తతో ఉంటేనే ప్రమాదాల జరగకుండా నివారించవచ్చని వంట గ్యాస్ సేఫ్టీ నిపుణుడు లక్ష్మణ్ కోరారు. భవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు ఆధ్వర్యంలో విద్యాధరపురం చెరువు సెంటర్ వద్ద వంట గ్యాస్ వినియోగంపై వినియోగదారులైన మహిళలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలెండర్ డెలివరీ కోసం ఇంటికి వచ్చినపుడు సిలెండర్లను సేఫ్టీ తనిఖీలను చేయించుకోవాలన్నారు. భద్రత విషయంలో ఎల్లప్పుడూ ఐఎస్ఏ గుర్తు కలిగిన సురక్ష రబ్బరునే వాడాలన్నారు.

డ్రెయినేజి సమస్య పరిష్కరిస్తా: గద్దె

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, ఆగస్టు 24: నగరంలో ఎక్కడ చూసినా సైడ్ డ్రెయిన్స్ సమస్య, పూడిక సమస్య తీవ్రంగా ఉందని గత ప్రభుత్వ హయాంలో దీనిపై దృష్టి పెట్టకపోవడంతో వర్షం పడినపుడల్లా రోడ్లు మునిగిపోతున్నాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. శనివారం ఆయన 7వ డివిజన్‌లో స్థానిక నేతల పెనుగొండ శ్రీను, మాదల మల్లికార్జునరావు వెంటరాగా డ్రెయిన్స్‌ను పరిశీలించారు. చాలాచోట్ల డ్రెయిన్స్‌లో సిల్టు ఉండటం గమనించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేయిస్తానని చెప్పారు.



డ్రెయిన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఆర్థికసాయం అందజేస్తున్న గద్దె క్రాంతికుమార్

నిరుపేదలకు అండగా

గుణదల : కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న నిరుపేదలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నిత్యం అండగా నిలుస్తారని టీడీపీ యువ నేత గద్దె క్రాంతికుమార్ తెలిపారు. స్థానిక 5వ డివిజన్ క్రీస్తురాజపురం వద్దగల టీడీపీ కార్యాలయంలో పలువురికి గద్దె క్రాంతికుమార్ శనివారం ఆర్థికసాయం చేశారు. క్రీస్తురాజపురంలో నివాసం ఉంటున్న గంగాధర్‌కు తమ ఇద్దరి పిల్లల ఫీజుల నిమిత్తం రూ.30 వేలు అందించడం జరిగిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మరో కార్యకర్త మోజెస్‌కు వైద్య ఖర్చులకు రూ.10వేలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన సొంత నిధుల నుంచి ఈ ఆర్థికసాయం చేశారన్నారు. 8వ డివిజన్ గాయత్రి నగర్‌కు చెందిన చిగురాపాటి రాధాకృష్ణ కుమారికి ప్రమాదవశాత్తు చేయి విరగటంతో ఆమెకు వైద్యఖర్చులకు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, జాస్తి లక్ష్మీపతి, కొత్తపల్లి రమేష్, రామారావు, నవీన్, మీసాల రాజు, దోమకొండ రవి, సిద్దెల వివేక్, రాచమళ్ల ఆంజనేయులు, షేక్ హాసిఫ్, దండమూడి సన్నిధి పాల్గొన్నారు.

కేరళ బాధితులకు నేతాజీ హైస్కూల్ ఆర్థికసాయం



ఆర్థికసాయం చెక్కును ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు అందజేస్తున్న విద్యార్థులు

విద్యాధరపురం, ఆగస్టు 24: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు భవానీపురం నేతాజీ హైస్కూల్ విద్యార్థులు, యాజమాన్యం కలిసి రూ.85,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ కె.అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ద్వారా శనివారం స్కూల్ డైరెక్టర్లు తిరుపతి రెడ్డి, కె.దినేష్, కె.రాజేష్, శిరీష, లావణ్య, విద్యార్థులు కలిసి చెక్కును అందచేశారన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా స్పందించి విరాళాలు సేకరించారన్నారు.

నర్తనబాల పోటీల విజేతకు అభినందన



లాస్యను అభినందిస్తున్న దిలీప్‌కుమార్, శేషుబాబు

గవర్నర్‌పేట, ఆగస్టు 24: అభినయ నృత్య భారతి (ఏలూరు) సంస్థ నిర్వహించిన నర్తన బాల-2024 పోటీల్లో అవార్డును దక్కించుకున్న మాచవరం వాణీ ఇంగ్లీషు మీడియం 9వ తరగతి విద్యార్థిని వై.లాస్యకు శనివారం స్కూల్ ప్రాంగణంలో అభినందన సభ జరిగింది. నిత్యాన్నదాన సంతర్పణ సమితి అధ్యక్షుడు గుండపు దిలీప్‌కుమార్, స్కూల్ కరస్పాండెంట్ ఏ శేషుబాబు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఏ ఝాన్సీ లక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి నాయుడుకు..

ఎన్టీఆర్ కమిషనరేట్‌లో క్రైమ్ ఏడీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎం. కృష్ణమూర్తి నాయుడుకు అదనపు ఎస్పీ నుంచి నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి వచ్చిన సందర్భంగా మహంతి అప్పల నరసయ్య, మహాలక్ష్మీ (ఎంఏఎం) ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు (వాసు) శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు నడిమిటి రమణ, పిన్నంటి అప్పలనాయుడు, మహంతి దాలినాయుడు, లంకా జగదీష్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వన్‌టౌన్, ఆగస్టు 24: జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 4 వరకు స్వీయ మదింపు నమూన పేపర్ - 1, పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5 తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు, 9, 10 తరగతి విద్యార్థులకు 11 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారులు, జిల్లా డీసీఈవీ సెక్రటరీ, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎలాంటి సమస్యలు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

గవర్నర్‌పేట, ఆగస్టు 24: సూర్యారావుపేట డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఈనెల 25న ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల స్టేట్ గెస్ట్‌హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశం రోడ్డు, డోర్నకల్ రోడ్డు, నరసింహారావునాయుడు వీధి, కాశేశ్వరరావు రోడ్డు, గోవిందరాజులనాయుడు వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, దాసరి వారి వీధి, వేమూరి వారి వీధి, డాక్టర్ ఎన్ సుబ్బారావు వీధి, జగడం వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఎలక్ట్రానిక్ కాటాల స్టాంపింగ్‌కు సర్వీస్ క్యాంపులు

మొగల్రాజపురం, ఆగస్టు 24: జిల్లావ్యాప్తంగా ఉన్న చౌకధరల దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలను ఎలాంటి రిపేర్లు లేకుండా పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకున్న తరువాత మాత్రమే స్టాంపింగ్ చేయించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌బాబు జిల్లా తూనికల కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్‌కు లేఖ రాశారు. శనివారం జిల్లా చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, వర్కింగ్ అధ్యక్షుడు జె. శ్రీనివాసరావు జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం ఇచ్చారు. స్టాంపింగ్ ప్రక్రియలో రేషన్ షాపులో కాటాలను స్టాంపింగ్ చేయడానికి వచ్చే ప్రైవేటు ఏజెన్సీల వల్ల డీలర్లు అధికంగా రూ.600 చెల్లించాల్సి వస్తోందని గతంలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రేషన్ షాపుల్లో కాటాలను సరఫరా చేసిన సంస్థ నిపుణులతో సర్వీస్ చేసిన అనంతరం ప్రభుత్వానికి రూ.300 ఫీజుతో స్టాంపింగ్ చేయించాలని గతేడాది కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల గురించి తెలిపారు. తూనికల కొలతల జిల్లా శాఖకు, తహసీల్దార్లకు, ఏఎస్‌వోలకు, డిప్యూటీ తహసీల్దార్లకు, విజన్‌టెక్ సంస్థ సంయుక్తంగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.



జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్ల సంఘ నాయకులు

తాగునీటి కుళాయి సర్వే పరిశీలన

గవర్నర్‌పేట, ఆగస్టు 24: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జరుగుతున్న ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సర్వేను వీఎంసీ కమిషనర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 23వ వార్డు అడ్మిన్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీలు చేస్తున్న ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సర్వేను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి అసెస్మెంట్‌కు తప్పులు లేకుండా అసైన్లలో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. కమిషనర్ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ జి.సృజన (రెవెన్యూ), డీఈ రామకృష్ణ (వాటర్ సప్లయ్), అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇనస్పెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ నర్మద, సచివాలయ సెక్రటరీ పాల్గొన్నారు.



కుళాయి సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్

ఎంబీఏ విద్యార్థులకు బిజినెస్ క్విజ్

వన్‌టౌన్, ఆగస్టు 24: ఎంబీఏ విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించేందుకు, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు బిజినెస్ క్విజ్ ఒక మంచి వేదిక అని అపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఎంబీఏ విద్యార్థులకు నిర్వహించిన ప్రశ్నావళి బిజినెస్ క్విజ్‌ను ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మరో అతిథి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్కే వైద్యనాథన్, కళాశాల అధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పతంజలి శాస్త్రి, డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ విజయదుర్గాప్రసాద్, ఎంబీఏ అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టా అమర సుధీర్, జాయింట్ సెక్రటరీ గ్రంధి పవన్ కుమార్, కోశాధికారి కాజ రాఘవయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ



రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్ద ట్రాఫిక్ అవగాహన ర్యాలీలో విద్యార్థులు

భారతీనగర్, ఆగస్టు 24 : వాహనదారులకు రోడ్డు భద్రతను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా లయోలా కళాశాల ఎన్‌సీసీ విభాగం, రాబిన్‌హుడ్ ఆర్మీ ఆధ్వర్యంలో శనివారం రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్ద ట్రాఫిక్ అవగాహన సదస్సు జరిగింది. కళాశాల విద్యార్థులు పాల్గొని వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడంపై అవగాహన కల్పించారు. రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధులు రత్నశ్రీ, లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్ ఎ.శామ్యూల్ దయాకర్, ఆర్.జాన్ పాల్గొన్నారు.

పీసీబీ డిజైన్‌పై ముగిసిన శిక్షణ

ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాలపాటు బీటెక్ 2వ ఏడాది విద్యార్థులకు పీసీబీ డిజైన్‌పై ఏపీఎస్ఎస్‌డీసీ, ఐఈటీఈ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వీఎల్ఎస్‌టీ రీసెర్చ్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులు నేటితో ముగిశాయి. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇస్కాన్‌లో కృష్ణాష్టమి వేడుకలు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 24 : ఆగస్టు 25 నుంచి 27 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ తెలిపారు. రామలింగేశ్వరనగర్ సమీపంలోని స్వాన్ సిటీ సెంటర్‌లోని జగన్నాథ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాలను ఆగస్టు 25, 26న స్క్రూబ్రిడ్జి సమీపంలోని ఇస్కాన్ సిటీ సెంటర్ శ్రీశ్రీ జగన్నాథ్ మందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు 26, 27న ఉండవల్లి, అమరావతి కరకట్ట రోడ్డు వద్ద వున్న శ్రీశ్రీ రాధా శ్యాంసుందర్ మందిరంలోను ఉత్సవాలు జరుగుతాయన్నారు. 25న శ్రీశ్రీ జగన్నాథ్ మందిరంలో 2వేల కిలోల పుష్పాలతో మహా పుష్పాభిషేకం, పంచామృతాలతో కలశాభిషేకంతో పాటు జిల్లాస్థాయిలో ఉట్టి మహోత్సవం జరుగుతుందన్నారు. 26న స్వామికి మహాశంఖాభిషేకం, ప్రత్యేకమైన కీర్తనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏడాది లోపు పిల్లలకు లిటిల్ కృష్ణ వేషధారణ పోటీలు, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26న మహా శంఖాభిషేకం, ఉట్టి మహోత్సవం, ప్రత్యేకమైన కీర్తనలు, మహా హారతులు, 27న ఉదయం 9 గంటల నుంచి నందోత్సవం, ఇస్కాన్ సంస్థాపకచార్యులు శ్రీల భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల 128వ జన్మోత్సవం జరుగుతాయన్నారు. మందిర అధ్యక్షుడు చక్రధారి దాస్, వ్రజదాందాస్, బలరాం గోవింద దాస్, శ్యామసుందరి అచ్యుత దాస్, శ్రీకాంత్ నరసింహ దాస్, హెచ్.జి.చక్రధారి దాస్ పాల్గొన్నారు.



కృష్ణాష్టమి వేడుకల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ సభ్యులు

నలంద విద్యానికేతన్‌లో సందడి

గవర్నర్‌పేట: స్థానిక నలంద విద్యానికేతన్‌లో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రాంగణమంతా చిన్ని కృష్ణులు, గోపికలతో సందడిగా మారింది. చిన్ని తమ్ముళ్లు, చెల్లెళ్లు, యశోద కృష్ణ (మదర్ అండ్ చైల్డ్), ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్స్, తోడ్లర్స్, ఎల్‌కేజీ, యూకేజీ, 1, 2 తరగతుల చిన్నారులకు నటకట కృష్ణ-గోర్జియస్ గోపిక ఫ్యాన్స్ డ్రస్ పోటీలు నిర్వహించారు. చిన్నారులు భక్తిగీతాలు, భగవద్గీత శ్లోకాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ఇస్కాన్ నుంచి వినయ్, సీతాకుమారి, రోజా పాల్గొన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పర్యవేక్షించారు. స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ ఉషారాణి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నలంద విద్యానికేతన్‌లో..

లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో..

మొగల్రాజపురం: పుట్టుక నుంచే శ్రీకృష్ణుడు అనేక విపత్కర పరిస్థితులను ఎదుర్కొని దీటుగా నిలబడ్డాడని ఆయన జీవితం నేటితరానికి ఆదర్శనీయమని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి చెప్పారు. స్థానిక లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు బాల్యం నుంచే శ్రీకృష్ణుడు, శ్రీ రాముడు, భారతం, రామాయణం వంటి వాటి గురించి చెప్పాలని వాటిలో విలువలను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. అనంతరం పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో నృత్యాలు ప్రదర్శించారు. తరువాత ఉట్టి కొట్టాట నిర్వహించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత: విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.

రాత పరీక్ష: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్: రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZbiB0SEలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా విగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

పీహెచ్‌డీ



జేఎన్‌టీయూ అనంతపురంలో..

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజెంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

కర్నూలు ఐఐఐటీడీఎంలో..

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యే వారికి రూ.లక్షన్నర ఇస్తారు.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** iiitk.ac.in/


నవ్య | చిత్రజ్యోతి

నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి

● అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

పవన్ కల్యాణ్, నాగబాబు, అల్లు అర్జున్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో మెగా ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయంటూ కొన్నాళ్లుగా మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఇప్పటి దాకా మెగా, అల్లు కుటుంబాల నుంచి ఎవరూ నేరుగా పెదవి విప్పింది లేదు. కానీ ఇప్పుడు తొలిసారి అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయంపై స్పందించారు. ఓ మీడియా ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు హీరోలు స్మగ్లర్ల వేషాలు వేస్తున్నారు' అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, 'స్నేహితుల కోసం ఎక్కడిదాకా అయినా వస్తాను' అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

● కల్యాణ్ గారు ఏ సందర్భంలో అలా మాట్లాడారో తెలియదు. ఆయన మాటవరసకు అలా అని ఉంటారు అని నేను అనుకుంటున్నాను. కానీ ప్రజల్లోకి తప్పుడు సందేశం పోతోంది. తర్వాతైనా ఆయన 'నా ఉద్దేశం ఇది' అని చెబితే బాగుండేది. ఆయనే స్వయంగా పూనుకొని సరిదిద్దితే బాగుండేదని నా అభిప్రాయం.



● ఎన్టీఆర్ నటుడిగా రావణుడు, దుర్యోధనుడి పాత్రలు పోషించారు. అంటే దానర్థం మొత్తం స్త్రీ జాతిని ఆయన కించపరిచాడని కాదు కదా. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. పవన్ కల్యాణ్ కూడా నటుడిగా ఉండి రాజకీయ నాయకుడయ్యారు. సినిమా యాక్టర్‌ను యాక్టర్‌గానే చూడాలి. వారి వ్యక్తిత్వాలకు ఆ పాత్రల స్వభావాన్ని అంటగట్టే ప్రయత్నం చేయకూడదు. అల్లు అర్జున్ నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి.

● అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ వచ్చింది. 69 ఏళ్లలో ఎవరికీ రాని అవార్డ్ ఆయన్ను వరించింది. ఆయన మిత్రపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఎన్డీయే ప్రభుత్వమే అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డ్ ఇచ్చింది. అది పవన్ కల్యాణ్‌కు తెలియదా? మంచీ చెడూ చూడకుండానే భారత ప్రభుత్వం ఆ పురస్కారాన్ని ఇవ్వలేదు కదా?. ఆయన అభిమానులేమో అల్లు అర్జున్‌నే అన్నాడు అని అనుకుంటున్నారు. ఇప్పుడు ఈ వివాదానికి శుభంకార్డు పడాలంటే 'ఇది నేను జనరల్‌గా అన్నాను' అని పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేయాలి. లేదంటే ఆయన భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లే. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తున్నట్లుగానే భావించాలి. చిరంజీవి గారు పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ఈ వివాదానికి ముగింపు పలకాలి.



తప్పకరావాలి!

కమర్షియల్ తెలుగు సినిమాకు ఒక ఊపుని తెచ్చి, బాక్సాఫీసు దగ్గర సునామీ సృష్టించిన హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ. వయసుతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు. ఎన్నోసార్లు బాక్సాఫీసు దగ్గర వీరిరువురి చిత్రాలూ పోటీ పడినప్పటికీ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, ఒకరి మీద మరొకరు ప్రత్యేక అభిమానం కురిపిస్తూ మంచి స్నేహితులుగా మెలుగుతుంటారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం ఈ ఇద్దరి హీరోలలోనూ లేదు. వృత్తిపరమైన పోటీని సినిమాలకే పరిమితం చేసి నిజజీవితంలో ఎంతో ఎమోషనల్ బాండింగ్ కలిగి ఉంటారు చిరంజీవి, బాలకృష్ణ. గురువారం రాత్రి జరిగిన గీత రచయిత రామజోగయ్యశాస్త్రి ఇంట జరిగిన వివాహ వేడుకలో ఈ అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. ఈ వేడుకకు చిరంజీవి, బాలకృష్ణ హాజరయ్యారు. చిరంజీవి ఎదురు పడగానే 'బ్రదర్.. ఎలా ఉన్నారు?' అని ఆప్యాయంగా పలకరించారు బాలకృష్ణ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత సెప్టెంబర్ ఒకటిన జరిగే తన సన్మాన కార్యక్రమానికి తప్పకుండా రావాలని చిరంజీవిని ఆహ్వానించారు. వస్తానని చిరంజీవి చెప్పారు. అలాగే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం గురించి కూడా వీరిద్దరి మధ్య సంభాషణ జరిగిందని సమాచారం.

కాలం కలిసొస్తే నడిచొచ్చే సినిమా



నాని హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న విడుదల కానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి చాలా చెప్పేశాను. దర్శకుడు వివేక్ ఇందులో శివ తాండవం చూపించాడు. అతని కెరీర్‌కి ఈ సినిమా ఓ మైల్‌స్టోన్. మా కష్టాన్ని చూసి మీరు ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నా. కాలం కలసి వస్తే నడిచి వచ్చే సినిమా వస్తుందంటారు. అటువంటి సినిమానే 'సరిపోదా శనివారం' అన్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'మా దర్శకుల కుటుంబం అంతా ఈ వేడుకకి వచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ సినిమా 29న విడుదల చేయడానికి దర్శకుల టీమ్ కూడా ఓ కారణం. నాని నా మీద ఉంచిన నమ్మకానికి 'సరిపోదా శనివారం' ఇచ్చా' అన్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. కథ నచ్చితే కొత్త దర్శకుడైనా అవకాశం ఇస్తారు. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు ఏ టెన్షన్ ఉండదు' అన్నారు నిర్మాత దానయ్య. ఒక రకమైన యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు వివేక్ విభిన్నంగా మలిచారని ఎస్.జె.సూర్య ప్రశంసించారు.

ఇన్ ప్రోగ్రెస్

టైటిల్ సాంగ్ వచ్చేసింది



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. సతీశ్ కుమార్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా టైటిల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీలో చాలా ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి" అని చెప్పారు.

మహిళలకు మాత్రమే



నూతన నటీనటులతో తెరకెక్కిన చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. దర్శకుడు నక్కిన త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథతో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాను మగవాళ్లు చూడకూడదు. మహిళలు మాత్రమే చూడాలి' అని అన్నారు. శ్రీనివాస్‌ఉలిశెట్టి, దియారాజ్, నిహారిక శాంతిప్రియ జంటగా నటించారు. సంగీతం: పవన్ సినిమాటోగ్రఫీ: సంతోష్.

పెద్ద హిట్టవ్వాలి



లక్షణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సీతారామ్ సిత్రాలు'. డి.నాగ శశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి.పార్థసారథి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

అందరూ ప్రశంసిస్తున్నారు



ఇటీవలే 'ఆయ్' సినిమాకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించారు అజయ్ అరసాడ. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను 'ఆయ్' చిత్రంలో సంగీతం అందించిన మూడు పాటలు అందరికీ విపరీతంగా నచ్చాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతానికి విశేషాదరణ లభిస్తోంది. ఎంతో మంది మంచి సంగీతం ఇచ్చావని ప్రశంసిస్తున్నారు. ఓ సంగీత దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం రెండు చిత్రాలకి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'బంపర్'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులోనూ రాబోతోంది. వెట్రి, శివాని నారాయణ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎమ్. సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ "ఓ లాటరీ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వినోదంతో పాటు బోలెడు థ్రిల్లింగ్ అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

సోషల్ మీడియా టు సినిమా

ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే చాలా తతంగం ఉండేది. ఫొటోల ఆల్బమ్ చేత్తో పట్టుకుని ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఫొటోలు నచ్చితే ఆడిషన్స్‌కు పిలుపు వచ్చేది. ఆడిషన్స్‌లో ఓకే అనిపించుకున్నా అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆర్టిస్టులను ఎంపిక చేసే విధానమూ మారింది. సోషల్‌మీడియాలో కొంత హల్‌చల్ చేస్తే చాలు సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లే వేదికగా తమ టాలెంట్ ప్రదర్శించి, సినిమాల్లోకి ఎంట్రీ సంపాదించిన నటీమణులు కొందరున్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో డ్యాన్స్ రీళ్లతో అదరగొడుతూ లక్షలాది మందిని ఆకర్షించారు ఇమాన్ ఇస్మాయెల్ (ఇమాన్వీ). రీల్స్ చేయడమే కాకుండా ఆమె ఓ షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించారు. యూట్యూబ్‌లో దాదాపు రెండు మిలియన్ల సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాలో దాదాపు తొమ్మిది లక్షల ఫాలోవర్లు ఆమెకు ఉన్నారు. దాంతో ఇప్పుడీ ఢిల్లీ భామ ఏకంగా ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పొందింది. తొలి సినిమానే పాన్ ఇండియా ఫిల్మ్ కావడం గ్రేట్ కదా! 1940ల నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకుడు.

గీతా ఆర్ట్స్‌లో..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన మరో కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్. ఆమె కూడా నటిగా టాలీవుడ్‌లోనూ.. కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే ఓ తెలుగు చిత్రంలో.. ఆకాశ్‌భాస్కర్ దర్శకత్వంలో అధర్వ హీరోగా ఓ తమిళ సినిమాలోనూ నటిస్తున్నారు. నిహారిక ఇటీవలే అమెరికన్ యానిమేటెడ్ కామెడీ టెలివిజన్ సిరీస్ 'బిగ్ మౌత్' సీజన్ 7లో ఓ క్యారెక్టర్‌కు వాయిస్ కూడా అందించడం విశేషం. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు మిలియన్లలో ఉన్నారు.

'బేబీ' కాంబోలో..

సోషల్ మీడియాను తెలివిగా వాడుకుని సినిమాల్లో ఎంట్రీ కార్డ్ దక్కించుకున్న తెలుగమ్మాయి అలేఖ్య హారిక (దేత్తడి హారిక). యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్.. కవర్ సాంగ్స్, వెబ్ సిరీస్‌లలో నటించి పాపులర్ అయ్యారు. ఆమె ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్.కె.ఎన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.

వరుసగా నాలుగో చిత్రం



సోషల్ మీడియాతో వరుస అవకాశాలు తెచ్చుకున్నారు కేరళకు చెందిన అనంతిక సనీల్‌కుమార్. కంటెంట్ క్రియేటర్‌గా ఓ వైపు రాణిస్తూనే.. క్లాసికల్ డ్యాన్సర్‌గా.. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా పలు రంగాల్లో పట్టు తెచ్చుకున్నారు. ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించారు. 'రాజమండ్రి రోజ్‌మిల్క్' చిత్రంతో తెరంగేట్రం చేసి.. 'మ్యాడ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం 'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టీ దర్శకత్వం వహిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.







వీళ్లతో పాటు సోషల్‌మీడియాను కేరాఫ్ అడ్రస్‌గా వాడుకుని ఇప్పటికే ఎంతో మంది తారలు సినిమాల్లో అవకాశాలు పట్టేశారు. వారిలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్స్.. సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె కెరీర్‌ను 'బేబీ' సినిమా సక్సెస్ ఒక్కసారిగా మార్చేసింది. వైష్ణవిని ఓవర్‌నైట్ స్టార్‌ను చేసి వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. మరో నాయిక రుహాని శర్మ కూడా సోషల్ మీడియా నుంచి వెండితెర ప్రయాణం చేసి 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' 'చి.ల.సౌ. స్రవంతి' చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మోడల్‌గా ట్రయిల్స్ దశలో ఉన్న సాక్షి వైద్య సోషల్‌మీడియాలో తన ఫొటోల ద్వారా సినిమా అవకాశాలు దొరకబుచ్చుకున్నారు. అలా ఆమె 'ఏజెంట్' చిత్రంలో తళుక్కుమన్నారు. ఆ సినిమా సక్సెస్ కాకపోయినా.. ఈ అమ్మడుకు మాత్రం మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ కోవలోకి చెందిన వారే.. 'బీస్ట్' ఫేమ్ అపర్ణా దాస్, 'రొమాంటిక్', 'అంగరంగ వైభవంగా' ఫేమ్ కేతిక శర్మ, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్. ఇలా ఎంతో మంది సోషల్ మీడియా స్టార్స్‌కు సినిమా తలుపులు తెరుస్తూనే ఉంది. మరి వీరిలో ఎంత మంది హీరోయిన్లుగా నిలబడతారో వేచి చూడాలి.

ఆదివారం

అలా పిలవటం గొప్పగా అనిపిస్తుంది

ఎప్పటికప్పుడు డిఫరెంట్ లుక్స్‌తో కనపడే బాలీవుడ్ కథానాయిక నర్గిస్ ఫక్రి. ఈ అమెరికన్ భామ బాలీవుడ్‌లో 'రాక్‌స్టార్' కథానాయికగానే ఇప్పటికీ పాపులర్. నర్గిస్ ఫక్రి గురించి కొన్ని విశేషాలు..

ఇటీవలే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో జిమ్ ఫొటోలను షేర్ చేసింది. ఈ ఫొటోలు వైరల్ అయ్యాయి. దీంతో పాటు ఈ అమ్మడు 'మహిళలకు మజిల్స్ అవసరమే. ప్రతిరోజూ జిమ్ చేసి శారీరక ఆరోగ్యమే కాదు మానసిక ఆరోగ్యాన్నీ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అంటోంది నర్గిస్. ఈ మధ్యకాలంలో కెటిల్ బెల్ వర్కవుట్స్ చేస్తోందీమె.

అలా సినిమాల్లో అవకాశం..

నర్గిస్ అమెరికాలో పుట్టింది. తన తండ్రి పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తి. పేరు మహ్మద్ ఫక్రి. ఇక తల్లి చెక్ రిపబ్లిక్‌కు చెందిన మహిళ. నర్గిస్‌కు ఆరేళ్లున్నప్పుడే పేరెంట్స్ విడిపోయారు. ఆ తర్వాత తన తండ్రి చనిపోయారు. అమెరికన్ నేషనాలిటీ వచ్చింది. అయితే ఆమె గ్లోబల్ సిటిజన్‌గా చెప్పుకోవటానికే ఇష్టపడుతుంది. ఇక పదహారేళ్ల వయసులోనే నర్గిస్ మోడల్‌గా అడుగుపెట్టింది. ఫ్యాషన్‌గాళ్‌గానే కాకుండా మోడల్‌గా క్రేజ్ సంపాదించింది. 2009 సమయంలో మనదేశంలోని కింగ్ ఫిషర్ క్యాలెండర్ గాళ్‌గా కనపడింది. అలా ఆమెకు పేరొచ్చింది. 'ఒక రోజు డెన్మార్క్‌లో షూటింగ్ ఉన్నా. ఒక ఈమెయిల్ వచ్చింది. ఇండియన్ మూవీలో నటించాలని ఆ మెయిల్ సారాంశం. అయితే నమ్మటం కష్టమన్నాను. చివరికి మీకు హిందీ నేర్పిస్తాం. నేను ఫలానా డైరక్టర్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేస్తాను. మీరు ఒకసారి ముంబై రండి అని చెప్పారు. దీంతో ఇక్కడికొచ్చాను. ఆడిషన్‌లో పాల్గొన్నా. ఆ సినిమానే



'రాక్‌స్టార్'. అలా బాలీవుడ్ కథానాయికగా కెరీర్‌ను ఆరంభించాను' అంటుందీమె.

అలా ఊహించలేదు..

ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ మ్యూజికల్ స్టోరీలో నర్గిస్ నటకు మంచి మార్కులు పడ్డాయి. సినిమా కూడా సూపర్ హిట్ అవటంతో ఆమెకు అవకాశాలు వచ్చాయి. 'తొలి సినిమానే సూపర్ హిట్ అవుతుందని ఊహించలేదు. ఆ సమయంలో ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలనే ఆలోచన కూడా కోల్పోయాను. తొలి సినిమానే విజయం సాధించటంతో గ్రేట్‌గా ఫీలయ్యా. ఇప్పటికీ రాక్‌స్టార్ హీరోయిన్ అనే పిలుస్తారు. ఇదెంతో గొప్పగా అనిపిస్తుంది.

> నర్గిస్ ఫక్రి అమెరికన్ లుక్స్‌లో ఉన్న బాలీవుడ్ హీరోయిన్. ఇన్‌స్టాలో ఎనిమిది మిలియన్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. సినిమా విశేషాలతో పాటు జీవితంలో ముఖ్య విషయాలను షేర్ చేస్తుంటుంది. ఫిట్‌నెస్ వీడియోలతో పాటు ప్రయాణాలను పోస్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఇన్‌స్టాలో ఆమె చేసే ఫొటోషూట్ ఫొటోలే హైలైట్. ఇంటర్నేషనల్ యాక్ట్రెస్ అంటూ ఓ వెబ్‌సైట్‌ను కూడా నర్గిస్ ఫక్రి తన పేరుతో తయారు చేయించుకుంది.

శ్రీలంక సివిల్ వార్ నేపథ్యంలో వచ్చిన 'మద్రాస్ కేఫ్'లో నటించింది. 'పాత పోస్టర్ నిఖ్‌లా హీరో', 'కిక్' చిత్రాల్లో ఆమె చేసిన ఐటమ్ సాంగ్స్ మంచి పేరు తీసుకొచ్చాయి. 'స్పై' అనే హాలీవుడ్ చిత్రంలో నటించింది. 'హౌస్‌ఫుల్ 3', 'అమవాస్', 'తొర్బాజ్' లాంటి చిత్రాల్లో నటించినా ఆమెకు పెద్దగా పేరు రాలేదు. దీంతో ఆమె కెరీర్ ముగిసినట్లే అనుకున్నారు. అయితే ప్రస్తుతం 'హరి హర వీర మల్లు' చిత్రంలో నటిస్తోంది.

అదే నా ఆశ..

ముంబైలోని స్ట్రీట్ ఫుడ్ తినటం అంటే చాలా ఇష్టం. చాలా సార్లు సిక్ అయ్యాను. అయితే తినకుండా ఉండలేనంటుంది నర్గిస్. 'ఇంట్లో బటర్ చికెన్ వండుతాను. అది కూడా ఇన్‌స్టా వీడియోలను చూసి. ఒకప్పుడు కాఫీ ఎక్కువగా తాగేదాన్ని. ఇండియాలో ఉన్నా కాబట్టి టీకి బానిసయ్యాను' అంటుందీమె. ఒకప్పుడు ఎక్కువగా చాక్లెట్స్ తినేదట. ఇప్పుడు మానేసింది. 'రణ్‌బీర్ కపూర్, వరుణ్ ధావన్, ఇలియానా.. ఇలా అందరం షూటింగ్ టైమ్‌లో హోమ్ ఫుడ్ షేర్ చేసుకునేవాళ్లం. ఇప్పటికీ నా బెస్ట్ కథానాయకుడు రణ్బీర్ కపూర్. అతనే 'రాక్‌స్టార్' అంటుంది నర్గిస్. ఇకపోతే ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో, వెబ్‌సిరీస్‌లో తనకు మంచి పాత్రలు దొరుకుతాయని ఆమె ఆశగా ఎదురుచూస్తోంది. విభిన్నమైన కథల్లో నటించినప్పుడే సత్తా తెలుసుకోవచ్చు అంటుంది నర్గిస్. 'కాబోయే వరుడు ఇండియన్ అయి ఉండాలనుకుంటాను' అంటూ మనసులో మాటను చెబుతుంది నర్గిస్ ఫక్రి.

'బుట్ట బొమ్మ.. బుట్ట బొమ్మ' అంటూ కుర్రకారుతో స్టెప్స్ వేయించినా, 'అనగనగనా... అరవిందట తన పేరు...' అంటూ ఉత్సుకతను రేకెత్తించినా... అర్మాన్ మాలిక్‌ది విభిన్నమైన శైలి. అర్మాన్ తల్లి సొంత ఊరు వైజాగ్. అందుకే "మేము అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడుతూ ఉంటాం. తెలుగు నేర్చుకోవడానికి ప్రత్యేకంగా క్లాసులు కూడా తీసుకుంటున్నా" అంటున్న అర్మాన్ వచ్చే నవంబర్‌లో తనకు ఇష్టమైన వైజాగ్‌లో షో కూడా చేయబోతున్నాడు. ఈ నేపథ్యంలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనటానికి హైదరాబాద్ వచ్చిన అర్మాన్‌ను 'నవ్య' పలకరించింది.

సండే సెలబ్రిటీ



అదే సంగీతం గొప్పతనం

మీకు తెలుగు వచ్చా?

అమ్మ, నేను అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడుకుంటూ ఉంటాం. నాకు తెలుగులో మాట్లాడితే అర్థమవుతుంది. ఇంట్లో హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడుకుంటాం. కానీ నాకు తెలుగంటే చాలా ఇష్టం. అందుకే తెలుగు నేర్చుకోవటానికి ప్రత్యేకంగా క్లాసులకు వెళుతున్నా.

మీరు ఈ సంగీత ప్రపంచంలోకి ఎలా ప్రవేశించారు?

మాది మ్యూజిక్ ఫ్యామిలీ కాబట్టి నేను ఈ ప్రపంచంలోకి వచ్చానని అందరూ అనుకుంటూ ఉంటారు. అది కొంతవరకే నిజం. నాకు చిన్నప్పటి నుంచి నేపథ్య సంగీతం పాడాలని ఉండేది. కారణం తెలియదు కానీ సినీ సంగీతం నన్ను చాలా ఆకర్షించేది. నేను మ్యూజిక్ కంపోజ్ చేస్తాను. కానీ ఒక పాట పాడుతుంటే వచ్చే ఆనందమే వేరు.

ఒక సింగర్‌కు సాధన ఎలా ఉపయోగపడుతుంది? మీరు రోజూ ఎన్ని గంటలు సాధన చేస్తారు?

వ్యాయామం చేసే సమయంలో ముందు వార్మప్‌లు చేస్తారు. మన గాత్రానికి కూడా అలాంటి వార్మప్ అవసరం. రోజూ కనీసం పావుగంట సాధన చేస్తాను. పాశ్చాత్య సంగీతాన్ని కూడా పాడటానికి అనువుగా నా స్వరాన్ని తయారుచేసుకుంటా. ఇక కాన్సర్ట్స్ ఉన్న సమయంలో... ఏదో ఒక పాటను తీసుకొని ప్రాక్టీస్ చేస్తా. దానివల్ల మిగిలిన పాటలు సులభమవుతాయి.

> 'హమే తుమే ప్యార్ కిత్నా' అనే కిశోర్‌కుమార్ పాట అంటే నాకు చాలా ఇష్టం. నన్ను ప్రభావితం చేసిన సింగర్- సోనూ నిగం. చిన్నప్పటి నుంచి ఆయనలా పాడాలనుకొనేవాణ్ణి.
>
> నాకు వైజాగ్ అంటే చాలా ఇష్టం. నవంబర్ 9న అక్కడ షో ఉంది. మా అమ్మ వైజాగ్‌కు చెందినదే! కాబట్టి నాతో పాటు మా అమ్మ కూడా చాలా ఆతృతగా ఎదురుచూస్తోంది.



స్టేజ్ మీద పాడుతున్నప్పుడు ఎప్పుడైనా మిమ్మల్ని మీరు మర్చిపోయారా?

లండన్‌లోని వెంబ్లీ ఎరినాలో ఒకసారి షో జరిగింది. దీనిలో రెండు గంటలు పాడాను. బయటకు వచ్చిన తర్వాత - "ఎలా ఫీలయ్యారు?" అని అక్కడివారు అడిగారు. నాకు ఆ స్టేజీ మీద పాడిన ఒక పాట కూడా గుర్తు లేదు. అంత తన్మయత్వంలో మునిగిపోయా. నాకే కాదు. అనేకమంది గాయనీ, గాయకులకు ఇలాంటి అనుభవం ఎప్పుడో ఒకప్పుడు కలిగే ఉంటుంది. దీన్ని మామూలు మాటల్లో చెప్పలేను. మైమరిచిపోయానని మాత్రమే చెప్పగలను. సంగీతానికి ఉన్న గొప్పతనం అదే.

ఏ భాషలో పాటలు పాడటం కష్టం?

మలయాళం. మీరు ఏ సింగర్‌నైనా అడగండి... మలయాళంలో పాడటం కష్టమని చెబుతారు. ఆ భాష చాలా అందంగా ఉంటుంది. అదే సమయంలో దాన్ని ఒడిసిపట్టుకోవటం కూడా చాలా కష్టం. కొన్ని పదాలను కొన్ని విధాలుగానే పలకాలి.

ఏ భాషలో పాడటం సులభం..

తెలుగు, కన్నడలలో పాడటం చాలా సులభమనిపిస్తుంది. రెండు భాషల మధ్య సారూప్యత కూడా ఉంది. ఈ రెండు భాషల్లో పాడుతున్నప్పుడు ఎలాంటి శ్రమ ఉండదు.

దక్షిణ భారత దేశంలోని ఒకో భాషకు ఒక ప్రత్యేకత ఉంటుంది. యాస ఉంటుంది. అలాంటప్పుడు - ఆ భాషకు తగ్గట్టుగా ఎలా పాడగలుగుతారు?

జాగ్రత్తగా నేర్చుకుంటే అంత కష్టం కాదు. ఉదాహరణకు నేను తెలంగాణ యాసలోను, ఆంధ్ర యాసలోను, రాయలసీమ యాసలో పాడగలను. ఈ మూడు వేర్వేరు. చిన్న చిన్న పదాలను పట్టించుకుంటే తేడాలు తెలుస్తాయి. జాగ్రత్త తీసుకోకపోతే వేరే భాషకు చెందిన సింగర్ పాడుతున్నాడని తెలిసిపోతుంది. నా పాట విన్న వారు- 'ఇతను మన భాషవాడే' అనుకోవాలి. అప్పుడే పాటకు న్యాయం చేసిన వాళ్లమవుతాం. లేకపోతే విఫలమయినట్లే.

మీకు నచ్చిన సంగీత దర్శకులు ఎవరు?

ఒకరని చెప్పలేను. అనేకమంది ఉన్నారు. ఎ.ఆర్.రెహమాన్ సర్, సంజయ్ లీలా భన్సాలీ సర్, సలీం-సులైమాన్, తమన్ సర్, అనూప్ రూబెన్స్, గోపీ సుందర్- ఇలా చెప్పుకుంటూ పోతే అనేకమంది ఉన్నారు. ఒక్కొక్కరికి ఒకో ప్రత్యేకత ఉంటుంది. ఇక ఈ సంగీత దర్శకులందరూ తమ దగ్గర పాడే సింగర్స్‌కు స్వేచ్ఛను ఇస్తారు. నేను రెహమాన్ సర్ దగ్గర తొలి సారి పాడేటప్పుడు చాలా భయపడ్డా. కానీ ఆయన "నువ్వు ఎలా పాడాలనుకున్నావో... అలా పాడు" అన్నారు. అదొక అనుభవం. ఇక సంజయ్ లీలా భన్సాలీ సర్ చాలా కచ్చితంగా ఉంటారు. నేను ఆయనకు 'సుకూన్' అనే ఆల్బమ్‌లో ఒక గజల్‌ను ఏడుసార్లు పాడాను. ఏడు నెలలు ఏడు రకాలుగా పాడి వినిపించాను. ఆయన ప్రతి మాటను.. ప్రతి స్వరాన్ని పట్టించుకుంటారు. నేను అన్నిసార్లు ఏ పాటనూ పాడలేదు. నాకు ఇప్పటికీ అదే ఫేవరెట్ సాంగ్. నాకు ఆ అవకాశం వచ్చినందుకు ఆనందపడుతూ ఉంటాను. ఆ గజల్ తర్వాత నేను మంచి సింగర్ అయ్యాననుకుంటాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

> గతంలో మాదిరిగా ఇప్పుడు గాయనీగాయకులు ఏళ్ల తరబడి నిలబడడం లేదు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత అందరికీ అవకాశాలు పెరిగాయి. ఒకప్పుడు సింగర్స్ కొద్దిమందే ఉండేవారు. ప్రత్యేకంగా ప్రయత్నం చేస్తే తప్ప అవకాశాలు వచ్చేవి కావు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత సంగీత దర్శకులకు, గాయకులకు మధ్య ఉన్న దూరం తగ్గిపోయింది. ఎవరైనా పాట పాడి యూట్యూబ్‌లో పెట్టవచ్చు. దాని ద్వారా అవకాశాలు రావచ్చు. కాబట్టి ప్రతి సంవత్సరం బ్లాక్ బస్టర్ హిట్స్ ఇస్తే తప్ప ఏ గాయకుడూ ఎక్కువ కాలం నిలబడలేడు. నేను 16 ఏళ్ల నుంచి పాడుతున్నా. కొత్త తరం ఇష్టపడే సంగీతంతో వెళ్లకపోతే... వెనకబడిపోతామని ఈ ప్రయాణంలో నేను తెలుసుకున్నా. కాలంతో కూడా మనం మారాలి.



అలనాటి కథ

మనకున్న గొప్ప రచయితలలో ముఖ్దుం ఒకరు. ఆయనతో నాన్నకు మంచి స్నేహం ఉండేది. నిన్న పాత పుస్తకాలు తిరగేస్తుంటే ముఖ్దుం పుస్తకాలు బయటకు వచ్చాయి. అనేక జ్ఞాపకాలు మదిలో మెదిలాయి.

ముఖ్దుం జ్ఞాపకాలు..



నాన్న రాజా ధన్‌రాజ్‌గిరి ఉర్దు, పర్షియన్ పుస్తకాలు చదువుతూ ఉండేవారు. అలా ఆయనకు ముఖ్దుంతో పరిచయం ఏర్పడింది. నాన్నకు ఆయన కవిత్వం పట్ల విపరీతమైన ఆసక్తి ఏర్పడి ఆయనను కలవాలనుకున్నారు. ఒక స్నేహితుడి ఇంట్లో కలుసుకున్నారు. ఒక రోజు నాన్న- ముఖ్దుంను, ఇతర స్నేహితులను ఇంటికి డిన్నర్‌కి పిలిచారు. నేను డైనింగ్ రూమ్ దగ్గరకు వెళ్లేసరికి- నాన్న స్నేహితులందరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఒక వ్యక్తి దూరంగా కూర్చుని చార్మినార్ సిగరెట్ తాగుతున్నాడు. నేను నాన్న స్నేహితులతో పిచ్చాపాటి మాట్లాడుతూ - "కమ్యూనిస్టులు చాలా చెడ్డవాళ్లు" అన్నాను. అప్పుడు దూరంగా కూర్చుని వ్యక్తి నా వైపు చూసి - "నీకు కమ్యూనిజం గురించి ఏం తెలుసు?" అన్నాడు. నాకు అప్పటి దాకా ఆయనే ముఖ్దుం అనే విషయం తెలియదు. "నాకు కమ్యూనిజం గురించి ఎక్కువ తెలియదు. నేను నిన్నే వియన్నా నుంచి వచ్చాను. అక్కడ నా కెమెరా లాగేసుకున్నారు.. మ్యూజియంకి వెళ్తే అక్కడ నన్ను తనిఖీ చేశారు" అని చెప్పా. ఆయన నావైపు నిరసనగా చూశాడు. ఎందుకో తెలియదు కానీ ఆయనంటే నాకు మంచి అభిప్రాయం ఏర్పడలేదు. నాన్న ఇంకెప్పుడు ఆయనను ఇంటికి పిలవకపోతే బావుండుననుకున్నాను. కానీ రెండు రోజుల తర్వాత మళ్లీ ముఖ్దుం మా ఇంటికి వచ్చాడు. నాన్న ఆయన కవిత్వం చదువుతుంటే రికార్డు కూడా చేశారు. "ప్రాణాన్ని తీసుకుందాం.. విశ్వాన్ని తీసుకుందాం.. పదండి.. మొత్తం ప్రపంచాన్ని మనతో తీసుకువెళ్దాం.." అనే ఆయన కవితా పంక్తులు నాలో ఆసక్తి కలిగించింది. ఆ తర్వాత కాలంలో ముఖ్దుం మా ఇంటిలో జరిగే అనేక పార్టీలకు వస్తూ ఉండేవాడు. ఇలా ముఖ్దుంతో పరిచయం పెరిగింది.

ఒక రోజు ముఖ్దుం నాకు ఫోన్ చేసి- "నా పుస్తకం ముద్రించాలి.. ఒక వెయ్యి రూపాయలు ఇస్తావా?" అని అడిగాడు. ఆ సమయంలో నా పాకెట్ మనీ 300రూపాయలే! దాంతో నా దగ్గర అంత డబ్బు లేదని చెప్పాను. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడు తను డబ్బుల గురించి నాతో మాట్లాడలేదు.

> నాకు శ్రీశ్రీ కవిత్వాన్ని పరిచయం చేసింది ముఖ్దుమే! తనే తొలిసారి శ్రీశ్రీ కవిత్వ పుస్తకం వచ్చింది... చదవమని చెప్పాడు. ఇలా అనేక మంది గొప్ప రచయితలను నాకు పరిచయం చేశాడు.



మా చెల్లిని స్విట్జర్లాండ్‌లో స్కూల్లో చేర్చటానికి నేను కూడా వెళ్లాను. అక్కడ నుంచి లండన్‌కు కూడా వెళ్లాను. నేను లండన్‌లో ఉన్న సమయంలో ముఖ్దుం నాకు "గుల్ ఏ తార్" (తాజా పువ్వులు) అనే పుస్తకాన్ని పంపించాడు. ముఖ్దుం రాసిన గజల్స్ పుస్తకమిది. ఒకో గజల్ ఒకో అద్భుతంలా అనిపించింది. "నాకు కూడా గజల్స్ రాయటం నేర్పుతారా?" అని ముఖ్దుంను అడిగాను. "నువ్వు రాసి పంపించు.. వాటిని నేను సరిచేస్తాను" అన్నాడు. నేను లండన్ నుంచి ముంబాయి వచ్చాను. అక్కడ నుంచి తనకు ఒక గజల్ రాసి పంపాను. దానిలో మూడు చరణాలు- ఇతర కవులవి. రెండు నావి. అవి చదివిన తర్వాత ముఖ్దుం- ఇతర కవులు రాసి మూడు చరణాలకు టిక్ పెట్టి పంపాడు. నేను రాసిన రెండు చరణాలు కొట్టేసి- "ఇది రాసే పద్ధతి కాదు" అని రాసి పంపాడు. ఆ సమయంలో ముఖ్దుం సిటీ కాలేజీలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉండేవాడు. ఒకసారి ముఖ్దుం, ప్రముఖ ఇంగ్లీషు రచయిత ముల్కరాజ్ ఆనంద్‌తో కలిసి రష్యా వెళ్లాడు. అక్కడ వారిద్దరు ఒక చోట కూర్చుని కవిత్వం గురించి మాట్లాడుకుంటుంటే - ముల్కరాజ్ ఆనంద్ వ్యంగంగా- "ప్రతి భారతీయ కవి ఇంగ్లీషు రాయాలనుకుంటాడు.." అన్నాడుట. అప్పుడు ముఖ్దుం- "నువ్వే ఇంగ్లీషులో రాస్తున్నప్పుడు- ఇతరులు అనుకుంటే తప్పేముంది?" అన్నాడట. ఈ విషయాన్ని నాకు ముఖ్దుం స్వయంగా చెప్పాడు. ఆ తర్వాతి కాలంలో ముఖ్దుం కమ్యూనిస్టు భావాలను ప్రచారం చేసే కవుల్లో అగ్రగామిగా నిలిచాడు.

ఆ తర్వాతి కాలంలో హైదరాబాద్‌లో జేషిన్ ఈ ముఖ్దుం అనే కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న కవులందరూ వచ్చారు. ముఖ్దుంకు ఘన సన్మానం చేశారు. ఆ తర్వాత ముఖ్దుం ప్రజల హక్కుల కోసం జరిగిన ఒక కార్యక్రమంలో నిరాహార దీక్షకు కూర్చున్నాడు. దాని తర్వాత అతని ఆరోగ్యం పాడైపోయింది.. తనకు ఆరోగ్యం పాడైన సమయంలో నేను మారిషస్‌లో ఉన్నా. మారిషస్ నుంచి బొంబాయికి వచ్చిన వెంటనే నాన్న పర్సనల్ సెక్రటరీ వచ్చి - "మీకో చెడు వార్త. ముఖ్దుం చనిపోయాడు" అని చెప్పాడు. నాకు విపరీతమైన దుఃఖం కలిగింది. ముఖ్దుం బతుకున్న రోజుల్లో- "నన్ను మసీదులో కాకుండా ఒక పొలంలో సమాధి చేయండి. నా సమాధి మీద గులాబీ పూల మొక్కలు, ద్రాక్ష మొక్కలు నాటండి" అని చెబుతూ ఉండేవాడు. నేను హైదరాబాద్‌కు వచ్చే సరికే అతనిని ఖననం చేసేశారు. ఆ తర్వాత నేను తన సమాధి దగ్గరకు వెళ్లి గులాబీ పూలతో శ్రద్ధాంజలి ఘటించి వచ్చాను. ముఖ్దుం లేకపోయినా అతని రచనలను ఈనాటికి ప్రజలు చదువుతున్నారు. గుర్తు చేసుకుంటున్నారు.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

"మలయాళ సాహితీ దిగ్గజం వాసుదేవన్ నాయర్ రాసిన తొమ్మిది కథల ఆంథాలజీ సిరీస్ 'మనోరతంగల్'. కేరళలో సాహిత్య, సినిమా రంగాలు కలిసున్నాయనడానికి ఇదొక నిదర్శనం. తమిళంలోనూ 'పొన్నియన్ సెల్వన్' నవల సినిమాగా వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి ప్రయత్నాలు తెలుగులో మచ్చుకైనా సాగడంలేదన్నది సినీ, సాహిత్యాభిమానుల ఆవేదన. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం తెరకెక్కదా? అలాంటి ప్రయత్నాలు ఇక్కడెందుకు జరగడంలేదు? తదితర విషయాలపై ప్రముఖ సాహిత్య విమర్శకురాలు ప్రొఫెసర్ మృణాళిని చెబుతున్న అభిప్రాయమిది.

మన సాహిత్యం తెరకెక్కదా?



మన దర్శక, నిర్మాతలు, నటులు పెద్దగా సాహిత్యాన్ని చదవరు. కాబట్టి గొప్ప తెలుగులో సాహిత్యం ఉందనే విషయం వారికి తెలిసే అవకాశం చాలా తక్కువ. అదే తమిళం, మలయాళంలో మంత్రులతో సహా చాలామంది పుస్తకాలు చదువుతారు. నటులు ఆధారంగా కథ రాసుకోవడం మనకున్న అతి పెద్ద జాడ్యం. గ్లోరిపై చేసిన నెగెటివిటీని, క్రౌర్యాన్ని మాత్రమే మనవాళ్లు స్వీకరిస్తారు తప్ప... ఒక బలహీనత ఉన్న, సహజమైన వ్యక్తి కథా నాయకుడిగా ఉండే కథలను, నవలలను మనవాళ్లు స్వీకరించలేరు. సాహిత్యంలోని షేడ్స్‌ను సినిమాల్లోకి తీసురావడానికి వాళ్ళ స్టార్‌డమ్, అభిమానగణం అడ్డుపడతాయి. అలాంటప్పుడు సాహిత్యం నుంచి సినిమాకు కథ తీసుకోడానికి ఆస్కారం ఉండదు. ఉత్తమ సాహిత్యం స్టార్ డమ్‌కు లొంగదు. అదే మలయాళంలో చూడండి... మమ్ముట్టి 'కాథల్- ది కోర్' సినిమాలో హోమోసెక్సువల్ పాత్ర పోషించారు. సూపర్‌స్టార్ స్థాయిలోని నటుడు అలాంటి పాత్రలో నటించాడంటే... నటుడిగా అతను ఎంతటి నిజాయితీపరుడు కాకపోతే అలా చేయగలడు. ఆ నిజాయితీ మన తెలుగు నటుల్లో లేదు. ఒకప్పుడు 'దేవదాసు', 'బాటసారి', 'అర్ధాంగి' లాంటి సూపర్‌హిట్ సినిమాలన్నీ నవలల ఆధారంగా వచ్చినవే.! ఇక 1960, 70 దశకాలలో కోడూరి కౌసల్యాదేవి, యద్దనపూడి సులోచనారాణి



తదితరుల కథలు, నవలలు... ప్రేమ కథా, కుటుంబ కథా చిత్రాలుగా వచ్చాయి. ఆ నవలలు ఎంతగా హిట్ అయ్యాయో... సినిమాలూ అంతగా హిట్ అయ్యాయి. ఇప్పుడు ఆ జానర్ పనికిరాదు. ఇప్పుడు మంచి క్లాసిక్ నవలలను సినిమాగా తీయాలంటే... ట్రెండ్‌కు తగినట్టు వాటిని మలచగలిగే దక్షత దర్శకులకు ఉండాలి. ఉదాహరణకు గోపీచంద్, బుచ్చిబాబు, చలం, విశ్వనాథ సత్యనారాయణ, కొ.కు రచనలు సినిమాగా తీయాలంటే దర్శకులకు సాహిత్యాభిరుచి ఒక్కటే చాలదు, తాత్విక దృక్కోణమూ ముఖ్యం. అందుకే మనం క్లాసిక్ నవల అని చెప్పుకోదగ్గది ఏదీ సినిమాగా రాలేదు. విశ్వనాథ 'వేయిపడగలు' లాంటి క్లాసిక్స్ రచనలు కొన్ని టెలివిజన్ ధారావాహికలుగా వచ్చాయి. కొంతవరకు మంచి నవలను సినిమాగా తీసినవాటిల్లో 'బలిపీఠం', 'ఇదెక్కడి న్యాయం' లాంటివి ఉన్నాయి. చలం 'దోషగుణం' కథను 'గ్రహణం' పేరుతో ఇంద్రగంటి మోహన్‌కృష్ణ చక్కగా తీశారు. 'కన్యాశుల్కం' నాటకం తర్వాత 'దోషగుణం' క్లాసిక్స్‌కు కాస్త న్యాయం చేసిన సినిమాగా చెప్పవచ్చు.

ఆ ట్రెండ్ కొనసాగలేదు...

ఎంటీ వాసుదేవన్ నాయర్ మలయాళంలో మంచి రచయిత మాత్రమే కాదు, సినిమాలకు దర్శకత్వం వహించినవాడు కూడా. జయమోహన్ కూడా 'పొన్నియన్ సెల్వన్' లాంటి సినిమాలకు మాటలు రాశారు. సాహిత్య రచయితలు సినిమాలకు కూడా రాయడం, ఆ రెండూ కలిసిమెలసి ఒకే రకమైన స్థాయిలో కొనసాగడం వేరే భాషల్లో చూస్తాం. మనదగ్గర సినిమా అన్నది వేరే స్థాయిలో ఉంటుంది. అది సాహిత్య స్థాయికి రావడం లేదు. కొందరు ప్రముఖ రచయితలు ఆనాడు సినిమా కథలు రాద్దామని వెళ్లి భంగపడి బయటకు వచ్చారు. ఉదాహరణకు గోపీచంద్, రావి శాస్త్రి తదితరులు. మంచి రచయితలను వినియోగించుకోవడం మన సినిమా వారికి చేతకాలేదు. అదే బుచ్చిబాబు రాసిన మూలకథకు దేవులపల్లి కృష్ణశాస్త్రి సృజన తోడవడంతో 'మల్లీశ్వరి'లాంటి కథ పుట్టింది. ఆ ట్రెండ్ తర్వాత కొనసాగలేదు. బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' నవలను సినిమాగా తీస్తానని ఇంద్రగంటి మోహన్‌కృష్ణ ప్రకటించాడు. క్రిష్ కూడా కొంతవరకు ప్రయత్నిస్తున్నాడు. అయితే, 'కొండపొలం' నవలను సినిమాగా తీసే క్రమంలో కమర్షియల్ ఎలిమెంట్‌కు లొంగిపోయాడు. ఒక నవల లేదా కథను సినిమాగా తీయాలంటే, దాని ఫోకస్ పాయింట్‌ను పట్టుకోకపోతే ఆ రచనకు న్యాయం జరగదు.

- ప్రొఫెసర్ సి.మృణాళిని

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్




ఈ వారమే విడుదల


ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్ నో గైన్ నో లవ్ ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ 2	కొరియన్ సిరీస్ వెబ్‌సిరీస్	ఆగస్టు 26 ఆగస్టు 29	**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్** ఓన్లీ మర్డర్స్ ఇన్ ది బిల్డింగ్ 4 కానా కానూమ్ కాళంగల్	వెబ్‌సిరీస్ తమిళ సిరీస్	ఆగస్టు 27 ఆగస్టు 30
నెట్‌ఫ్లిక్స్ ఐ.సి 814: ది కాందహార్ హైజాక్ ది డెలివరెన్స్ బ్రీత్‌లెస్	హిందీ సిరీస్ వెబ్‌సిరీస్ వెబ్‌సిరీస్	ఆగస్టు 29 ఆగస్టు 30 ఆగస్టు 30	**బుక్ మై షో** ట్విస్టర్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 30
			జియో సినిమా ఎబిగైల్ గాడ్జిల్లా వర్సెస్ కాంగ్	హాలీవుడ్ మూవీ హాలీవుడ్ మూవీ	ఆగస్టు 26 ఆగస్టు 29
జీ 5 ముర్షిద్	హిందీ సిరీస్	ఆగస్టు 30	**ఆపిల్ టీవీ ప్లస్** కె-పాప్ ఐడల్స్	కొరియన్ సిరీస్	ఆగస్టు 30





ఐసీ 814 హైజాక్ సంఘటనతో...



1999లో ఖాట్మాండు నుంచి ఢిల్లీకి వస్తున్న ఐసీ 814 ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంఘటన ఆధారంగా రూపుదిద్దుకున్న వెబ్‌సిరీస్ 'ఐసి 814 : ది కాందహార్ హైజాక్'. దేశాన్ని కుదిపేసిన ఈ ఘటనలో 188 మంది ప్రయాణికులు, 15 మంది సిబ్బంది వారం రోజుల పాటు కాందహార్‌లో తాలిబన్ల చేతుల్లో బందీలుగా ఉన్నారు. హైజాక్ అయిన విమానాన్ని నియంత్రణలోకి తీసుకోవడానికి ఇండియన్ ఆర్మీ చేసిన ప్రయత్నాలు,ఢిల్లీలోని వార్‌రూమ్‌లో రూపొందిన వ్యూహాలు ప్రయాణికులను భద్రంగా స్వదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాల నేపథ్యాన్ని ఈ సిరీస్ కళ్లకు కడుతుందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. విజయ్ వర్మ, అరవింద్ స్వామి, నసీరుద్దీన్ షా, దియా మీర్జా కీలకపాత్రలు పోషించారు. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. ఆగస్టు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవనుంది.

జ్ఞానదత్తుకు కాంస్యం



న్యూఢిల్లీ: చైనాలోని చెంగ్డూలో జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా అండర్-17 చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు జ్ఞానదత్తు పతకంతో మెరిశాడు. తెలంగాణకు చెందిన జ్ఞానదత్తు అండర్-17 బాలుర సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించాడు. శనివారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో జ్ఞానదత్తు 21-9, 13-21, 13-21తో రాధిత్య బయు వర్దానా (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఇక, అండర్-15 బాలికల సింగిల్స్‌లో భారత షట్లర్ తన్వి పత్రి ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో టాప్‌సీడ్ తన్వి 21-19, 21-10తో ఆరోసీడ్ కుంగుకే కకానిక్ (థాయ్‌లాండ్)పై గెలిచింది.

ఫైనల్లో నవ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ సిరీస్ బాలికల అండర్-19 సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి నవ్య ఫైనల్ చేరింది. శనివారం గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన సెమీఫైనల్లో నవ్య 18-21, 21-19, 21-13తో భారత్‌కే చెందిన టానూ చంద్రపై నెగ్గింది. బాలుర సింగిల్స్‌లో లక్ష్ చెంగప్ప 11-21, 21-14, 21-19తో చియాంగ్ చెయి (తైపీ)పై గెలిచి ఫైనల్ చేరాడు.




పారిస్‌కు షూటర్ల బృందం

న్యూఢిల్లీ: పది మంది సభ్యులతో కూడిన భారత పారా షూటర్ల బృందం ప్రతిష్ఠాత్మక పారాలింపిక్స్‌లో పోటీపడేందుకు శనివారం పారిస్ బయల్దేరింది. టోక్యో క్రీడల్లో రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన షూటర్ అవనీ లేఖరా మరోసారి అదే తరహా ప్రదర్శన చేయాలని ఆశిస్తోంది. పిస్టల్ షూటర్ మనీష్ నర్వాల్‌పై కూడా స్వర్ణ ఆశలు ఉన్నాయి. గత క్రీడల్లో షూటింగ్‌లో భారత్ రెండు స్వర్ణాలు సహా ఐదు పతకాలు సాధించింది. ఈసారి అంతకంటే ఎక్కువ మెడల్స్ సాధిస్తారన్నది అంచనా.

గబ్బర్ గుడ్‌బై

క్రికెట్ నుంచి వైదొలిగిన శిఖర్ ధవన్





న్యూఢిల్లీ: భారత జట్టు ఓపెనర్ శిఖర్ ధవన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ, దేశవాళీతో పాటు అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించాడు. అభిమానులతో గబ్బర్ అని ముద్దుగా పిలిపించుకునే 38 ఏళ్ల ధవన్.. రిటైరవుతున్నట్టు శనివారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 2010లో ఆస్ట్రేలియాతో వైజాగ్ వన్డే ద్వారా అరంగేట్రం చేసిన ఎడమచేతి బ్యాటర్ ధవన్ అనతికాలంలోనే మూడు ఫార్మాట్లలోనూ ఆడగలిగాడు. అయితే ఫామ్‌లేమి కారణంగా రెండేళ్లుగా అతడిని సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదు. 2022లో బంగ్లాదేశ్‌తో చివరి వన్డే ఆడాడు. 'నా క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతున్నా. జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాల్సిన సమయం వచ్చింది. అందుకే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నా. చాలాకాలం జట్టు తరఫున క్రికెట్ ఆడగలిగాననే ఆనందంతో నా మనసు ప్రశాంతంగా ఉంది. జాతీయ జట్టుకు ఆడాలనే జీవితాశయాన్ని నెరవేర్చుకున్నా. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, కోచ్‌లు, ఢిల్లీ క్రికెట్ సంఘం, బీసీసీఐ, నా సహచరులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని ధవన్ అన్నాడు. కాగా.. ఐపీఎల్‌లో ప్రాతినిధ్యంపై ధవన్ స్పష్టత ఇవ్వలేదు. అయితే 2008 ఆరంభ సీజన్ నుంచి శిఖర్ లీగ్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అతను పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

కెరీర్ సాగిందిలా..

ఫార్మాట్	మ్యా	ప	శ	అ. స్కో
టెస్టులు	34	2315	7	190
వన్డేలు	167	6793	17	143
టీ20లు	68	1759	0	92

గమనిక- ఫా: ఫార్మాట్; మ్యా: మ్యాచ్‌లు; ప:పరుగులు; శ: శతకాలు; అ.స్కో: అత్యధిక స్కోరు

'మిస్టర్' ఐసీసీ

2010లో భారత జట్టు తరఫున తొలిసారిగా బరిలోకి దిగిన ధవన్‌కు ఆ మ్యాచ్ చేదు జ్ఞాపకంగానే నిలిచింది. ఆస్ట్రేలియాపై రెండు బంతులే ఆడి డకౌటయ్యాడు. ఇక రెండేళ్లుగా జట్టుకు దూరమై ఇప్పుడు ఆట నుంచి తప్పుకొన్నాడు. కానీ ఈ మధ్యలో 14 ఏళ్లు అతడు జట్టుకు అందించిన సేవలను తక్కువగా చూడలేం. జీరోతో సాగిన ధవన్ కెరీర్ ప్రస్థానం, ఆ తర్వాత పరిమిత ఓవర్లలో విజయవంతమైన ఓపెనర్లలో ఒకడిగా నిలబెట్టింది. రోహిత్, విరాట్‌లతో పాటు ధవన్ కొంతకాలం భారత బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలిచాడు. అయితే ఆ ఇద్దరి మేనియా ముందు గబ్బర్ ఆట పెద్దగా వెలుగులోకి రాలేదనే చెప్పొచ్చు. 2013 నుంచి 2022 వరకు వన్డేల్లో 85కు పైగా స్ట్రయిక్ రేట్‌తో దూకుడు కొనసాగించాడు. 2016, 17, 18 సంవత్సరాల్లో అయితే ఇది 100+తో సాగింది. రోహిత్‌తో కలిసి శిఖర్ ఓపెనర్‌గా 5,148 పరుగులు అందించగా, ఇందులో 18 సెంచరీ భాగస్వామ్యాలుండడం విశేషం. సచిన్-గంగూలీ (21) తర్వాత వన్డే క్రికెట్‌లో ఇదే సెకండ్ బెస్ట్. ఇక మైదానంలో తొడ గొట్టి చేతిని పైకి లేపి ధవన్ చేసుకునే సంబరాలు ఆరోజు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచేవి. ఐసీసీ టోర్నీ (వన్డే వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీ)ల్లో ధవన్ ఆకాశమే హద్దుగా చెలరేగేవాడు. ఏకంగా 65.15 అత్యధిక సగటుతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఇక చాంపియన్స్ ట్రోఫీలో ఈ ఢిల్లీ స్టార్ పరుగుల వరదే పారించాడు. 2013లో ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడంలో ధవన్‌దే కీలక పాత్ర. రెండు వరుస సెంచరీలతో మొత్తం 363 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. 2017 చాంపియన్స్ ట్రోఫీలోనూ ధవన్ (338)వే అత్యధిక పరుగులు. అందుకే అతడిని క్రికెట్ వర్గాల్లో మిస్టర్ ఐసీసీగా పిలుచుకుంటారు. మరోవైపు తన వందో వన్డేలో శతకం సాధించిన కొద్దిమంది (10) క్రికెటర్లలో శిఖర్ ఒకడిగా నిలిచాడు. ఇక ఆసీస్‌తో వన్డే అరంగేట్రం విఫలమైనా అదే జట్టుతో తన టెస్టు ప్రస్థానాన్ని చిరస్మరణీయం చేసుకున్నాడు. సెహ్వాగ్ గైర్హాజరీలో ఓపెనర్‌గా ఆడిన అతను 85 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. అరంగేట్ర టెస్టు మ్యాచ్‌లో నమోదైన ఫాస్టెస్ట్ శతకంగా ఇప్పటికీ ఇదే రికార్డు కావడం విశేషం. బుల్లెట్ వేగంతో సాగిన ధవన్ కవర్ డ్రైవ్స్, రివర్స్ స్వీప్ షాట్లకు బౌలర్లు చేష్టలుడిగి పోయేవారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



బ్యాట్‌తో అద్భుతాలు సృష్టించి, ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడావ్. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నీ మోముపై చిరునవ్వు చెదరలేదు. - బీసీసీఐ

నీ దూకుడైన ఆటను క్రికెట్ మైదానం మిస్ అవుతుంది. నీ చిరునవ్వు, నీ శైలి, క్రికెట్ పట్ల నీకున్న ప్రేమ ఎప్పటికీ అభిమానుల గుండెల్లో నిలిచిపోతుంది. - సచిన్

మొహాలీలో నా స్థానంలో ఓపెనర్‌గా ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి నీవు వెనుదిరిగి చూడలేదు. అద్భుత ప్రదర్శన చేశావు. - సెహ్వాగ్

అద్భుత కెరీర్‌కు జేజేలు. భవిష్యత్‌లో నువ్వు ఎంచుకోబోయే ఏపనిలోనైనా ఇదే తరహా సంతోషాన్ని నింపుతావని ఆశిస్తున్నా. - గంభీర్

ముష్ఫికర్ భారీ శతకం

బంగ్లా తొలి ఇన్నింగ్స్ 565 ● పాక్‌తో మొదటి టెస్టు



ముష్ఫికర్ (191)

రావల్పిండి: మిడిలార్డర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ (191) భారీ శతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 565 పరుగులు చేసింది. మెహిదీ హసన్ (77), లిట్టన్ దాస్ (56) అర్ధశతకాలు సాధించారు. నసీమ్ షాకు 3.. షహీన్, అలీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ నాలుగోరోజైన శనివారం ఆట ముగిసేసరికి 23/1 స్కోరుతో నిలిచింది. క్రీజులో అబ్దుల్లా (11), షాన్ మసూద్ (9) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌ను 448/6 స్కోరుతో డిక్లేర్ చేసిన పాక్.. ప్రస్తుతం మరో 94 పరుగులు వెనుకంజలో ఉంది. ఆటకు ఆదివారం ఆఖరి రోజు కావడంతో మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశం కనిపిస్తోంది.

ఇంగ్లండ్‌దే విజయం

మాంచెస్టర్: శ్రీలంకతో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. శనివారం నాలుగు రోజే ముగిసిన తొలి టెస్టులో ఆతిథ్య జట్టు ఐదు వికెట్లతో నెగ్గింది. 205 పరుగుల ఛేదనకు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ 5 వికెట్లకు అన్నే పరుగులు చేసి నెగ్గింది. జో రూట్ (62 నాటౌట్) అజేయ అర్ధశతకం సాధించాడు. అంతకుముందు లంక రెండో ఇన్నింగ్స్‌లో 326 రన్స్ చేసింది. కమిందు (113) శతకం సాధించాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 358, లంక 236 రన్స్ చేశాయి.

మనోళ్లకు మళ్లీ డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేష్‌కు మరో రౌండ్‌లోనూ డ్రా తప్పలేదు. ఐదో రౌండ్‌లో వెస్లీ సో (అమెరికా)తో ప్రజ్ఞానంద.. అబ్దుసతరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో గుకేష్ గేమ్‌ను డ్రా చేసుకున్నారు.

జోర్డాన్‌లో చిక్కుకుపోయిన మహిళా రెజ్లర్లు

న్యూఢిల్లీ: వరల్డ్ రెజ్లింగ్ అండర్-17 చాంపియన్‌షిప్ కోసం జోర్డాన్ రాజధాని అమ్మాన్ వెళ్లిన భారత యువ మహిళల జట్టు అక్కడే చిక్కుకుపోయింది. శుక్రవారం పోటీలు ముగియడంతో తొమ్మిది మంది మహిళా రెజ్లర్లు, ముగ్గురు కోచ్‌లు శనివారం స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో రెజ్లర్లకు కతార్ ఎయిర్‌వేస్, కోచ్‌లకు ఎమిరేట్స్ ఫ్లైట్స్ బుక్ చేశారు. అయితే, కోచ్‌ల ఫ్లైట్ నిర్ణీత సమయానికి బయలుదేరగా, తమ ఫ్లైట్ మాత్రం నిర్ణీత సమయానికంటే ముందే బయలుదేరడంతో రెజ్లర్లు అమ్మాన్ విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. కాగా.. యువ రెజ్లర్లకు, కోచ్‌లకు వేర్వేరు విమానాల్లో టిక్కెట్లు బుక్ చేయడమేంటంటూ భారత రెజ్లింగ్ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అమ్మో..అది ఎంత భయపెట్టిందో!



న్యూఢిల్లీ: ఐదేళ్ల క్రితం 'కాఫీ విత్ కరణ్' షోలో స్టార్ క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మహిళలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దాంతో వారిద్దరిపై బీసీసీఐ చెరో రూ. 20 లక్షల జరిమానా విధించడంతోపాటు సస్పెన్షన్ వేటు కూడా వేసింది. నాటి ఉదంతాన్ని కేఎల్ రాహుల్ తాజాగా ఓ కార్యక్రమంలో గుర్తు చేసుకున్నాడు. 'నేను ఎంతో సిగ్గరిని. టీమిండియాకు ఆడడం ప్రారంభించాక నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. 100 మంది ఎదుట కూడా అనర్గళంగా మాట్లాడేవాడిని. అయితే ఇప్పుడు అలా చేయలేకపోతున్నా. కాఫీ విత్ కరణ్ ఇంటర్వ్యూ నన్ను ఎంతో భయపెట్టింది. స్కూల్లో నేనెప్పుడూ సస్పెండ్ కాలేదు. కానీ ఆ ఇంటర్వ్యూ తర్వాత జీవితంలో తొలిసారి శిక్షకు గురి కావాల్సి వచ్చింది. దానిని ఎలా ఎదుర్కోవాలో తెలియలేదు. అదిప్పటికీ మాయని మచ్చలా మిగిలింది' అని రాహుల్ అన్నాడు.

తొలిరోజు హైదరాబాద్ రేసర్లకు నిరాశ

చెన్నై: మద్రాస్ ఇంటర్నేషనల్ రేసింగ్ సర్క్యూట్‌లో ఫార్ములా-4 కార్లు రయ్.. రయ్ మంటూ దూసుకెళ్లాయి. శనివారం ఇక్కడ ప్రారంభమైన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) తొలిరోజు పోటీల్లో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టు రేసర్లు నిరాశపర్చారు. ఒక దశలో ముందంజలో నిలిచిన హైదరాబాద్ డ్రైవర్ హ్యూ బార్టర్ మధ్యలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో బెంగళూరు స్పీడ్ స్టార్స్ రేసర్ జాడెన్ పరియట్‌ను విజయం వరించింది. ఇక, ఫార్ములా-4 ఎ-లెవల్ ఆరంభ రేసులో ఇంగ్లండ్ రేసర్ జోన్ లాంకాస్టర్ విజేతగా నిలిచాడు.

బిజినెస్

బంగారం, వెండి ఆభరణాల ఎగుమతిపై డ్రాబ్యాక్ రేట్లు సగానికి పైగా తగ్గింపు

న్యూఢిల్లీ: పసిడి, వెండి ఆభరణాల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం డ్రాబ్యాక్ రేట్లను సగానికి పైగా తగ్గించింది. ఈసారి బడ్జెట్లో కేంద్రం ఈ విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. ఈ సవరణకు అనుగుణంగా డ్రాబ్యాక్ రేట్లనూ తగ్గించింది. రెవెన్యూ శాఖ శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. స్వర్ణాభరణాల్లో నికర బంగారంపై గ్రాముకు డ్రాబ్యాక్ రేటు రూ.704.1 నుంచి రూ.335.5కు తగ్గించారు. వెండి ఆభరణాలు, వెండి ఆర్టికల్స్‌లో నికర లోహంపై డ్రాబ్యాక్ రేటును కిలోకు రూ.4,468కి తగ్గించారు. ఈసారి బడ్జెట్లో గోల్డ్, సిల్వర్‌పై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,040 ▲	66,950 ▲	93,000 ▲
ముంబై	71,424 ▼	65,424 ▼	84,615 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	104
కర్నూలు	109	నెల్లూరు	104
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

విదేశీ విస్తరణపై జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఫోకస్

సౌదీ, కువైట్ ప్రాజెక్టుల కోసం బిడ్డింగ్



రూ.5,000 కోట్ల సమీకరణ

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మార్కెట్ నుంచి ఒకే సారి లేదా పలు విడతల్లో రూ.5,000 కోట్లు సమీకరించనుంది. సెక్యూరిటీల జారీ, క్యూఐపీ లేదా ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ జారీ ద్వారా ఈ నిధులను సేకరించాలని భావిస్తోంది. వ్యాపార విస్తరణతో పాటు ప్రస్తుత విమానాశ్రయాల కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు ఈ నిధులను వినియోగించుకోవాలని యోచిస్తోంది.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో రెండో అతిపెద్ద విమానాశ్రయాల నిర్వహణ సంస్థ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. విదేశీ విస్తరణపై దృష్టి సారించింది. సౌదీ అరేబియా, కువైట్‌కు చెందిన రెండు ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులను దక్కించుకునేందుకు పోటీపడుతోంది. కువైట్ ఎయిర్‌పోర్ట్‌లో టెర్మినల్ 2 కోసం బిడ్‌తో పాటు సౌదీ అరేబియాలోని అబా ఎయిర్‌పోర్ట్ కోసం రెక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్ (ఆర్ఎఫ్‌క్యూ) డాక్యుమెంట్‌ను సమర్పించింది. కువైట్ ఎయిర్‌పోర్ట్ విషయానికొస్తే, 10 ఏళ్ల కార్యకలాపాల నిర్వహణ బాధ్యతలకు సంబంధించిన కాంట్రాక్టు అని, తమతో పాటు మరో ఇద్దరూ ఈ ప్రాజెక్ట్ కోసం పోటీపడుతున్నారని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సీఈఓ (బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ కమర్షియల్) రాజేశ్ అరోరా తెలిపారు. సౌదీ ప్రాజెక్టు కోసం ఆర్ఎఫ్‌క్యూ సమర్పించామని, అందులో అర్హత లభించాక తదుపరి దశలోకి ప్రవేశిస్తామన్నారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టామని ఈ మధ్య జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల అనంతరం ఇన్వెస్టర్లతో నిర్వహించిన ఎర్నింగ్స్ కాల్‌లో అరోరా వెల్లడించారు.

2014లోనే అంతర్జాతీయ మార్కెట్లోకి..

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ దేశీయంగా ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్వహిస్తుండటంతో పాటు ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తోంది. ఏటా 60 లక్షల మందికి సేవలందించగలిగే సామర్థ్యంతో నిర్మిస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ 2026 మార్చికల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా, ఫిలిప్పీన్స్‌లోని మక్టన్-సెబూ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి, నిర్వహణ ప్రాజెక్టును ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా చేజిక్కించుకోవడం ద్వారా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ 2014లో తొలిసారిగా అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఇండోనేషియాలోని కౌలానము ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను సైతం జాయింట్ వెంచర్ ద్వారా దక్కించుకుంది. గ్రీస్‌లోని క్రీట్ ఎయిర్‌పోర్ట్ జీఎంఆర్‌కు లభించిన మూడో విదేశీ ప్రాజెక్టు.

కాగా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జీఎంఆర్ నిర్వహణలోని విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ వార్షిక ప్రాతిపదికన 20 శాతం పెరిగి 12.08 కోట్లకు చేరుకుంది. కాగా, విమానాల ట్రాఫిక్ 12 శాతం పెరుగుదలతో 7,81,500గా నమోదైంది. అంతేకాదు, 2023-24లో స్థూల ఆదాయం 27 శాతం వృద్ధితో రూ.9,210 కోట్లకు పెరిగింది.

ఆకాశ ఎయిర్‌లోకి ప్రేమ్‌జీ పెట్టుబడులు!?

న్యూఢిల్లీ: దివంగత ఇన్వెస్టర్ రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా కుటుంబం మెజారిటీ వాటా కలిగిన ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీతో పాటు మణిపాల్ గ్రూప్‌నకు చెందిన రంజన్ పాయ్ స్వల్ప వాటాలు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటా విక్రయం ద్వారా 12.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,050 కోట్లు) వరకు సమీకరించేందుకు అజీమ్ ప్రేమ్‌జీ వ్యక్తిగత పెట్టుబడి సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌తో పాటు పాయ్‌కి చెందిన క్లేపాండ్ క్యాపిటల్‌తో ఆకాశ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఆకాశ ఎయిర్‌లో ఝున్‌ఝున్‌వాలా కుటుంబం, సీఈఓ వినయ్ దూబేకు కలిపి 65 శాతం వాటా ఉంది. ప్రస్తుతం 24 విమానాలతో 27 నగరాలకు విమానయాన సేవలందిస్తోన్న ఆకాశ ఎయిర్.. 4.7 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.

పబ్లిక్ ఇష్యూకి హీరో మోటార్స్

రూ. 900 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: హీరో మోటార్స్ కంపెనీ (హెచ్ఎంసీ) గ్రూప్ ఆటో కాంపోనెంట్స్ సంస్థ హీరో మోటార్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఈ ఇష్యూలో భాగంగా కొత్త ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా రూ.500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. అలాగే ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూ.400 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఓఎఫ్ఎస్‌లో భాగంగా ఓపీ ముంజాల్ హోల్డింగ్స్ రూ.250 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుండగా భాగ్యోదయ్ ఇన్వెస్ట్‌మెంట్స్, హీరో సైకిల్స్ చెరో రూ.75 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నాయి. తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరించిన మొత్తాల్లో రూ.202 కోట్లను రుణ చెల్లింపుల కోసం వినియోగించనుండగా రూ.125 కోట్లను ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం వెచ్చించనుంది.

కరారో ఇండియా రూ.1,812 కోట్ల ఐపీఓ

ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ తయారీ కంపెనీ కరారో ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1,812 కోట్ల మొత్తాలను సమీకరించేందుకు రెడీ అవుతోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా ఉండనుంది. కరారో ఎస్‌పీఏ అనుబంధ సంస్థగా 1997లో కరారో ఇండియా ఏర్పాటైంది. ప్రస్తుతం కంపెనీ మహారాష్ట్రలోని పుణెలో రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది.

యాక్సిస్ ఎంఎఫ్.. యాక్సిస్ కన్సంప్షన్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ కన్సంప్షన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది కన్సంప్షన్ థీమ్‌తో తీసుకువచ్చిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 6.

బంధన్ ఎంఎఫ్.. బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. ఫార్మాస్యూటికల్స్, హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్స్, బయోటెక్నాలజీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ విభాగాలతో కూడిన హెల్త్‌కేర్ ఇండెక్స్‌లోని కంపెనీల వృద్ధి అవకాశాలను మదుపరులు చేజిక్కించుకునే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 3.

ఐటీఐ ఏఎంసీ.. లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్

ఐటీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐటీఐ ఏఎంసీ).. ఐటీఐ లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్‌ను తీసుకువచ్చింది. టాప్ 250 కంపెనీలతో కూడిన ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారు కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 4.

జీఎస్‌టీఆర్-1ఏ రిటర్న్ అంటే ?

ఇదీ GST



రాంబాబు గొండాల

వస్తు సేవల పన్ను కింద నమోదైన వ్యాపారస్తులు అందరికీ జీఎస్‌టీఆర్-1 రిటర్న్ అంటే అవగాహన ఉంటుంది. ఒక వ్యాపారి తాను జరిపిన అమ్మకాలు లేదా సరఫరాల తాలుకు వివరాలను ఈ జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ వివరాలను బట్టి తదుపరి దాఖలు చేసే జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ద్వారా పన్ను చెల్లింపులు చేస్తాడు. అలాగే జీఎస్‌టీఆర్-1లో ఇచ్చే వివరాలను బట్టే అవతలి వ్యక్తి అంటే కొనుగోలుదారుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకుంటాడు. కాబట్టి ఈ రిటర్న్ ఎంతో ముఖ్యమైనది. అయితే జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో పొరపాటున తప్పుడు వివరాలు ఇస్తే, సవరణ చేయటానికి ఇప్పటి వరకు ఎలాంటి సౌలభ్యం లేదు. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నెల నుంచి కొత్త జీఎస్‌టీఆర్-1ఏ అనే రిటర్న్‌ను ప్రవేశపెట్టింది. ఈ వివరాలు మీ కోసం..

జీఎస్‌టీఆర్-1ఏ అనేది సవరింపు కోసం ఉద్దేశించినది కాబట్టి, ఇది తప్పనిసరిగా దాఖలు చేయాలనే నియమం ఏమీ లేదు. అవసరాన్ని బట్టి దాఖలు చేయవచ్చు. అలాగే ఇది జూలై నెల నుంచి అమల్లోకి వస్తుంది. అంటే జూలై నెలకి సంబంధించి దాఖలు చేసిన జీఎస్‌టీఆర్-1లో ఏదేనీ సవరణలు చేయాలంటే ఈ కొత్త రిటర్న్ ద్వారా చేసుకోవచ్చు. ఈ రిటర్న్ అనేది జీఎస్‌టీఆర్-1 దాఖలు చేయటానికి గడువు తేదీ లేదా దాఖలు చేసిన తేదీ.. ఈ రెండింటిలో ఏది వెనకైతే అప్పటి నుంచి సదరు వ్యక్తికి అందుబాటులో ఉంటుంది. ఉదాహరణకు జూలై నెలకు సంబంధించి జీఎస్‌టీఆర్-1 దాఖలు చేయటానికి గడువు తేదీ ఆగస్టు 11. ఒక వ్యాపారి తన జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌ను ఆగస్టు 14న దాఖలు చేశాడనుకుంటే.. ఈ రెండు తేదీల్లో చివరి తేదీ ఆగస్టు 14 కాబట్టి, ఈ తేదీ నుంచి ఈ కొత్త రిటర్న్ సదరు వ్యక్తి స్క్రీన్‌లో లభిస్తుంది. అలాగే ఈ రిటర్న్ దాఖలు చేయటానికి గడువు తేదీ ఏదీ లేకున్నా, జీఎస్‌టీఆర్-3బీ దాఖలు చేస్తే మాత్రం, జీఎస్‌టీఆర్-1ఏ దాఖలు చేయలేరు. అలాగే ఇందులో ఈ నెలకు సంబంధించిన సవరణలు మాత్రమే చేయగలరు. అంటే, ఇంతకు ముందు నెలకు సంబంధించిన సవరణలు ఈ నెల రిటర్న్‌లో చేయలేరు. సాధారణ సరఫరా వివరాలతో పాటుగా క్రెడిట్ నోట్, డెబిట్ నోట్ వివరాలను కూడా ఇందులో పొందుపరచవచ్చు. ఒకసారి, జీఎస్‌టీఆర్-1ఏ దాఖలు చేసిన తర్వాత తదనుగుణంగా జీఎస్‌టీఆర్-3బీ లో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. అయితే ఈ సవరించిన వివరాలు, కొనుగోలుదారుని జీఎస్‌టీఆర్-2బీ లో మాత్రం తరువాతి నెలలో కనిపిస్తాయి.

ఇదే విధంగా త్రైమాసిక జీఎస్‌టీఆర్-1 రిటర్న్ దాఖలు చేసే వారికి కూడా ఈ కొత్త రిటర్న్ అందుబాటులో ఉంటుంది. ఏది ఏమైనా జీఎస్‌టీఆర్-1ఏ అనేది జీఎస్‌టీలో నమోదైన వారికి ఒక మంచి అవకాశం అని చెప్పవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

వైసీపీ పాలనలో పరిశ్రమల భద్రత గాలికి

గత ఐదేళ్లలో సేఫ్టీ ఆడిట్‌లు జరగలేదు

▸▸ ఫార్మా ప్రమాదాలపై ఉన్నతస్థాయి కమిటీలు: హోంమంత్రి అనిత



అనకాపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఫార్మా పరిశ్రమల్లో భద్రతా చర్యలను గాలికొదిలేశారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. అనకాపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించినా.. బాధితులకు పరిహారం ఇవ్వకపోతే ధర్నా చేస్తానని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన బాబాయ్ కేసును తేల్చాలని ఢిల్లీలో ధర్నా చేస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై, అధికారులపై బురదచల్లే ప్రయత్నంలో భాగంగానే జగన్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ వద్ద తీసుకున్న రూ.150 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని జగన్‌ను నిలదీశారు. రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుచేస్తామని జగన్ ప్రకటించారని, అక్కడ బోర్డులు తప్ప ఏమీ లేవని చెప్పారు. ఎసెన్షియా ప్రమాదంలో మృతిచెందిన 17 మంది కుటుంబీకులకు, 36 మంది క్షతగాత్రులకు ఆర్‌టీజీఎస్ ద్వారా డబ్బులు పంపామని తెలిపారు. వైసీపీ పాలనలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఫార్మా కంపెనీలతో ఉన్న లాలూచీల కారణంగానే ఫార్మా కంపెనీల్లో భద్రతా చర్యలు గాలికొదిలేశారని హోంమంత్రి ఆరోపించారు. 253 ఫార్మా కంపెనీల్లో 224 రెడ్ జోన్‌లో, 29 ఆరెంజ్ జోన్‌లో ఉన్నాయన్నారు. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటుచేసి వాస్తవాలు తెలుసుకుంటామన్నారు.

ఎసెన్షియా బాధితులకు వైసీపీ ఆర్థిక సాయం: బొత్స

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లోని ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.ఐదు లక్షలు, గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి వైసీపీ తరఫున రూ.లక్ష చొప్పున సాయం అందజేయనున్నట్లు శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. తమ పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు సాయం అందజేయనున్నట్లు తెలిపారు.

'ఎసెన్షియా' ఎండీని అరెస్టు చేయాలి: సీపీఐ

రాంబిల్లి, ఆగస్టు 24: ఫార్మా కర్మాగారాల్లో జరిగే ప్రమాదాలకు కంపెనీ యజమానులను బాధ్యులను చేసి, అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో గల 'ఎసెన్షియా' కర్మాగారాన్ని శనివారం ఆయన పరిశీలించారు. కంపెనీ ప్రధాన ద్వారం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపట్టి, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎసెన్షియా కంపెనీ ఎండీని, పాలకవర్గాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది క్షతగాత్రులను ఆయన పరామర్శించారు.

జగన్‌వి శవ రాజకీయాలు: పల్లా



విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎసెన్షియా' ఫార్మా ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వచ్చిన జగన్ దిగజారుడు రాజకీయాలతో ఇష్టారీతిన అబద్ధాలు వల్లెవేశారని మండిపడ్డారు. మంత్రులు ఘటనా స్థలానికి వెళ్లలేదని జగన్ వ్యాఖ్యానించడం పట్ల అభ్యంతరం తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై అన్ని చర్యలూ తీసుకుందని, 45 నిమిషాల్లో కలెక్టర్ కర్మాగారానికి వెళ్లారని గుర్తుచేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందజేస్తామని సీఎం ప్రకటించారని, లీగల్ హెయిర్ ఎవరో నిర్ధారణ కాకుండా చెక్కులు ఇవ్వకూడదని వైసీపీ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమల నిర్వహణపై తీవ్ర అలసత్వం, నిర్లక్ష్యం చూపిందని, దాని ఫలితమే ఎసెన్షియాలో ఘోర ప్రమాదమని పల్లా వ్యాఖ్యానించారు.

24 గంటల్లోనే హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబు

ఇద్దరికి ఎలక్ట్రిక్ స్కూటర్లు అందజేసిన కలెక్టర్

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమలలో ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీ సందర్భంగా తనకు ఇల్లు లేదని మొరపెట్టుకున్న వృద్ధురాలైన ఓబులమ్మకు పక్కా ఇల్లు మంజూరు చేసి, మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వానపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఇచ్చిన హామీని 24 గంటల్లోనే అమలు చేశారు. గ్రామసభలో పాల్గొన్న ఓ దివ్యాంగుడు, ఆర్థికంగా వెనుకబడ్డ మరో యువకుడు తమకు ఎలక్ట్రిక్ స్కూటర్లు అందిస్తే తమ జీవనోపాధికి, ఇతర పనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చంద్రబాబుకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన సీఎం తక్షణమే వారికి ఎలక్ట్రిక్ స్కూటర్లు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు అమలాపురం కలెక్టరేట్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సంగంపాలెంకు చెందిన దివ్యాంగుడు యిళ్ల భగవాన్, వాడపాలానికి చెందిన చింతపల్లి నాగమల్లేశ్వరకిరణ్‌కు ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షల విలువైన ఎలక్ట్రిక్ స్కూటర్లను కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ అందజేశారు. తాము అడిగిన వెంటనే సీఎం ఎలక్ట్రిక్ స్కూటర్లు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొంటూ.. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, అమలాపురం



స్కూటర్లను అందిస్తున్న కలెక్టర్ మహేశ్‌కుమార్

వెంకన్నా... ఇదేం విచారణ?



(మొదటి పేజీ తరువాయి)

సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు సీఎస్, డీజీపీ, సీఐడీ, ఏసీబీ, విజిలెన్స్ విభాగాల అధిపతులకు పలువురు నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో జగన్ ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు అక్రమాల నిగ్గు తేలుస్తారని అంతా భావిస్తే.. కొత్త సమస్య పుట్టుకొచ్చింది. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన టీటీడీ ముఖ్యులకు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. పెద్దలను విచారించకుండా విజిలెన్స్ విచారణలో ఏమి తేలుస్తుందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఆరోపణలు ఎదుర్కొన్న ముఖ్యుల జోలికి వెళ్లకుండా విచారణ పేరిట తమను వేధిస్తున్నారంటూ ఉద్యోగులు రగిలిపోతున్నారు.

ఇవీ ఆరోపణలు

గత ఐదేళ్ల పాటు కొండపై చక్రం తిప్పిన అదనపు ఈవో ధర్మారెడ్డి టీటీడీ పాలనలో కీలక పాత్ర పోషించారు. పలు విషయాల్లో ఆయన నిర్ణయాలే ప్రభుత్వ ఆదేశాలుగా చెలామణి అయ్యాయి. అలాగే బోర్డు చైర్మన్లుగా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి గతంలో ఏ చైర్మన్ వ్యవహరించని రీతిలో అధికారం చెలాయించారు. ఈ ముగ్గురూ నిబంధనలకు విరుద్ధంగా అనేక నిర్ణయాలు తీసుకుని, విభాగాల అధికారులతో బలవంతంగా అమలు చేయించారనే ఆరోపణలున్నాయి. ఉదాహరణకు ఇంజనీరింగ్ పనులకు ఏటా బడ్జెట్‌లో రూ.300 కోట్లకు మించి కేటాయింపులు జరిపిన దాఖలాలు టీటీడీ చరిత్రలోనే లేవు. అలాంటిది వైసీపీ హయాంలో రూ.3 వేల కోట్లకు పైగా నిధుల కేటాయింపులు జరిగాయి. తిరుపతిలో గోవిందరాజ స్వామి సత్రాలను అంతకుముందే ఆధునీకరించినా వాటిని కూలదోసి కొత్తగా నిర్మించేందుకు రూ.600 కోట్లు కేటాయించడం వెనుక సొంత ప్రయోజనాలున్నాయనే ఆరోపణలున్నాయి. స్విమ్స్ భవనాలు చాలా దృఢంగా ఉన్నా వాటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టడం వెనుక కూడా ముడుపుల కథ ఉన్నట్టు విమర్శలు వచ్చాయి. మొత్తమ్మీద అవసరం లేకపోయినా రూ.1800 కోట్ల నిధులు కేటాయించి, కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటన్నింటికీ ఈ ముగ్గురే మూల కారకులనే విమర్శలు వచ్చాయి. ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి తమకున్న విచక్షణాధికారాలను అడ్డు పెట్టుకుని దర్శనాల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. శ్రీవాణి ట్రస్టు నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. రెవెన్యూ విభాగంలో షాపులు, తట్టల (హాకర్స్) విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని పోస్టుల నియామకాల్లో నిబంధనలు పాటించలేదని, కొండపై మఠాలకు సంబంధించి ఆక్రమణలు జరిగితే వాటిని క్రమబద్ధీకరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇదీ విచారణ తీరు..

టీటీడీ ముఖ్యులపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం గత జూన్ చివరిలో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. 45 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక అందజేయాలని స్పష్టంచేసింది. గుంటూరు నుంచి విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో 47 మందితో భారీ విచారణ బృందాన్ని నియమించింది. వీరిలో 25 మంది ప్రధానంగా విచారణ బాధ్యతలు చేపట్టారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఈఈ, డీఈ స్థాయి అధికారులు ఆరుగురు, జిల్లా కమర్షియల్ టాక్స్ అధికారి ఒకరు, డీసీటీవో స్థాయి అధికారులు నలుగురు ఈ బృందంలో ఉన్నారు. నిర్దేశించిన 45రోజుల గడువు దాటిపోయినా విచారణ పూర్తికాలేదు. అంతేగాక ఈ బృందం విచారణ తీరు వివాదాస్పదం అవుతోంది. ఆరోపణలు ఎదుర్కొన్న ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిని విచారించకపోగా కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. ఈలోగా టీటీడీ పరిపాలనా భవనంలో కొన్ని ఫైళ్లు దగ్ధం కావడం విమర్శలపాలైంది. టీటీడీ వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకునే హోదాలో ఉన్న వారిని విస్మరించిన విజిలెన్స్ అధికారులు... విభాగాల అధికారులు, ఉద్యోగులపై దృష్టి సారించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఏకంగా 51మంది అధికారులకు నోటీసులు జారీచేశారు. ఇతర విభాగాలకు చెందిన మరో ఏడుగురికి కూడా ఇదే విధంగా నోటీసులు జారీ చేశారు. విజిలెన్స్ బృందం అదనపు ఈవో కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి కొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో నిధుల కేటాయింపులు, చేపట్టిన పనుల వివరాలు సేకరించారు. మార్కెటింగ్ విభాగంలో నాసిరకం ముడిసరుకులు కొనుగోలు చేశారన్న ఆరోపణలపైనా విచారణ జరిపారు. కొన్ని మఠాలు కేటాయించిన భూమి కంటే ఎక్కువగా ఆక్రమించుకుని, అనధికారిక నిర్మాణాలు చేపట్టాయన్న దానిపైనా దృష్టి పెట్టారు. శ్రీవాణి ట్రస్టు టికెట్ల జారీమీద కూడా లోతుగా విచారణ సాగలేదని అంటున్నారు. మిగిలిన అంశాల్లో విజిలెన్స్ అధికారులు పెద్దగా సాధించింది ఏమీ లేదని తెలుస్తోంది.

అధికారులపై నిఘా

విజిలెన్స్ అధికారుల విచారణ తుది దశకు చేరుకోవడంతో నివేదిక రూపొందించడంలో వారు బిజీగా ఉన్నారు. బృందంలో ఖాళీగా ఉన్న సిబ్బందిని తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో విభాగాల అధికారులపై నిఘాకు నియమించారనే ప్రచారం జరుగుతోంది. ఆయా విభాగాల్లోకి ఎవరెవరు వస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? దేని గురించి చర్చిస్తున్నారు? అన్న దానిపై దృష్టి సారించినట్టు సమాచారం.

మాచర్లలో శ్మశాన భూమీ కబ్జా

400 సమాధులు కూడా ధ్వంసం

▸▸ పిన్నెల్లి అనుచరుల ఆక్రమణలపై ఫిర్యాదు

▸▸ టీడీపీ ఆఫీసుకు బాధితుల తాకిడి.. సమస్యలపై వినతులు



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బినామీ రామవరపు శంకరమూర్తి, మరికొందరు కలిసి తమ శ్మశాన భూమిని ఆక్రమించారని మాచర్ల వడ్డెర సంక్షేమ సంఘం ఆరోపించింది. సంఘం ప్రతినిధులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాము శ్మశానం కోసం కొనుక్కున్న భూమిని మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించారని, 400 సమాధులు కూడా ధ్వంసం చేశారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే తమపైనే ఎదురు కేసులు పెట్టి వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రజా వినతుల కార్యక్రమంలో భాగంగా శనివారమిక్కడ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు ఫిర్యాదులు స్వీకరించారు. వైసీపీకి చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో వైసీపీ నేతలు తన భూమిని కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం పులిచెర్లకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి సోదరుడు జగన్నాథరెడ్డి తనను తన భూమిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని, దీనిపై విచారణ జరిపి తన భూమి తనకు దక్కేలా చూడాలని ఆమె కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు బంధువని చెప్పుకొంటున్న వైసీపీ నేత ఒకరు తన భూమిని కబ్జా చేశారని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం హెచ్ నిడమానూరుకు చెందిన సుగుణ ఫిర్యాదు చేశారు. తన భర్తకు వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేత నల్లమలుపు కృష్ణారెడ్డి (బుల్లెట్ కృష్ణారెడ్డి) కబ్జా చేశారని, ఆయనపై చర్యలు తీసుకొని తమ భూమి తమకు ఇప్పించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు తమ భూమిని కబ్జా చేశారని గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శివలీల ఫిర్యాదు చేశారు. గన్నవరం మండలం ముస్తాబాద్‌లో యనమండల సీతారామాంజనేయ స్వామి ఆలయానికి చెందిన 16 ఎకరాల భూమి కబ్జాకు గురైందని, దానిని విడిపించాలని ఆ గ్రామస్థులు కోరారు. వైసీపీకి చెందిన వారు తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నారని, ప్రశ్నిస్తే తనపైనే అక్రమ కేసులు పెట్టారని గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన వెంకాయమ్మ ఫిర్యాదు చేశారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.21 వేలు చెల్లిస్తున్నారని.. ప్రభుత్వ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న తమకు మాత్రం ప్రాంతాన్ని బట్టి రూ.9వేల రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని కొందరు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 5వేల పురుష హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్ల నిరుద్యోగ సంఘం ప్రతినిధులు కోరారు.

అమరావతిలో 4 మెగా పార్కులు



- 500 ఎకరాల్లో వాటర్ లేక్స్: మంత్రి నారాయణ
- రాజధానిలో నర్సరీలు, పార్కుల పనుల పరిశీలన

విజయవాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఆహ్లాదకరమైన ఉద్యానవనాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధానికి వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచేందుకు బ్లూ, గ్రీన్ కాన్సెప్ట్‌తో పర్యాటక ప్రాజెక్టులను చేపట్టే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. శనివారం ఆయన, అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) సీఎండీ లక్ష్మీపార్థసారథి భాస్కర్.. ఏడీసీ అభివృద్ధి చేసిన వెంకటపాలెం నర్సరీ, శాఖమూరు సెంట్రల్ పార్కులను పరిశీలించారు. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. రాజధానిలో 4 పెద్ద పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న ఆరు నెలల్లో వీటిని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. శాఖమూరులో 300 ఎకరాల్లో సెంట్రల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్(లండన్), సింగపూర్‌కు చెందిన నిష్ణాతులతో అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. 'అమరావతిలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో బ్లూ అండ్ గ్రీన్ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేశాం. హైదరాబాద్ మహానగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన సీనియర్ అధికారికి ఈ ప్రాజెక్టుల అభివృద్ధి బాధ్యతలను అప్పగించాం. శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో సుందరమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పర్యాటక కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతాం. శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు అనువుగా 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీరుకొండలో 500 ఎకరాల్లో వాటర్ లేక్స్ ఏర్పాటుకు సన్నద్ధం చేస్తున్నాం. కొండవీటివాగు, పాలవాగు గ్రావిటీ కెనాల్ వంటి నీటి ప్రాజెక్టుల వెంబడి 20, 30 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం. అనంతవరంలో 35 ఎకరాల్లో ఉద్యానవనం, రాష్ట్ర సచివాలయం ముందు 21 ఎకరాల్లో మల్కాపురం పార్కులను ఏర్పాటు చేసి వీటిలో విభిన్న రకాల మెడిసిన్ ప్లాంట్లను పెంచుతున్నాం' అని వివరించారు. అమరావతిలో ఏడీసీ ఆధ్వర్యంలో 360 కిలోమీటర్ల మేర సువిశాలమైన రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. రూ.41 వేల కోట్ల వ్యయంతో ముఖ్యమైన మౌలిక వసతులైన వాటర్ లైన్లు, ఐసీటీ, విద్యుత్, గ్యాస్, వాటర్ డ్రెయిన్లు, నీటిపారుదల వ్యవస్థల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 5,100 కోట్లు ఖర్చుచేశామని.. వైసీపీ హయాంలో అమరావతి ముళ్లకంపతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ముళ్ల కంపలను తొలగించడానికి రూ.36.50 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన రాజధాని ప్రాజెక్టుల స్థితిగతులపై మద్రాస్ ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీ బృందాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించాయని.. నిర్మాణాల నాణ్యతకు సంబంధించి సెప్టెంబరు మొదటి వారంలో నివేదిక ఇస్తాయని చెప్పారు.

డిసెంబరు 1 నుంచి అమరావతి పనులు

- నిర్మాణానికి రూ.60 వేల కోట్లు: నారాయణ
- వెళ్లిపోయిన సంస్థలు తిరిగి రావాలి: కేంద్ర సహాయ మంత్రి వర్మ

కంకిపాడు, ఆగస్టు 24: రాజధాని అమరావతి నిర్మాణ పనులు డిసెంబరు 1న ప్రారంభమయ్యే అవకాశం ఉందని పురపాలక-పట్టణాభివృద్ధి మంత్రి పి. నారాయణ వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి రూ.60 వేల కోట్లు ఖర్చు కావచ్చని అంచనా అని.. ప్రపంచ స్థాయిలో నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతామని.. నాలుగేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. శనివారం కృష్ణా జిల్లా కంకిపాడులో జరిగిన క్రెడాయ్ సౌత్‌కాన్-2024 సమావేశంలో ఆయన, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడారు. అమరావతితోపాటు సమాంతరంగా 26 జిల్లాలనూ అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని నారాయణ తెలిపారు. అమరావతి అభివృద్ధికి క్రెడాయ్ సహకరించాలని కోరారు. బిల్డర్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా లేఅవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులను సులభతరం చేస్తామని, సింగిల్ విండోలో ఇవ్వడానికి కృషిచేస్తామని, ఆన్‌లైన్ వ్యవస్థను సరళీకరిస్తామని చెప్పారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అదృష్టమని శ్రీనివాస వర్మ అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఈ రెండు నెలల్లో ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు 13 మంది కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశారని తెలిపారు. రాజధాని అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరిన వెంటనే కేంద్రం రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వెళ్లిపోయిన నిర్మాణ రంగ సంస్థలు రాష్ట్రానికి తిరిగి రావాలని పిలుపిచ్చారు. తమ సమస్యలపై క్రెడాయ్ ప్రతినిధులు నిర్మలాసీతారామన్‌తో పాటు కేంద్ర మంత్రులతో చర్చించే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. బిల్డర్ల సమస్యలను క్రెడాయ్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల శివారెడ్డి మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పెనమలూరు, విజయవాడ తూర్పు, సెంట్రల్ ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, బొండా ఉమ, క్రెడాయ్ అఖిల భారత అధ్యక్షుడు బొమన్ ఇరానీ, మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు శ్రీధరన్ స్వామినాథన్, జి.రామిరెడ్డి, రాజు శ్రీనివాసు, ప్రవీన్, ప్రదీప్, ఆళ్ల శివారెడ్డి, యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ హెడ్ ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక... మరింత సులభంగా!

- 34 ఇసుక బుకింగ్ కేంద్రాలు ప్రారంభం
- ఇసుక అక్రమాల ఫిర్యాదులపై కేసులు: మీనా

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పంపిణీని మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం బుకింగ్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. శనివారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 34 ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 62 ఇసుక స్టాక్‌యార్డ్‌లు ఉండగా, బుకింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవల గనుల శాఖను ఆదేశించారు. స్టాక్ యార్డుల వద్దే ఇసుక బుకింగ్, లోడింగ్ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఇసుక బుక్ చేసుకున్న వారితో పాటు ఇతరులు కూడా యార్డ్ వద్దకు లారీలను తీసుకొచ్చి క్యూలో ఉంచడంతో గందరగోళం నెలకొంటోంది. మరోవైపు రోజుల తరబడి లారీలు నిలిపి ఉంచడంతో వినియోగదారులపై వెయిటింగ్ చార్జీల భారం పడుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక కేంద్రాలు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. మరోవైపు బుకింగ్ ఉన్న లారీలు పర్మిట్ స్లిప్ తీసుకొని స్టాక్‌యార్డుకు వెళ్లాలని, పర్మిట్లు లేనివి క్యూలో ఉండటానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత రెండు రోజులుగా గనుల శాఖ ఈ మేరకు చర్యలు చేపడుతోంది. బుకింగ్ చేసుకున్న వినియోగదారులకే పర్మిట్ స్లిప్‌లు ఇస్తున్నారు. వాటిని మాత్రమే స్టాక్‌యార్డుల వద్దకు అనుమతిస్తున్నారు. దీంతో గందరగోళం తగ్గిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా వెయిటింగ్ చార్జీల భారం వినియోగదారులపై పడకుండా చర్యలు తీసుకున్నామని గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. శనివారం ఒక్కరోజే 34 కేంద్రాల్లో 1,879 ఇసుక బుకింగ్‌లు(29,825 టన్నులు) జరిగాయని చెప్పారు. ఇసుక అక్రమాల ఫిర్యాదులపై కేసులు నమోదుచేసి, 6 వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు.

ఫార్మా ప్రమాదాల నివారణకు చర్యలు: కేంద్ర మంత్రి

రాంబిల్లి, ఆగస్టు 24: ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్టు కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. శనివారం అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిసి అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులు, కంపెనీ యాజమాన్యంపై ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రమాదాలు జరగకుండా కేంద్రం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనుందని తెలిపారు.

ఒక 'కిక్కు' కథ!



(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేసింది మాత్రం కసిరెడ్డే. తెరముందు వాసుదేవ రెడ్డి చక్రం తిప్పితే, తెరవెనుక వేల కోట్ల నగదును నాటి సర్కారు పెద్దల శిబిరానికి చేర్చిన ఘనుడు కసిరెడ్డి. విచిత్రం ఏంటంటే ఇంత చేసినా ఆయన ముఖం కూడా చాలా కంపెనీల ప్రతినిధులకు తెలియదు. 'కమీషన్ సొమ్ము ఫలానా చోటికి పంపండి' అని ప్రకాశ్ అనే వ్యక్తి నుంచి వాళ్లకు ఫోన్ వస్తుంది. ఈ 'ప్రకాశ్' ఎవరు, ఎలా ఉంటారో కూడా వారికి తెలియదు. ప్రతిసారీ కొత్త వ్యక్తులు వచ్చి డబ్బు సంచులు తీసుకెళతారు. ఇంత పక్కాగా మొత్తం దందా నడిపించారు. ఐదేళ్ల కాలంలో రూ.3వేల కోట్లకుపైగా నగదు వసూలు చేసిన వారిని ఎవరూ గుర్తించలేకపోయారు.

అటు ఇచ్చి... ఇటు వసూలు

వైసీపీ ప్రభుత్వంలో 2020 జనవరి నుంచి కమీషన్ల వ్యవహారం ప్రారంభమైంది. మద్యం ఉత్పత్తి చేసే కంపెనీలు వారి మద్యాన్ని ఏపీలో అమ్మాలంటే ఒక కేసు లిక్కర్‌కు రూ.200, బీరుకు రూ.50 కప్పం కట్టాలి. అయితే అదేం కంపెనీల సొంత డబ్బు కాదు. వారు ఎంత కమీషన్ చెల్లిస్తున్నారో, అంత మొత్తాన్ని ఇవ్వాల్సిన దానికంటే అదనంగా ప్రభుత్వం ఆ కంపెనీలకు చెల్లిస్తుంది. ఉదాహరణకు ఒక బ్రాండ్ కేసు విలువ రూ.వెయ్యి అనుకుంటే ప్రభుత్వం ఆ కంపెనీకి రూ.1200 చెల్లిస్తుంది. అదనంగా వచ్చిన రూ.200 కసిరెడ్డికి చేరతాయి. ఇలా ఐదేళ్లలో రూ.3,113 కోట్లు వైసీపీ పెద్దలకు వెళ్లాయి.

ప్రకాశ్ కాలింగ్....

మద్యం కంపెనీల నుంచి చేసిన వసూళ్లకు కేంద్ర బిందువు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి. ఇదంతా హవాలా రూపంలో జరిగింది. ఒక కంపెనీకి ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదలైన వెంటనే ఆ కంపెనీ ప్రతినిధులకు 'ప్రకాశ్' అనే వ్యక్తి నుంచి ఫోన్ వెళ్తుంది. అమెరికా, న్యూజిలాండ్, ఆఫ్రికా దేశాల ఫోన్ నంబర్ల నుంచి ఈ ఇంటర్నెట్ కాల్స్ వస్తాయి. ఏ నంబరు నుంచి వచ్చినా ప్రకాశ్ ఒక్కడే మాట్లాడతాడు. ఫలానా రోజు, ఫలానా చోటుకు రావాలని ఫోన్‌లో చెబుతాడు. అయితే ప్రతిసారీ డబ్బులు తీసుకోవడానికి వెళ్లే మనుషులు మారిపోతారు. అసలు వారెవరో కంపెనీల ప్రతినిధులకు తెలియదు.

'కోడ్' ప్లేస్...

పోస్టాఫీసు, సూపర్ మార్కెట్, మెట్రో పిల్లర్ నంబరు ఇలా ఏదో ఒక లోకేషన్ చెబుతారు. ఫలానా సమయానికి క్యాష్ బ్యాగ్‌తో అక్కడ ఉండాలని చెబుతారు. కంపెనీ ప్రతినిధులు తమ వ్యక్తి ద్వారా నగదు పంపిస్తారు. అక్కడ రెడీగా ఉండే 'కసిరెడ్డి' మనుషులకు క్యాష్ ఇచ్చేసి వెళ్లిపోతారు. అదికూడా... సరైన వ్యక్తులకు వెళుతోందని 'కోడ్'తో నిర్ధారించుకున్నాకే! అసలు వచ్చిన వ్యక్తి ఎవరు? అతని పేరేంటి? అనే వివరాలు ఉండవు. కంపెనీ ప్రతినిధులు ప్రతినెలా కమీషన్లు ఇచ్చినా ప్రతిసారీ కొత్త వ్యక్తులకే డబ్బులు అందజేస్తారు.

సొంత బ్రాండ్లకు అప్పనంగా..

బయటి కంపెనీల నుంచి ముడుపులు వసూలు చేసిన కసిరెడ్డి.. పనిలోపనిగా సొంత బ్రాండ్ల విక్రయాలు భారీగా చేసుకున్నారు. వివిధ రకాల పేర్లతో నాలుగు రకాల బ్రాండ్లను కొత్తగా మార్కెట్‌లోకి తెచ్చారు. వీటిలోనూ కసిరెడ్డితో పాటు వైసీపీ పెద్దల పాత్ర కూడా ఉందనే ప్రచారం ఉంది. అదాన్ డిస్టిలరీకి చెందిన అదాన్స్ సుప్రీం బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీ బ్రాండ్‌కు నాలుగేళ్లలో 40,52,530 కేసుల ఆర్డర్ ఇచ్చారు. లీలా డిస్టిలరీకి చెందిన లీలాస్ బ్రిలియంట్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీకి 24,28,546, ఎస్పీవై ఆగ్రోలో తయారుచేసిన దారు హౌస్ ఎక్స్‌వో బ్రాందీకి 48,15,040, రాయల్ సింహ సుపీరియర్ విస్కీకి 10,04,924 కేసుల మేర ఆర్డర్లు ఇచ్చారు. మొత్తంగా నాలుగేళ్లలో 1.25 కోట్ల కేసుల ఆర్డర్లు ఇచ్చారు. విచిత్రం ఏంటంటే 2019కు ముందు ఈ బ్రాండ్లు రాష్ట్రంలో లేవు. అసలు ఎప్పుడు ప్రారంభించారో కూడా తెలియదు. ఈ బ్రాండ్లనే ప్రభుత్వ మద్యం షాపుల్లో ఎక్కువగా అవిష్కించి భారీగా ఆర్జించారు. అదే సమయంలో పాపులర్ బ్రాండ్లకు వేల సంఖ్యలోనే ఆర్డర్లతో సరిపెట్టారు.

ఆ బ్రాండ్లకు లక్షల సంఖ్యలో ఆర్డర్లు అందుకే..

వైసీపీ ప్రభుత్వం రాకముందు ఒక్క కేసు కూడా అమ్మని బ్రాండ్లకు ఇలా లక్షల సంఖ్యలో ఆర్డర్లు ఎందుకు ఇచ్చారు? అంటే కమీషన్ల కోసమేనని ఎవరికైనా అర్థమవుతుంది. పైగా లిక్కర్‌తో పాటు బ్రిటిష్ ఎంపైర్ గ్రాండ్ ప్రీమియం, బీరా 91 బూమ్, బ్లాక్ బస్టర్ అనే బీరు బ్రాండ్లకు కూడా పెద్దఎత్తున ఆర్డర్లు ఇచ్చి వాటినే మద్యం షాపుల్లో అమ్మించారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో 38 లిక్కర్ బ్రాండ్లు, 7 బీరు బ్రాండ్లు కొత్తగా రాష్ట్రంలోకి తీసుకొచ్చారు. వీటిని ఉత్పత్తి చేయించేందుకు రాష్ట్రంలోని ప్రముఖ డిస్టిలరీల యాజమాన్యాలను బెదిరించి వాటిని లాక్కున్నారు. విశాఖ, పీఎంకే, పెరల్, ఎస్‌వీఆర్, ఎస్పీవై ఆగ్రో లాంటి డిస్టిలరీలను పూర్తిగా చేతుల్లోకి తీసుకున్నారు.

ఆరోగ్య బీమా.. అందరికీ బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా వైద్యం పొందుతున్నారు. వీరు కాకుండా ఉద్యోగులు, పెన్షనర్లు, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న (ఏపీఎల్) ప్రజలు కలిపి 8.13 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆరోగ్య బీమా లేకుండా ఉండకూడదన్నదే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యం. 1.60 కోట్ల కుటుంబాలకు రూ.25 లక్షల బీమాను కచ్చితంగా అమలు చేయాలంటే ఆర్థికంగా చాలా భారం పడుతుంది. దాదాపు రూ.10-12 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వంపై భారం లేకుండా ప్రజలందరికీ రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించడమే హైబ్రిడ్ విధానం. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున ఏడాదికి 13 నుంచి 15 లక్షల మంది మాత్రమే వివిధ సమస్యల నిమిత్తం ఆస్పత్రులకు వెళ్తున్నారు. అందులోనూ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా వైద్యం పొందే వారిలో 95 శాతం మందికి రూ.2.50 లక్షల లోపే ఖర్చవుతోంది. మిగిలినవారిలో 3 శాతం మందికి రూ.5 లక్షల్లోపు, 2 శాతం మందికి రూ.15 లక్షల లోపు మాత్రమే వ్యయమవుతోందని అంచనా. దీని ఆధారంగా ఆరోగ్యశాఖ అధికారులు కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 1.60 కోట్ల కుటుంబాలకు రూ.2.50 లక్షల ఖర్చు వరకూ ప్రభుత్వమే బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లిస్తుంది. ఖర్చు రూ.2.50 లక్షలు దాటితే రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా వైద్యం అందిస్తుంది. అంటే ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ కార్డు ఇస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కార్డును కూడా వారు కలిగి ఉంటారు. దీని వల్ల ప్రజలందరికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఉండడంతో పాటు ప్రభుత్వంపై ఆర్థికంగా భారం కూడా తగ్గుతుంది. ఆరోగ్య బీమా నిమిత్తం సర్కారు ఏడాదికి రూ.2,500 కోట్లు ఖర్చు పెడితే సరిపోతుంది. ప్రస్తుతం ట్రస్టు ద్వారా ఇంతే మొత్తాన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఖర్చు చేస్తోంది.

ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యం..

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈహెచ్ఎస్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం వల్ల చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తున్నా వారి సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న 5.14 లక్షల మంది ఉద్యోగులు, 2.99 లక్షల మంది పెన్షనర్లు ఆరోగ్య బీమా పరిధిలోకి వస్తారు. ప్రభుత్వం వీరికి కూడా బీమా కార్డులు అందిస్తుంది. ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. వైద్యం సమయంలో వీరికి ప్రత్యేక రూం సౌకర్యం ఉండేలా, హైక్వాలిటీ మందులు వాడేలా, శస్త్రచికిత్సల సంఖ్య కూడా ఎక్కువ ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

బీమా పరిధిలోకి ఏపీఎల్

ప్రభుత్వ ఆరోగ్య బీమా పరిధిలోకి రాష్ట్రంలో 8.6 లక్షల ఏపీఎల్ జనాభా కూడా రానుంది. వీరంతా దాదాపు ప్రైవేటు ఆరోగ్య బీమాలు కలిగి ఉన్నారు. అయినా సరే ప్రభుత్వం వారికి కూడా ప్రీమియం చెల్లించి, రూ.25 లక్షల వరకూ బీమా కల్పించనుంది. అయితే 8.6 లక్షల మందికీ రూ.2.50 లక్షల వరకే బీమా సంస్థ భరిస్తుంది. మిగిలిన రూ.22.50 లక్షల బీమాకు ఎవరు భరోసా కల్పించాలన్న దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు 2-3 మార్గాలు ఆలోచించారు. ఏపీఎల్ కుటుంబాల వరకూ ప్రభుత్వం చెల్లించే ప్రీమియంను కొంత పెంచాలని నిర్ణయించారు. వారు కూడా నేరుగా కొంత మొత్తాన్ని బీమా సంస్థలకు చెల్లించే విధంగా ఆలోచన చేస్తున్నారు. దీనిపై ఇంకా కసరత్తు నడుస్తోంది.

స్విట్జర్లాండ్ విధానం బెస్ట్

అంతర్జాతీయంగా స్విట్జర్లాండ్‌లో ఆరోగ్య బీమా పకడ్బందీగా అమలవుతోంది. ఆ దేశంలో నివసించే ఏ పౌరుడైనా కచ్చితంగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి. అక్కడి ప్రభుత్వం ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.30 వేల వరకూ ప్రీమియం చెల్లిస్తుంది. వైద్యం ఖర్చు ఎంతైనా ఇక బీమా కంపెనీదే బాధ్యత. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు దీనిపై దృష్టి పెట్టారు. ఆ దేశంలో కొంత మందితో సంప్రదింపులు జరుపుతున్నారు. అక్కడి అమలు విధానంపై సీఎంకు త్వరలోనే నివేదిక ఇవ్వనున్నారు. మొత్తంగా ఆరోగ్య బీమా విషయంలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. నిబంధనలు సిద్ధం చేశాక వాటికి ప్రభుత్వం ఆమోదం తెలిపితే అధికారులు టెండర్లకు వెళ్తారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రజలంతా ఆరోగ్య బీమా పరిధిలోకి వస్తారు.

ఏటీఎంలే టార్గెట్

దాదాపు కోటి నగదు మాయం

- అనంత, చిత్తూరు, కర్ణాటకలో హరియాణా ముఠా చోరీలు



అనంతపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన దొంగల ముఠా సభ్యులు

అనంతపురం క్రైం, ఆగస్టు 24: సులువుగా దొంగతనాలు చేసేందుకు అనువుగా ఉన్న ఏటీఎం కేంద్రాలే టార్గెట్. అర్ధరాత్రి 2 నుంచి తెల్లవారు జామున 4 గంటల మధ్యలో వస్తారు. ముఖాలకు ముసుగులు ధరించి గ్యాస్ కట్టర్‌తో మిష న్‌ను కట్ చేసి చోరీ చేస్తారు. ఇలా అనం తపురం, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటకలో దాదాపు రూ.కోటి దోచుకున్నా రు. చివరకు అనంతపురం జిల్లా పోలీసులు శనివారం ఈ ముఠాను అరెస్టు చేశారు. హరియాణాకు చెందిన 12 మంది దొంగల ముఠాలో పోలీసులు ఐదుగుర్ని అరెస్ట్ చేయగా, మరో ఏడుగురు పరారీలో ఉన్నారు. దొంగల నుంచి 2 లక్షల నగదు మాత్రమే రికవరీ చేశారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అనంతపురం నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ స్టాఫ్, కర్ణాటక పోలీసులు శ్రమించారు. ఈ నెల 8న అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు రూ.29.80 లక్షలను ఎత్తుకెళ్లారు. ఈ నెల 2న కల్లూరు ఎస్బీఐ ఏటీఎంలో రూ.3,26,600, జూన్ 7న కూడేరు మండల కేంద్రంలోని ఏటీఎంలలో రూ.18,41,300 చోరీ చేశారు. కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌లో ఏటీఎం సెంటర్‌లో రూ.18,24,500 చోరీ చేశారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో రూ.25,98,400 చోరీ చేశారు. నిందితుల నుంచి గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5 సెల్‌ఫోన్లు, 3 ఇనుప రాడ్లు, ఒక బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రేలు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు.

వైసీపీలో మరో 'బూతు నేత'

అనంతబాబు నగ్న వీడియో కలకలం



వీడియో కాల్‌లో అనంతబాబు

అమరావతి, రంపచోడవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన మరో 'బూతు నేత' వీడియో కలకలం సృష్టించింది. అప్పుడు... మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తరహాలోనే ఇప్పుడు మాజీ ఎమ్మెల్సీ అనంత బాబు వీడియో ఒకటి బయటపడింది. ఆయన ఒక మహిళతో వీడియోకాల్‌లో మాట్లాడుతున్న 'నగ్న వీడియో' ఒకటి శనివారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీంతో.. అనంతబాబు సాగించిన వ్యవహారాలు మరోసారి చర్చకు వచ్చాయి. డ్రైవర్ సుబ్రమణ్యం హత్య-మృతదేహం డోర్‌డెలివరీ, రంపచోడవరం ఏజెన్సీలో కలప మాయం, టేకుచెట్ల కొట్టివేత.. ఇలా అనంతబాబుపై ఆరోపణలు ఉన్నాయి. కాగా... ఆ వీడియోలో ఉన్నది తాను కాదని, మార్ఫింగ్ చేశారని అనంతబాబు వెల్లడించారు. కాగా మహిళా పక్షపాతి అని చెప్పుకొనే జగన్ ఇప్పుడు ఏం చెబుతారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రశ్నించారు.

గంజాయి ముఠా హల్‌చల్

- తనిఖీలు చేస్తున్న డీఎస్పీపైకి దూసుకెళ్లిన వాహనం
- సినీఫక్కీలో పోలీసుల చేజింగ్... చివరకు పట్టివేత



కల్వర్టును ఢీకొని ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 24: నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠా హల్‌చల్ చేసింది. గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించిన పోలీసులను ఢీ కొట్టుకుం టూ దూసుకెళ్లింది. చివరకు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు వైపుగా చెన్నైకి భారీగా గంజాయి రవాణా చేస్తున్నట్లు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావుకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి వెంకటాచలం వద్ద తనిఖీ చేపట్టారు. రాత్రి 1.30 ప్రాంతంలో ఓ వాహనాన్ని ఆపారు. అయితే, డ్రైవర్ ఆపినట్టే ఆపి డీఎస్పీ సమీపం నుంచి దూసుకెళ్లాడు. ఈ వేగానికి డీఎస్పీ కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. అక్కడినుంచి వాహనం గూడూరులోకి వెళ్లింది. పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా.. వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా వారిపైకి కూడా దూసుకెళ్లింది. చివరకు కోనసముద్రం గ్రామంవైపు వాహనం వెళ్లినట్లు గుర్తించిన ఆత్మకూరు సీఐ గంగాధర్ వెంటాడారు. అయితే, మలుపు వద్ద కల్వర్టుపై ఉన్న సిమెంట్ దిమ్మెను సీఐ కారు ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. మరో వాహనంలో వెనుకే వస్తున్న పోలీసులు గంజాయి ముఠా వాహనాన్ని వెంటాడారు. చివరకు కోనసముద్రం దాటాక రోడ్డు లేకపోవడం తో నిందితుడు చిక్కాడు. రాజమండ్రి సమీపంలో రాజానగరానికి చెందిన డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. కాగా, వెంకటాచలం వద్ద కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని తెలిసింది.

ఆకతాయి చేష్టతో 'ఆపద'

- విషవాయువు పీల్చి 25 మందికి అస్వస్థత
- బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో ఘటన
- అధికారుల పర్యవేక్షణ.. చంద్రబాబు ఆరా

బాపట్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి చేసిన ఆకతాయి పనికి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విషవాయువు పీల్చి ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారు. ఉపాధ్యాయులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది. శనివారం బాపట్లలోని కేంద్రీయ విద్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం ఉదయం 6వ తరగతి విద్యార్థులకు టీచర్ సైన్స్ క్లాస్ తీసుకున్నారు. రసాయన ప్రయోగాలను ప్రాక్టికల్స్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈలోగా పీరియడ్ సమయం అయిపోవడంతో టీచర్ వెళ్లారు. అక్కడ ఉన్న రసాయనాలకు ఓ విద్యార్థి శానిటైజర్‌కు తోడు మరో విద్యార్థిని బ్యాగులో ఉన్న ఉప్పు, కాఫీ పొడి మిక్స్ చేశాడు. దీంతో తరగతి గది అంతా ఒక్కసారిగా విషరసాయనాలు పొగలు పొగలుగా వ్యాపించాయి. ఇవి పక్క గదిలోని ఏడో తరగతి విద్యార్థులను కూడా తాకాయి. కొంత మంది విద్యార్థులు టిష్యూ పేపర్ మీద ఆ రసాయనాన్ని వేసి వాసన చూడడంతో మరింత అస్వస్థతకు గురయ్యారు. ఊపిరి ఆడని పరిస్థితి ఏర్పడింది. ముగ్గురు విద్యార్థులు తరగతి గదిలోనే స్పృహ తప్పి పడిపోయారు. పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు వెంటనే సూర్యలంకలోని ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత బాపట్ల ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆసుపత్రికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఘటన జరిగిన వెంటనే అధికారులు స్పందించారు. జాయింట్ కలెక్టర్ సుబ్బారావు హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. కలెక్టర్ వెంకటమురళి ఎప్పటికప్పుడు పిల్లల పరిస్థితిపై వాకబు చేశారు. ఆర్డీవో రవీందర్ విద్యార్థులు డిశ్చార్జ్ అయ్యే వరకు ఉండి పరిస్థితిని సమీక్షించారు.

తప్పిన పెనుప్రమాదం

విద్యార్థులు మరికాసేపు అదే తరగతి గదిలో ఉండి విషవాయువును మరింత పీల్చి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేదని చెబుతున్నారు. సకాలంలో ఉపాధ్యాయులు స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. అస్వస్థతకు గురైన 25 మంది విద్యార్థులను ఏరియా ఆసుపత్రికి తరలించగా, వారిలో 23 మందిని సాయంత్రానికే డిశ్చార్జ్ చేశారు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి తీవ్ర జ్వరం ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. మరో విద్యార్థికి గుండెకు సంబంధించి ఎప్పటి నుంచో సమస్య ఉన్నట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లారు.

ఘటనపై చంద్రబాబు ఆరా

కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి ప్రాణాపాయం లేదని, అందరికీ మెరుగైన వైద్యం అందించి ఇళ్లకు పంపుతున్నామని అధికారులు సీఎంకు వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

రేపటి నుంచి క్రీడా పోటీలు

విజయవాడ స్పోర్ట్సు: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న శాప్ వీసీ, ఎండీ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో స్కూల్స్, కళాశాలలు, జిల్లాస్థాయిలో ఐజీఎంసీలో ఈ నెల 26 నుంచి 31వ వరకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీవో ఎస్‌ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన, జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను ఈ నెల 29న స్టేడియంలో సన్మానించి ప్రశంసాపత్రాలను అందిస్తామన్నారు. వివరాలకు 94944 81669లో సంప్రదించాలన్నారు.

నేటినుంచి నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు

పటమట: స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సమరం తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. భారత ప్రభుత్వం, ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఉన్న ఐ బ్యాంక్స్ నేత్రదానంపై ప్రచారం చేసేలా సంస్థలు ఈ ప్రచార పక్షోత్సవాల్లో పాల్గొంటున్నాయన్నారు. ఈ నెల 26న స్థానిక నాస్తిక కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్లో పక్షోత్సవాల ప్రారంభ సభ జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మేయర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ ఎస్ఎన్ మూర్తి హాజరవుతారన్నారు. 29న స్కూల్, కాలేజి విద్యార్థులకు నేత్రదాన ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు, 30న చిత్రలేఖన ఆటల పోటీలు ఉంటాయన్నారు. డాక్టర్ బీ కీర్తి, డాక్టర్ పీ దీక్ష, మారు, నియంత పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి

కృష్ణలంక: చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా బీసీ కులాలకు మేలు జరుగుతుందనే సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూడు స్లాబుల్లో రుణాలందించేలా బీసీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, 40 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణం తీసుకొనేందుకు అవకాశం కల్పించడం, బీసీల ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అవ్వడానికి అవకాశం ఉందని దేరంగుల సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ బీసీ కార్పొరేషన్లన్నీ నిర్వీర్యం చేయడంతో పాటు ఏ ఒక్క కులానికి రుణం తీసుకొనే అవకాశం కల్పించకుండా నోట్లో మట్టి కొట్టాడన్నారు.

హిమోఫిలియా ప్రాణాంతకం

లబ్బీపేట: హిమోఫిలియా ప్రాణాంతకమని, ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాలను కాపాడవచ్చని ఏపీఎస్ఏసీఎస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ బ్లడ్‌సెల్ విభాగం, హిమోఫిలియా సొసైటీ విజయవాడ చాప్టర్ సహకారంతో హిమోఫిలియో, హిమోగ్లోబినోపతిపై రాష్ట్రస్థాయి సమగ్ర శిక్షణ నగరంలో గ్రాండ్ విజయవాడ హోటల్లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అయన మాట్లాడుతూ హిమోఫిలియా అనేది ఎక్కువగా వారసత్వంగా జన్యులోపంతో వస్తుందని, రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావం ఆపడానికి అవసరమైన ప్రక్రియను నిరోధిస్తుందన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యంతో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే సుధాకర్, నేషనల్ హెల్త్ మిషన్ బ్లడ్ సెల్ విభాగ ప్రతినిధి డాక్టర్ సానియా మోహన్, డాక్టర్స్ రాజేంద్రప్రసాద్, మాగంటి ప్రసాద్, చాప్టర్ ప్రతినిధులు, పాల్గొన్నారు. 21 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 9 ప్రభుత్వ జిల్లా ఆసుపత్రుల వైద్య నిపుణులు, శిక్షకులు పాల్గొన్నారు.

ప్రముఖ చిత్రకారుడు బొండాకు అవార్డు

వన్‌టౌన్: గిరిజన జీవితాలను చిత్రాల రూపంలో ఆవిష్కరించి చైతన్యం కల్పిస్తున్న చిత్రకారుడు బొండా జగన్మోహనరావుకు ప్రైడ్ భారత్-2024 అవార్డు లభించింది. భోపాల్‌కు చెందిన ది గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఈ అవార్డును కొరియర్ ద్వారా పంపించింది. భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన జగన్మోహనరావు మాట్లాడుతూ తాను గీసిన గిరిజన జీవనవిధానాల చిత్రాలకు ఇప్పటికే 200 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. చిత్రకారులు వివిధ సామాజిక అంశాలపై చిత్రాలను గీసి వారి అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు.

శ్రీనివాస ప్రసాద్ సేవలు మరువలేనివి

రైల్వేస్టేషన్: ప్రధాన శిక్షకుడు శ్రీనివాస ప్రసాద్ సేవలు మరువలేనివని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సీఅండ్ డబ్ల్యూ బ్రాంచి కార్యదర్శి కర్నాలు సుకుమార్ కొనియాడారు. పదవీ విరమణ చేసిన శ్రీనివాస ప్రసాద్ వీడ్కోలు సత్కారం శనివారం వేగన్ డిపోలో జరిగింది. సంఘ నేతలు పాల్గొని ఘనంగా సత్కరించారు. బ్రాంచ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, బీఈసీ సభ్యులు కొండలరావు, వెంకటేశ్వరరావు, గోవింద్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ

భారతీనగర్: ప్రకృతి సేద్యం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని గ్రీన్ ల్యాండ్ క్యాపిటల్ సంస్థ ఎండీ నిడదవోలు వినయ్ రామ్ అన్నారు. భారతీనగర్ నోవాటెల్ హోటల్లో గ్రీన్‌ల్యాండ్ క్యాపిటల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రకృతి సేద్యం అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వినయ్ రామ్ మాట్లాడుతూ రసాయనికంగా మారిన భూములను సారవంతమైన భూములుగా మార్చాలన్నదే సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. సంస్థ ప్రతినిధులు జి.కోటేశ్వరరావు, ఎం.రమేష్‌నాయుడు, ఈ కిరణ్ కుమార్, ఎస్ పూర్ణచంద్రరావు, బి. రమేష్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా రేపు ధర్నా

ధర్నాచౌక్: కార్పొరేటీకరణకు, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివాసీల జీవించే హక్కు కోసం ఈ నెల 26న స్థానిక ధర్నాచౌక్‌లో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీల హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ధర్నా కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను పరిరక్షించే చట్టాలకు తుంగలో తొక్కి వారిని అణచివేసేందుకు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ ధర్నా జరుగుతుందన్నారు. బి.కొండారెడ్డి, టి.అంజనేయులు, పీకేఎస్, వి.హనుమంతరావు పాల్గొన్నారు.

అన్నదాన భాగ్యం పూర్వజన్మ సుకృతం

● వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు


తాడేపల్లిలో కూరగాయల వాహనానికి జెండా ఊపుతున్న ఢిల్లీరావు

కృష్ణలంక, ఆగస్టు 24: అన్నదానంలో భాగస్వాములయ్యే అవకాశం కలగడం పూర్వ జన్మ సుకృతమని, మానవ సేవను మించిన సేవ మరొకటి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి తాడేపల్లిలోని రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ వాసులు నన్నపనేని శివన్నారాయణ, అరుణ, దద్దనాల సూర్యనారాయణరావు, అనిత దంపతుల ఇంట జరిగిన విజయేంద్ర, రమ్యతేజ వివాహ సందర్భంగా 10 టన్నుల కూరగాయలను విరాళంగా అందించారు. ఈ వాహనానికి శనివారం ఢిల్లీరావు రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టీటీడీ అందిస్తున్న సేవల్లో భాగస్వామ్యం కావడం లభించే అవకాశం అందరికీ ఉండదన్నారు. ఇలాంటి మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిన దివంగత మండవ కుటుంబరావు వంటి వ్యక్తుల ఆశయాలను కొనసాగిస్తున్న మరడ నాగేంద్రను అభినందించారు. రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ సభ్యులు, పలువురు ధార్మిక, ఆధ్యాత్మిక వాదులు పాల్గొన్నారు.

టీటీడీకి 10 టన్నుల కూరగాయలు

భారతీనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మండవ కుటుంబరావు ఆశీస్సులతో మరడ నాగేంద్ర (నాగు) ఆధ్వర్యంలో భారతీనగర్ కాలనీలోని సత్యం టవర్స్ నుంచి శనివారం దాతలు సుంకర విజయబాబు, మల్లీశ్వరి, శ్రీనివాస్, ఆషాశ్రీ గొల్లు నరేంద్ర శ్యాంకుమార్, నితీష, దేవాన్షి మోక్షయ్ భార్గవ్ సహకారంతో టీటీడీ నిత్యాన్నదాన పథకానికి ఉచితంగా 10 టన్నుల కూరగాయలను పంపించారు. భారతీనగర్ కాలనీ అధ్యక్షుడు షైనేని సాయిబాబు జెండా ఊపి ప్రారంభించారు. దాతల కుటుంబసభ్యులు, పలువురు బంధుమిత్రులు పాల్గొన్నారు.


డీసీపీ చక్రవర్తిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్ ఆంటోని

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● డీసీపీ చక్రవర్తి

పటమట, ఆగస్టు 24: రహదారి భద్రత విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని ట్రాఫిక్ డీసీపీ కే చక్రవర్తి అన్నారు. పటమట నిర్మలా హైస్కూల్‌లో శనివారం ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత ప్రయాణం చేయాలని, తద్వారా ప్రమాణాలను దాటుకుని సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చునన్నారు. విద్యార్థులు, యువత పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జీబీ ఆంటోని, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మ్యాగీ పాల్గొన్నారు.



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగరావు

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

● సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పిలుపు

గవర్నర్‌పేట, ఆగస్టు 24: ఉత్తర భారతదేశంలో తన ప్రభావం తగ్గిపోతున్న విషయాన్ని గుర్తించిన సంఘ్ పరివార్ తన దృష్టిని ఒడిశా నుంచి తూర్పు తీర రాష్ట్రాలపై పెట్టిందని, తెలుగు నేలపై మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగరావు అన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కేడర్ వర్క్ షాపు శనివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో జరిగింది. 11 జిల్లాల నుంచి వందల సంఖ్యలో క్యాడర్ వర్క్‌షాపునకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బంగరావు మాట్లాడుతూ మిత్రపక్షాలను సైతం మింగేసే అలవాటున్న బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశాన్ని కబళించేందుకు ప్రయత్నిస్తోందని, దీంతో రెండు పక్షాల మధ్య సఖ్యత ఎక్కువ కాలం సాగదన్నారు. వర్క్‌షాపులో పలు తీర్మానాలు ఆమోదించారు. 16వ జాతీయ గ్రామీణ హామీ పథకంలో మోడీ సర్కార్ తెచ్చిన సవరణలు, బడ్జెట్ కేటాయింపులపై మండల స్థాయిలో చర్చ చేపట్టాలని, అక్టోబరు 1న గ్రామ పంచాయతీ కేంద్రంలో నిరసన చేపట్టాలని, నవంబరు 9న నగరంలో ప్రజా రాజకీయ సభను నిర్వహించాలని తీర్మానించారు. వర్క్‌షాపులో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్, రాందేవ్, ఏగుపాటి అర్జునరావు, తామడ అరుణ పాల్గొన్నారు.


గవర్నర్ పేట పోలీసులు, జాగిలంతో యాంటీ నార్కోటిక్ అవగాహన

డాగ్ స్క్వాడ్ యాంటీ నార్కోటిక్ అవగాహన సదస్సు విజయవంతం

వన్‌టౌన్, ఆగస్టు 24: యాంటీ నార్కోటిక్ అవగాహనలో గవర్నర్‌పేట పోలీసులు శనివారం డాగ్ స్క్వాడ్‌తో విజయవంతంగా నిర్వహించారు. ఈస్ట్ జోన్ డీసీపీ గౌతమి శాలి పర్యవేక్షణలో గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సత్యనారాయణ, ఉమన్ ఎస్ఐ ఈ. నారాయణమ్మ, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు. దుర్గాకళామందిరం రోడ్డు, ప్రభుత్వ పాతాసుపత్రి రోడ్డు, గ్లోబల్ ఆసుపత్రి రోడ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తుపదార్థాల వాడకంతో జరిగే అనర్థాల గురించి, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచటంపై అవగాహన కల్పించామన్నారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించి విజయవంతమైందని సీఐ సత్యనారాయణ తెలిపారు.


చైత్రదీపికను అభినందిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

క్రీడా రంగంలో నగర ఖ్యాతిని చాటి చెప్పాలి

● కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఆగస్టు 24: క్రీడారంగంలో నగర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన చైత్రదీపిక, దియాశ్రీని శనివారం కమిషనర్ ధ్యానచంద్ర వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో అభినందించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న చైత్రదీపిక ఇటీవల పొల్లాచి (కోయంబత్తూరు)లో ఆగస్టు 7 నుంచి 11 వరకు జరిగిన 2వ ఇండియా స్కేట్ గేమ్స్-2024లో 14-17 గ్రూప్‌లో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో 3 పతకాలు - సోలో డాన్స్‌లో రజతం, ఫ్రీ స్కేటింగ్‌లో రజతం, క్వార్టెట్‌లో కాంస్యం సాధించింది. అలాగే 59, 60, 61 రోలరు స్కేటింగ్ నేషనల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే దియాశ్రీ 11-14 గ్రూప్‌లో పెయిర్ స్కేటింగ్‌లో కాంస్యం, సోలో డాన్స్ రజతం సాధించింది. వారిరువురు కమిషనర్‌ను మార్యదపూర్వకంగా కలవగా ఆయన వారిద్దరినీ అభినందించారు.



పీస్ ర్యాలీ నిర్వహిస్తున్న స్టెల్లా విద్యార్థినులు, అధ్యాపక బృందం

స్టెల్లా విద్యార్థినుల శాంతి ర్యాలీ

పటమట, ఆగస్టు 24: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, మహిళకు భద్రత కల్పించాలని, కోల్‌కత్తాలో జరిగిన దుర్ఘటనలో బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ స్టెల్లా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు శాంతి ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ లేన్ ప్రారంభించి మాట్లాడుతూ మహిళలకు న్యాయం జరిగేలా చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. 600 మంది విద్యార్థినులు ప్లకార్డులతో నిర్మలా స్కూల్ జంక్షన్ నుంచి జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ కుల్‌రేఖ, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, హారిక, డాక్టర్ శ్రీనివాసరావు, కెప్టెన్ శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.



గానం చేస్తున్న జానపద గాయకుడు దామోదర్ గణపతి

జనరంజకం చేసిన జానపదం

విజయవాడ కల్చరల్, ఆగస్టు 24: సినీపదం జానపదం పేరిట నిర్వహించిన జానపద సంగీత నృత్య సమ్మేళనం జనరంజకంగా సాగింది. ప్రపంచ జానపద, తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని దామోదర్ జానపద సంస్థ, మామ్ ట్రస్ట్, దేశిక ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సాయంత్రం జానపద సంగీత నృత్య కదంబం నిర్వహించారు. గాయనీ, గాయకులు దామోదర్ గణపతిరావు డాక్టర్ జయం చక్రవర్తి డాక్టర్ లింగా శ్రీనివాసరావు, నీలపురి రాజులు సాంగ్ ఫేమ్, అనిల్‌కుమార్, సిరిమోక్ష, మహేశ్వరి గానం చేశారు. సేవా రంగంలో గోలి రవిచంద్ర-విజయవాడ, దాసరి లక్ష్మీ సంధ్య-విశాఖపట్నం, కవితా రంగంలో మామిళ్లపల్లి దీప్తి-గుంటూరు, మకాని హరిచందన-సత్తెనపల్లి, డాక్టర్ రాయవరపు సత్యభామ-కాకినాడ, జానకిపుత్ర దిలీప్ కుమార్-శ్రీకాకుళం, పసుపులేటి వెంకటరమణ-హైదరాబాద్, నప్పిడి సత్యనారాయణ-ఏలూరు, రవి (జబర్దస్త్)-విజయవాడకు కృష్ణవేణి పురస్కారాలిచ్చి ఘనంగా సత్కరించారు. దామోదర్ గణపతి నిర్వహించారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని కళాకారులను సత్కరించారు.

రేకుల షెడ్డు కూల్చివేత

● ఇరువర్గాల పరస్పర ఆరోపణలు

● కోర్టు స్టే ఉన్నా కూల్చేశారంటూ బాధితుల ఆందోళన


కూల్చివేసిన రేకుల షెడ్డు

విద్యాధరపురం, ఆగస్టు 24: భవానీపురం ప్రియదర్శిని కాలనీలోని కోర్టు పరిధిలో ఉన్న రేకుల షెడ్డును శనివారం వీఎంసీ అధికారులు కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే ప్రియదర్శిని కాలనీలో 30 ఏళ్లుగా శ్రీనివాసరెడ్డి, సుబ్బులు కుటుంబం ముప్పయ్యేడున్నర గజాల స్థలంలో తాటిఆకుల పాక ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. కరెంటు బిల్లు, ఇంటిపన్ను శ్రీనివాసరెడ్డి చెల్లిస్తున్నాడు. కోటేశ్వరరావు (అలియాస్ కోటయ్య) అనే వ్యక్తి స్థలం తనదేనంటూ పత్రాలు చూపించారు. శ్రీనివాసరెడ్డి కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నాడు. కోటయ్య కూడా కోర్టుకు వెళ్లాడు. కొన్నిరోజుల తరువాత శ్రీనివాసరెడ్డి రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అధికారులు షెడ్డును కూల్చివేశారు. దీంతో బాధితులు ఎమ్మెల్యే పీఎస్ శ్రీధర్, మాజీ కార్పొరేటర్ వద్దకు వెళ్లాడు. పీఎస్ శ్రీధర్ వివరాలు తెలుసుకుని రికార్డుల ప్రకారం ఎలా ఉంటే అధికారులు అలాగే చేస్తారన్నారు తమకు న్యాయం జరగలేదని భావించిన బాధితులు టీడీపీ నేత ఎంఎస్ బేగ్ వద్దకు వెళ్లారు. ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షెడ్డు కూల్చేముందు బాధితులకు నోటీసు ఎందుకివ్వలేదని ప్రశ్నించటంతో అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పీఎస్ అండతోనే కోటయ్య తమ రేకుల షెడ్డు ప్లానింగ్ సెక్రటరీ రియాజ్‌తో కూల్చివేయించారని బాధితులు ఆరోపించారు. ఆ స్థలం తనదేనని, కావాలనే శ్రీనివాసరెడ్డి కుటుంబం తమపై ఆరోపణలు చేస్తున్నారని కోటయ్య తెలిపాడు.

ట్రాఫిక్ ఏడీసీపీగా ప్రసన్నకుమార్



విజయవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ ఏడీసీపీగా ఏవీఎల్ ప్రసన్నకుమార్ ఉద్యోగ బాధ్యతలను శనివారం స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ రాజశేఖర బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలోని ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో అదనపు ఎస్పీగా పని చేస్తూ ప్రసన్నకుమార్ నగరానికి బదిలీ అయ్యారు.

దొంగస్వాముల ఆక్రమిత భూములు స్వాధీనం చేసుకోవాలి

● రాష్ట్ర హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నె

వన్‌టౌన్, ఆగస్టు 24: రాష్ట్రంలో నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలో దొంగరామధూత, తిరుపతి జిల్లాలో కల్కి ఆక్రమించిన అటవీ, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని కట్టిన అక్రమ కట్టడాలను ప్రభుత్వాధికారులు కూల్చడం లేదని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం అభినందనీయమని, ఏపీలోనూ అటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వైసీపీ కార్యాలయాలకు అనుమతులు లేవని కూలగొట్టడం మంచిదే అయినా, దొంగస్వాముల పేరుతో కోట్లాది రూపాయలు విలువైన ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన కట్టడాలపై ఎందుకు దృష్టి పెట్టడం ప్రశ్నించారు.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి



అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 24: కరెంట్ షాక్ తగిలి న్యూ రాజరాజేశ్వరిపేటలో ఓ మహిళ శనివారం మృతి చెందింది. డాబాపై నుంచి ఇనుప సామగ్రి కిందకు దింపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన గుండ్లతోటి నాగలక్ష్మి(38) స్థానికంగా టిఫిన్ హోటల్ నిర్వహిస్తుంది. భర్త పెయింట్ షాపులో పని చేస్తుంటాడు. శనివారం పాత ఇనుప సామగ్రి కొని, ఉల్లిపాయలిచ్చే బండి ఇంటి ముందుకు రావడంతో ఇంట్లో పాత సామగ్రిని డాబాపై నుంచి కిందకు దింపుతోంది. డాబాపైన ఇంకొన్ని ఇనుప చువ్వలుండగా వాటిని కూడా అమ్మేందుకు కిందకు దింపే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఇనుప చువ్వలు ఇంటి ముందున్న విద్యుత్ సర్వీస్ వైర్లకు తగిలాయి. దీంతో కరెంట్ షాక్‌కు గురైన నాగలక్ష్మి కుప్పకూలిపోయింది. స్థానికులు, బంధువులు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

బుడమేరులో గుర్తుతెలియని మృతదేహం

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 24: న్యూ రాజరాజేశ్వరిపేట సుందరమ్మ దిబ్బ ప్రాంతంలోని బుడమేరులో గుర్తు తెలియని మృతదేహాన్ని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. స్థానిక సుందరమ్మదిబ్బ సమీపంలోని బుడమేరులో వ్యక్తి మృతదేహం ఉండటాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 32 ఏళ్లుంటుందని బూ కలర్ జీన్స్ ఫ్యాంట్, కాఫీ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుదేహం 2 రోజులుగా బుడమేరులో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుడి చేయి మోచేతి వరకు చర్మం లేకుండా ఎముక కనిపించడం పోలీసులు గుర్తించారు. రైలు ఢీకొని బుడమేరులో పడి ఉంటాడా? లేక మరేదైనా జరిగి ఉంటుందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి బంగారు గొలుసు అపహరణ

విద్యాధరపురం, ఆగస్టు 24: గుంటుపల్లి, రమేష్ నగర్‌కు చెందిన కేశిరెడ్డి వెంకటేశ్వరరావు (65) బంగారు చైన్, లాకెట్‌ను గుర్తు తెలియని ఓ వ్యక్తి అపహరించినట్టు శనివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రమేష్ నగర్‌లోని లవ అపార్టుమెంట్‌లో ప్లాట్ నెం.106లో కేశిరెడ్డి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతను బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యి ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నాడు. స్వల్పంగా అనారోగ్యానికి గురవటంతో బాధితుడు వెంకటేశ్వరరావు జులై 26న మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు యాక్టివా బండిపై వెళ్లాడు. అక్కడ ట్రీట్‌మెంట్ జరిగిన అనంతరం ఇంటికి బయలుదేరాడు. నల్లకుంట సమీపానికి వచ్చేసరికి ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి బాధితుడు వెంకటేశ్వరరావును ఆపాడు. ఆ వ్యక్తి వెంకటేశ్వరరావును తన ఏటీఎం కార్డు నీవద్దే ఉందని ఇవ్వమన్నాడు. తన వద్ద లేదని చెప్పినా వినిపించుకోకుండా దబాయించాడు. ఆ వ్యక్తి వెంకటేశ్వరరావు మెడలోని చైన్‌కి ఉన్న వెంకటేశ్వరస్వామి లాకెట్‌పై ప్రమాణం చేయమని చెప్పగా, అందుకు వెంకటేశ్వరరావు చైన్ తీసి బండిపై పెట్టాడు. అదే సమయంలో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా వెంకటేశ్వరరావు మాట్లాడుతుండగా బండిపైనున్న సుమారు 17 గ్రాముల బంగారు చైన్, లాకెట్‌ను అతడు అపహరించి మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. బాధితుడు ఆరోగ్యం సరిలేక హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లాడు. శనివారం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీవోఏ నిధుల దుర్వినియోగంపై సీఐడీతో దర్యాప్తు చేయించండి

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి జూడో సీఈవో వినతి

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 24: ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ నిధుల దుర్వినియోగంపై సీఐడీతో విచారించాలని జూడో అసోసియేషన్ రాష్ట్ర సీఈవో నామిశెట్టి వెంకట్ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర విభజన చట్టం 2014 కింద ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు 58:42 నిష్పత్తిలో ఫండ్స్ పంపిణీ జరిగిందని, ఇందులో ఏపీ నెంబర్ 175/1961 కింద కేపీ రావు 2015లో రూ.18లక్షలు బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్ నుంచి నిధులను డ్రా చేశారని, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్‌కే పురుషోత్తమ్(ఏపీ నెంబర్ 569/2016) రిజిస్టర్డ్ 2017లో సిండికేట్ బ్యాంకు నుంచి రూ.27లక్షలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.10 లక్షల నిధులను డ్రా చేసి దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వీరిద్దరూ గుర్తింపు పొందిన క్రీడా సంఘం నుంచి సభ్యులుగా గుర్తింపబడలేదని, ఫోర్జరీ పత్రాలు, సంతకాలతో నిధుల దుర్వినియోగం చేశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని వెంకట్ కోరారు.

జూడో సీఈవో వెంకట్‌పై విచారణకు ఆదేశించండి

● మంత్రికి కేపీ రావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 24: జూడో అసోసియేషన్ నిధులను రూ.52 లక్షల దుర్వినియోగంతో పాటు, క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన జూడో అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట్‌పై అధికారులతో విచారణకు ఆదేశించాలని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఏపీవోఏ 1961/175 సెక్రటరీ కేపీ రావు కోరారు. స్పోర్ట్సు కోడ్, ఏపీ హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం జూడో అసోసియేషన్ సీఈవోగా కొనసాగడానికి అర్హుడు కాదని, అతడి భార్య కృష్ణా అసోసియేషన్, అతడి కుమారుడికి జిల్లా అసోసియేషన్‌లో పదవులిచ్చారన్నారు. తాను రూ.18లక్షలు ఏపీవోఏ ఖాతా నుంచి దుర్వినియోగం చేయలేదని, తామే స్వంత నిధులను ఏపీవోఏకు ఖర్చు చేశామని, 2015 నుంచి 2019 వరకు ఏపీవోఏ అధ్యక్షుడిగా సీఎం రమేష్, సెక్రటరీ జేసీ పవన్‌కుమార్ రెడ్డి ఉన్నారన్నారు. 2017 నుంచి హైకోర్టు ఉత్తర్వులతో నిధులను ఆపరేట్ చేయలేదన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 30 మందికి ఉపాధి

మొగల్రాజపురం, ఆగస్టు 24: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 30 మంది విద్యార్థులు ఉపాధి అవకాశాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కొలువు తీరిన తరువాత టీడీపీ ఎన్ఆర్ఐ సాధికారితా విభాగం అధ్యక్షుడు వేమూరి రవి చొరవతో రాష్ట్రంలో ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం జెన్‌పాక్ట్ సంస్థ కార్యాలయం ఏర్పాటుకు ముందుకొచ్చిందని నైపుణ్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అసోసియేట్ మేనేజర్ బొబ్బిలి కిరన్‌కుమార్ తెలిపారు. ఈ ప్రతిపాదనలో భాగంగా జెన్‌పాక్ట్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలలకు చెందిన డిగ్రీ, ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన 200 మంది విద్యార్థులు హాజరవగా వారిలో 30 మందిని రెండు దశల్లో ఎంపిక చేశారని కళాశాల ఉపాధి విభాగాధికారి కా పూరి శ్రీధర్ తెలిపారు. ఎన్నారై సాధికారితా పెట్టుబడుల విభాగం డైరెక్టర్ శీలం శ్రీకృష్ణ, ప్రతినిధులు హిమజ, ఏపీఎన్ఆర్టీఎస్ అధికారిణి పద్మావతి పాల్గొన్నారు.



కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

37 లక్షల సభ్యత్వం లక్ష్యం: పురందేశ్వరి

సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 24: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. శనివారం ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ కమిటీ భేటీ

- హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ సంక్షేమ కమిటీ సమావేశానికి హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలే అజెండాగా ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ సంక్షేమ కమిటీ శనివారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ కమిటీలో సభ్యుడిగా ఉన్న టీడీపీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సమావేశానికి హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి తీసుకోవలసిన చర్యలు, వారికి ప్రభుత్వం ఏ మేరకు మేలు చేయగలదన్న అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీలకు ఏ మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్లను వర్తింపజేస్తున్నారు? ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా శాఖల్లో రోస్టర్ విధానం అమలవుతోందా? లేదా? అన్న విషయాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల వివరాలను సేకరించి, దానికి అనుకూలంగా ప్రణాళికను సిద్ధం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు ఎంపీ ప్రసాదరావు తెలిపారు. బ్యాంకుల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రుణాలు తప్పకుండా మంజూరు చేయాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరువ చేయాలని, ప్రభుత్వ ఆశయాన్ని గౌరవించాలని బ్యాంకులకు ఆయన సూచించారు.

స్టీల్‌ప్లాంటులో 199 మందికి షోకాజ్

- హాజరులో తేడాలకు ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు
- ముగ్గురు ఉన్నతాధికారుల పోస్టులు మార్చిన యాజమాన్యం
- ఆందోళనకర వాతావరణం సృష్టిస్తున్నారు: కార్మిక సంఘాలు

విశాఖపట్నం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల హాజరులో తేడాలు వచ్చాయని, వాటికి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం 199 మంది ఇంజనీరింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. పనితీరు సరిగ్గా లేదని వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను ఆ పోస్టు నుంచి తప్పించి ఓఎస్డీగా మార్చేసింది. బ్లాస్ట్ ఫర్నేస్‌ల జీఎంగా వ్యవహరిస్తున్న అధికారిని ఉత్పత్తి సరిగ్గా లేదంటూ ఆ పోస్టు నుంచి తప్పించింది. మెటీరియల్ మేనేజ్‌మెంట్ జీఎంను కూడా మార్చేసింది. ఇవన్నీ శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో ఒకేసారి జరిగాయని, ప్లాంటులో భయానక వాతావరణం సృష్టించి, ఏదో చేయాలని అనుకుంటున్నారని సీఐటీయూ నాయకుడు అయోధ్యరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. విధులకు హాజరయ్యేవారు సమయం పూర్తికాకుండానే బయటకు వెళ్లిపోతున్నారని ఆరోపణలు రావడంతో అనేక నిరసనల మధ్య మార్చి నెల నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకుంటున్నారు. మొత్తం 12,500 మంది ఉద్యోగులు ఉండగా, వారికోసం వివిధ ప్రాంతాల్లో 250కి పైగా బయోమెట్రిక్ యంత్రాలు పెట్టారు. అలాగే మెయిన్‌గేటు వద్ద కొన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల కాంట్రాక్ట్ వర్కర్లు జాబితాలో పేర్కొన్న విధంగా విధులకు రావడం లేదని ఆరోపణలు రావడంతో వారిపైనా దృష్టి పెట్టారు. అయితే వారికి రిజిస్టర్‌లో సంతకం చేసే విధానమే పాటిస్తున్నారు. ఇప్పుడు వీరి హాజరుకు సంబంధించి తేడాలు వచ్చాయని, రిజిస్టర్‌లో సంతకాలు ఉన్నా, వారు ప్లాంటుకు వచ్చినట్టు మెయిన్‌గేటులో బయోమెట్రిక్ లేదని, దీనికి కారణాలు చెప్పాలంటూ 199 మంది ఇంజనీరింగ్ అధికారులకు యాజమాన్యం షోకాజ్ ఇచ్చింది. కాంట్రాక్టు కార్మికుల హాజరు కచ్చితంగా ఉండాలని భావించినప్పుడు వారికి కూడా బయోమెట్రిక్ తీసుకోవాల్సింది. అప్పుడు హాజరులో తేడాలు ఉంటే... వాటిని సరఫరా చేసిన వారికే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకునే వెసులుబాటు ఉండేది. కానీ ఆ పని చేయకుండా హాజరులో తేడాకు ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరడం ఆందోళనకర వాతావరణం సృష్టించడమేనని అయోధ్యరామ్ ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు అధికారికంగా హాజరు చూపిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించి, రెగ్యులర్ చేయాల్సిందిగా కోరే అవకాశం ఉన్నందున, ఆ సమస్య నుంచి తప్పించుకొని, మధ్యలో అధికారులను బలి చేయడానికి యాజమాన్యం ఇదంతా చేస్తోందని మండిపడ్డారు. ఇలాంటి తప్పులు ఏమైనా జరిగితే కార్మికులను సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పైనే చర్యలు తీసుకోవాలని, అధికారులకు షోకాజ్ ఇవ్వడం వెనుక వేరే కారణాలు ఉన్నాయని తెలిపారు. బ్లాస్ట్ ఫర్నేస్ లు నడపడానికి అవసరమైన మెటీరియల్ ఇవ్వకుండా, తగిన ఉత్పత్తి లేదంటూ అక్కడి జీఎంను తప్పించడం కూడా న్యాయం కాదని ఆయన పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేయాలి: సీపీఐ

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గృహ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు వద్దంటున్నా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అదానీ సంస్థ సిద్ధమవడానికి రాష్ట్రంలో ఉన్నది చంద్రబాబు ప్రభుత్వమా? లేక జగన్ సర్కారా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అనాలోచిత విధానాలకు, ఆదేశాలకు తలొగ్గిన గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్తు సంస్కరణలకు పచ్చజెండా ఊపిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఒప్పందాన్ని రద్దు చేయకపోతే మరో విద్యుత్తు ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

వారికి బదిలీల నుంచి మినహాయింపు

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి 31న గానీ అంతకన్నా ముందుగానీ (31-3-2025) పదవీ విరమణ పొందే ఉద్యోగులందరికీ ప్రస్తుతం జరిగే సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 15 ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం తాజాగా మరో శాఖలోని ఉద్యోగుల బదిలీల(మొత్తం 16శాఖల్లో)కు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చింది. డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ విభాగంలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత



అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ డప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర' కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తుసామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తన వంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేనివాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి- మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలుపెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఎక్కడి పనులు అక్కడే

45వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటివరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.

ఇసుక అక్రమాలపై కొరడా!

- ప్రకాశం జిల్లా గనుల కార్యాలయంపై ఏసీబీ దాడులు.. రికార్డుల తనిఖీలు
- రీచ్‌ల కేటాయింపు, అక్రమ రవాణా సహా పలు అంశాలపై నిశిత పరిశీలన

ఒంగోలు(క్రైం), ఆగస్టు 24: వైసీపీ హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా జేపీ వెంచర్స్ సంస్థ అక్రమాలను వెలికి తీయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఒంగోలులోని ప్రకాశం జిల్లా గనుల శాఖ కార్యాలయంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన తనిఖీల్లో గత ఐదేళ్లలో జిల్లాలో జరిగిన ఇసుక రీచ్‌ల కేటాయింపులు, ఇతరత్రా కీలక అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఇసుక తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు ఇచ్చిన అనుమతుల గురించి విచారించినట్లు తెలిసింది. కార్యాలయం గేట్లు మూసివేసి సిబ్బందిని మాత్రమే లోపలికి అనుమతించారు. రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రకాశం జిల్లాలో ఇసుక తవ్వకాల లీజును వైసీపీ హయాంలో జేపీ వెంచర్స్‌కు ఇచ్చారు. అయితే, జేపీ వెంచర్స్ అప్పట్లో అడ్డగోలుగా తవ్వకాలు, అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై ఏసీబీ అధికారులు సమగ్రంగా విచారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి ఎంత చెల్లించారు? అసలు బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా ఎలా జరిగింది? అన్న విషయాలపై కూడా లోతుగా ఆరా తీసినట్లు సమాచారం. ఇసుక తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్ ప్రభుత్వానికి రూ.13 కోట్లు చెల్లించాల్సి ఉందని గనుల శాఖ గతంలో నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. అయితే, ఆ మొత్తాన్ని ఇప్పటి వరకు చెల్లించలేదు. దీంతో బకాయిలకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఏసీబీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. కాగా, ఇసుక టెండర్లలో గనుల శాఖ మాజీ డైరెక్టర్ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఏసీబీ అధికారుల తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



ఏసీబీ అధికారులు తనిఖీ చేసిన ఒంగోలులోని గనుల శాఖ జిల్లా కార్యాలయం

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

- జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 24: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు శనివారం ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదేవిధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషధాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై వ్యవసాయశాఖ డైరెక్టర్ వివరణ

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని, డిమాండ్, సరఫరా, పంపిణీ తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఎక్కడైనా ఎరువుల్ని అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 'రైతును వేధిస్తున్న యూరియా, డీఏపీ కొరత' శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. సెప్టెంబరుతో ముగిసే ఖరీఫ్ సీజన్‌లో 6.5లక్షల టన్నుల యూరియా, 2.30లక్షల టన్నుల డీఏపీ అవసరం ఉండగా, ఇప్పటికే 6.68లక్షల టన్నుల యూరియా, 1.92లక్షల టన్నుల డీఏపీ సొసైటీలు, డీలర్లు, టోకు వ్యాపారుల వద్ద అందుబాటులో ఉందని చెప్పారు. పక్షం రోజులుగా ఎరువుల విక్రయాలకు సంబంధించి ఎఫ్ఎంఎస్‌లో నమోదులో జాప్యం వల్ల రికార్డుల్లో నిల్వలకు, వాస్తవ నిల్వలకు కొంత వ్యత్యాసం ఉన్న విషయం వాస్తవమేనన్నారు. వర్షాలు కురిసిన, డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ఎరువులు కేటాయించడం తప్ప.. ఇతర రాష్ట్రాలకు ఎరువుల్ని మళ్లించడం లేదని స్పష్టం చేశారు. రాబోయే సంవత్సరాల్లో నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించే దిశగా వ్యవసాయశాఖ కృషి చేస్తుందన్నారు.

గత ఐదేళ్లలో వాణిజ్య పన్నులశాఖలో అవినీతి, అక్రమాలు

- ఏసీబీతో దర్యాప్తు చేయించాలి: కేఆర్ సూర్యనారాయణ

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 24: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో గత ఐదేళ్లలో జరిగిన అవినీతి అక్రమాలపై ఏసీబీ లేదా విజిలెన్స్ శాఖలతో పూర్తి స్థాయి దర్యాప్తు చేయించి, బాధ్యులైన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. శనివారం విజయవాడలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘ అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ మాట్లాడుతూ గత రెండేళ్లలో రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించి వందలాది మంది కిందిస్థాయి ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, వీటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. 750 మందికి పైగా ఉన్న ఏపీటీఓలను ఖాళీగా ఉంచి వేతనాలిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, వీరందరికీ వెంటనే చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని కోరారు. విశాఖపట్నం, విజయవాడ-1 డివిజన్లలో క్రమశిక్షణ, దర్యాప్తుల పేరిట క్రిందిస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేశారని, బాధ్యులైన ఉన్నతాధికారులను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఎం. రమేష్ కుమార్, 16 డివిజన్లకు చెందిన అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

ప్రకాశం ఎస్పీ డీపీతో మస్కా!

- డబ్బు గుంజేందుకు నేరగాడి యత్నం.. ఆయన ఫేస్‌బుక్ ఫ్రెండ్‌తో చాటింగ్
- ఎస్పీకి సదరు వ్యక్తి సమాచారం వెంటనే మోసగాడి నంబర్ బ్లాక్



ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రకాశం ఎస్పీ విడుదల చేసిన ప్రకటన. చిత్రంలో ఎస్పీ డీపీతో మోసగాడు చేసిన వాట్సాప్ చాటింగ్

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24: సైబర్ నేరగాళ్లు.. రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల ఫొటోలు డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)గా పెట్టుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ప్రకాశం ఎస్పీ దామోదర్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని ఆయనకు తెలిసిన వ్యక్తి నుంచి ఓ మోసగాడు నగదు గుంజేందుకు ప్రయత్నించాడు. దీన్ని గమనించిన సదరు వ్యక్తి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వెంటనే మోసగాడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయించారు. శనివారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఆ మోసగాడు.. ఎస్పీ ఫేస్‌బుక్ ఫ్రెండ్‌కు తొలుత 'హలో... హౌఆర్ యూ... వేర్ ఆర్ యూ ఎట్ ది మూమెంట్' అని మెసేజ్ పంపాడు. అనంతరం మిస్‌డ్ వాయిస్ కాల్ చేశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి చాలా అత్యవసరం, ఆపదలో ఉన్నామంటూ మెసేజ్ చేసి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు పంపాలని కోరాడు. ఎస్పీకి ఆయన ఫేస్‌బుక్ ఫ్రెండ్ ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. దీంతో ఎస్పీ దామోదర్ అప్రమత్తమై వెంటనే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రముఖుల ఫొటోలు డీపీలుగా పెట్టుకొని కొందరు మాయగాళ్లు మోసం చేస్తున్నారని, ఎవరైనా అత్యవసరమని చెప్పి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు పంపాలని తొందరపెడితే నమ్మవద్దని కోరారు. అనుమానం వస్తే వెంటనే నంబర్‌ను బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రాష్ట్రంలో ఫైబర్ సేవల విస్తరణ

- 35 లక్షల సీపీఈలు ఇవ్వండి
- 'భారత్ నెట్' రెండో దశ కింద 635 కోట్లు రీయింబర్స్ చేయండి
- కేంద్ర మంత్రి పెమ్మసానికి సర్కారు వినతి



రాష్ట్రంలో భారత్ నెట్ ప్రాజెక్టు అమలుపై నివేదికను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు అందజేస్తున్న పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేష్ కుమార్, ఏపీ ఫైబర్ నెట్ ఎండీ దినేశ్ కుమార్

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫైబర్ నెట్ సేవలను మరింతగా విస్తరిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. దీనికిగాను తక్షణమే 35 లక్షల కస్టమైజ్డ్ ప్రెమిసెస్ ఎక్విప్‌మెంట్(సీపీఈ)లను ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. అదేవిధంగా 'భారత్ నెట్' రెండో దశ కింద రూ.635 కోట్లను రీయింబర్స్‌మెంట్ చేయాలని విన్నవించింది. ఈ మేరకు రాష్ట్ర మౌలిక సదుపాయాలకల్పన శాఖ కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్, ఫైబర్ నెట్ ఎండీ కె. దినేశ్‌కుమార్ శనివారం ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్‌తో భేటీ అయి అభ్యర్థించారు. రాష్ట్రంలో భారత్‌నెట్-1 కింద అమలు చేసిన ఫైబర్‌నెట్ సేవలు విజయవంతమయ్యాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి సురేశ్‌కుమార్ వివరించారు. రాష్ట్రంలో అమలు చేసిన సాంకేతిక విధానం జాతీయస్థాయిలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. తొలిదశలో 9.7 లక్షల కనెక్షన్లు ఇచ్చామని, వీటిలో కొన్ని కనెక్షన్లు పోగా ప్రస్తుతం 5 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ సేవలు అందుతున్నాయని సురేశ్‌కుమార్ వివరించారు. వీటితో పాటు 6,200 పాఠశాలలు, 1,978 ఆరోగ్య కేంద్రాలు, 11,254 గ్రామ పంచాయితీలు, 193 టెలికం టవర్లు, 9,104 ప్రభుత్వ సంస్థలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఫైబర్ నెట్ సేవలు విస్తరించేందుకు సీపీఈల అవసరం చాలా ఉందన్నారు. తక్షణమే 35 లక్షల సీపీఈ బాక్సులు కావాలని కోరారు. భారత్ నెట్-1 కింద ఉమ్మడి విశాఖ, చిత్తూరు జిల్లాల్లోని 57 మండలాలు, 1,692 గ్రామపంచాయతీలలో ఫైబర్‌నెట్ సేవలు అందించామన్నారు. రాష్ట్రంలో ఈ సేవలు విస్తరించేందుకు వీలుగా భారత్ నెట్ 2వ దశ కింద రూ.635 కోట్లను తక్షణమే రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 25 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

జవహర్ నవోదయ విద్యాలయాల్లో

ఆరోతరగతి ప్రవేశాలు

నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు. తొమ్మిది నుంచి పన్నెండో తరగతి విద్యార్థులు మాత్రం విద్యాలయ వికాస్ నిధి కోసం నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. బాలికలు; దివ్యాంగులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు; పేదింటి పిల్లలకు దీని నుంచి మినహాయింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలైతే నెలకు రూ. 1500 చెల్లించాలి. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మాతృభాష/ప్రాంతీయ భాషలో బోధన ఉంటుంది. తరవాత మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో; సోషల్ సైన్స్‌ను హిందీలో బోధిస్తారు. ఈ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంది.



విద్యాలయాలు-సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 653 జేఎన్‌వీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 13 విద్యాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు మరో రెండు విద్యాలయాలు కేటాయించారు. తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ఒక్కో విద్యాలయంలో ఆరోతరగతిలో గరిష్ఠంగా 80 మందికి అవకాశం కల్పిస్తారు. జిల్లాల వారీగా సంబంధిత జేఎన్‌వీల్లో గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జులై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కో దానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధగంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

రిమైండర్



జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,200(ఎక్స్ఎల్ఆర్ఐ అందిస్తున్న పీజీడీఎంలో చేరాలంటే అదనంగా రూ.200 చెల్లించాలి)
- **ఎక్స్ఎల్ఆర్ఐ ప్రోగ్రామ్‌లు:** బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్, ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్, ఎక్స్ఎల్ఆర్ఐ-ఆర్‌బీఎస్ డబుల్ మాస్టర్స్ ప్రోగ్రామ్, ఇన్నోవేషన్-ఆంత్రప్రెన్యూర్‌షిప్-వెంచర్ క్రియేషన్ ప్రోగ్రామ్
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 20 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **టెస్ట్ ప్రాథమిక కీ విడుదల:** 2025 జనవరి 10
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఇండోర్ ఐఐఎంలో పీజీపీఎంఎక్స్

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్(పీజీపీఎంఎక్స్)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఆల్టర్నేట్ వీకెండ్ ప్రోగ్రామ్. ఏడాదికి మూడు టర్మ్‌లు ఉంటాయి. మొదటి ఏడాది కోర్ కోర్సులు, రెండో ఏడాది ఎలక్టివ్ కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా అయిదు రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్, ఆన్‌లైన్ ప్రిపరేటరీ కోర్సులు, క్యాప్‌స్టోన్ కోర్సు, కోర్సు రైటింగ్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌ని ముంబై క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీని ప్రదానం చేస్తారు.

ఎలక్టివ్ కోర్సులు: కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్ఆర్ఎం, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్

ఆన్‌లైన్ ప్రిపరేటరీ కోర్సులు: ఫైనాన్స్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ ఫర్ మేనేజ్‌మెంట్, క్వాంటిటేటివ్ మెథడ్స్, స్ప్రెడ్‌షీట్ మోడలింగ్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల మేనేజీరియల్/ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **ప్రోగ్రామ్‌నకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ వెబినార్‌లు:** సెప్టెంబరు 1, సెప్టెంబరు 29 ఉదయం పదిన్నరకు
- **దరఖాస్తు ఫీజు:** రూ.5,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 13
- **ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 20
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** iimidr.ac.in

జాబ్ కార్నర్

ఎన్‌పీసీఐఎల్‌లో స్టయిపెండరీ ట్రెయినీలు

ఖాళీలు 279

రావత్‌భట రాజస్థాన్ సైట్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ ఆపరేటర్: **153 పోస్టులు**
2. కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ మెయింటెయినర్: **126 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెషినిస్ట్/టర్నర్, వెల్డర్.

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 12వ తరగతి(సైన్స్ సబ్జెక్టుల్లో), సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 11 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: www.npcil.nic.in/index.aspx

బీఈఎంఎల్‌లో గ్రూప్-సి పోస్టులు

ఖాళీలు 100

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్ లిమిటెడ్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఐటీఐ ట్రెయినీ: **54 పోస్టులు**
2. ఆఫీస్ అసిస్టెంట్ ట్రెయినీ: **46 పోస్టులు**

విభాగాలు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 37 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: రూ.200; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: www.bemlindia.in/

ఎన్ఐఓలో స్టెనోగ్రాఫర్ పోస్టులు

ఖాళీలు 9

గోవాలోని సీఎస్ఐఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ(ఎన్ఐఓ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ స్టెనోగ్రాఫర్: **5 పోస్టులు**
2. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేస్): **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2/ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు రూ.25,000- రూ.81,000; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.19,900 - రూ.63,200.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 19 నాటికి జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.nio.res.in/

యూసీఎస్ఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

ఖాళీలు 8

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, నావల్ ఆర్కిటెక్చర్

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 65 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 5 నాటికి 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 5

వెబ్‌సైట్: https://udupicsl.com/

సాహిత్య అకాడమీలో ఉద్యోగాలు

ఖాళీలు 12

ఢిల్లీలోని సాహిత్య అకాడమీ... డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డిప్యూటీ సెక్రటరీ
2. రీజనల్ సెక్రటరీ
3. పబ్లికేషన్ అసిస్టెంట్
4. ప్రోగ్రామ్ అసిస్టెంట్
5. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3
6. జూనియర్ క్లర్క్
7. అసిస్టెంట్ ఎడిటర్
8. సబ్ ఎడిటర్(ఇంగ్లిష్)
9. ప్రూఫ్ రీడర్ కమ్ జనరల్ అసిస్టెంట్
10. మల్టీ టాస్కింగ్ స్టాఫ్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా జర్నలిజం, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు డిప్యూటీ సెక్రటరీ పోస్టుకు రూ.67,700 - రూ.2,08,700; అసిస్టెంట్ ఎడిటర్ పోస్టుకు రూ.56,000 - రూ.1,77,500; పబ్లికేషన్ అసిస్టెంట్, సబ్ ఎడిటర్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.25,000 - రూ.81,100.

పని ప్రదేశాలు: ఢిల్లీ, బెంగళూరు, ముంబయి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సెక్రటరీ, సాహిత్య అకాడమీ, రవీంద్ర భవన్, 35 ఫిరోజ్‌షా రోడ్, ఢిల్లీ చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: sahityaakademi.gov.in/



ఎన్ఐబీలో జూనియర్ సైంటిస్టులు

ఖాళీలు 6

నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సైంటిస్ట్ గ్రేడ్-1: **1 పోస్టు**
- సైంటిస్ట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
- జూనియర్ సైంటిస్ట్: **2 పోస్టులు**
- అసిస్టెంట్ -2: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థుల విద్యార్హత, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 23


వెబ్‌సైట్: https://www.nib.gov.in/

చిట్టీ చిట్టీ




ధర్మారాయుడి తీర్పు

ఒక ఊరిలో ధర్మారాయుడు అనే గ్రామాధికారి ఉండేవాడు గ్రామంలో వచ్చే చిన్నా పెద్దా తగాదాలలో అతను మంచి న్యాయమైన తీర్పులు చెబుతాడని చుట్టుపక్కల అతనికి మంచి పేరుండేది. ఆ గ్రామంలో ఒక వర్తకుడు రామయ్య అనే రైతుకు తన పొలంలోని బావిని అమ్మాడు. కానీ రామయ్య ఆ బావిలోని నీళ్ల వాడుకోబోతుండగా వర్తకుడు రామయ్యతో 'నేనునీకు బావి మాత్రమే అమ్మాను కానీ అందులోని నీళ్ల కాదు. ఆ నీళ్ల ఇంకా నావే. కాబట్టినువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ బావిలోని నీళ్ల వాడుకోకూడదు' అని షరతు పెట్టాడు. ఈ మాటలు విన్న రామయ్యకు ఏం చేయాలో పాలుపోక, ధర్మారాయుడికి ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని మిగతా వారందరికీ వర్తకుడు పెట్టిన షరతు అన్యాయంగా అనిపించినా ఎవరూ ఏమీ చేయలేక ఊరుకున్నారు. విషయం తెలుసుకున్న ధర్మారాయుడు వర్తకుడిని పిలిచి, నువ్వు రామయ్యకు బావిని మాత్రమే అమ్మావు కనుక అతని బావిలో నీ నీళ్ల ఉండటం న్యాయ సమ్మతం కాదు. నీ నీళ్లన్నిటినీ తీసుకెళ్లి మరెక్కడైనా దాచుకో లేదా నీళ్ల బావిలో ఉంచినందుకు, రామయ్యకు అద్దెచెల్లించు అని తీర్పు ఇచ్చాడు. అందరూ వర్తకుడి మోసనపు బుద్ధికి మంచి గుణపాఠం నేర్పాడని ధర్మారాయుడిని పొగిడారు.




10 తేడాలు గుర్తించండి

సరైన నీడ ఏది



దాగి ఉన్న 10 వస్తువులను కనిపెట్టండి?



ఆవులు, ఎద్దులు ఎన్ని ఉన్నాయి?





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 393

	6	4			5
3				4	
	5				1
2			4	1	

సుడోకు - 392 సమాధానం

1	6	4	3	2	5
5	2	3	1	6	4
3	1	6	5	4	2
4	5	2	6	3	1
6	4	1	2	5	3
2	3	5	4	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.